
ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


మున్సిపల్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలి

యూరియా సరఫరా కేంద్రం బాధ్యతే

నాడు కెజిఎఫ్.. నేడు జిజిఎఫ్ 03


సంపుటి 09, సంచిక: 205 | గురువారం | 25-06-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




నిరసన తెలుపుతున్న విద్యార్థులను

## ఉగ్రవాదులు అంటారా?

● మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శ
● మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై ప్రధాన్ ఉగ్రవాద వ్యాఖ్యలు చేయడన్ని తీవ్రంగా తప్పుబట్టారు. '90 పేపర్ లీక్‌లు జరిగాయి, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైంది, నీట్ పేపర్ లీక్ కారణంగా 20 మంది పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారు, కుటుంబాలు నాశనమయ్యాయి' అని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన కుర్చీకి అతుక్కుని ఉన్నారని, ఇంటర్వ్యూలు ఇస్తూ 'విద్యార్థుల ప్రతిధ్వని'ని 'ఉగ్రవాదుల' ప్రతిధ్వని అని పిలుస్తున్నారని దుయ్యబట్టారు. ప్రధానమంత్రి మోదీ స్వయంగా పార్లమెంటులో రైతులకు మేలు చేసేవారిని 'ఆందోళనజీవి', 'పరాన్నజీవులు' అని అవమానకరంగా తరువాయి 8లో



తుంగభద్ర నికర వాటా వినియోగానికి

# జోక్యం చేసుకోండి

> రాజోలి బండ డైవర్సన్ కెనాల్ ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ.59 కోట్లు డిపాజిట్ చేసింది. పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్యాకేజీ 1, 2 పనులు ఇప్పటికీ చేపట్టలేదు, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తి అయ్యాయి. నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలి. కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సిఎంలతో జరిగే సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించాలి.
> — సిఎం రేవంత్‌రెడ్డి

● భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయపర్చండి
● కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
● తెలంగాణ, ఎపి, కర్నాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి సిడబ్ల్యుసి సారథ్యంలో తుంగభద్ర బోర్డును పటిష్టం చేయాలని వినతి
● తెలంగాణకు హక్కుగా 15.9 టిఎంసి నీరు రావాల్సి ఉన్నా, ఐదారుకు మించి రావడం లేదని ఆందోళన
● తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్‌డిఎస్, అంతర్‌రాష్ట్ర నదీ జలాల వివాదంపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

తుంగభద్ర నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి సిడబ్ల్యుసి సారథ్యంలో తుంగభద్ర బోర్డ్‌ను పటిష్టం చేయాలని సిఎం కోరారు. 'తుంగభద్ర డ్యామ్, నదీ ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టిఎంసిల నీరు రావాల్సి ఉంది. ఇప్పుడు ఐదారు టిఎంసిలకు మించి రావడంలేదు. ఆర్‌డిఎస్ కింద జోగులాంబ గద్వాల జిల్లాలో దాదాపు 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది' అని తరువాయి 8లో

డొనాల్డ్ ట్రంప్‌కు

# సెనేట్ షాక్

● యుద్ధం ఆపుతారా? కాంగ్రెస్ అనుమతి పొందుతారా?
● అసాధారణ తీర్మానం



**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో యుద్ధం ఆపుతారా? లేక సైనిక చర్యకు ముందు కాంగ్రెస్ అనుమతి పొందుతారా? అని డోనాల్డ్ ట్రంప్‌ను డిమాండ్ చేస్తూ డెమోక్రాట్ల ఆధిపత్యం ఉన్న ఎగువసభ సెనేట్ మొదటిసారి అసాధారణ తీర్మానం చేసింది. ట్రంప్‌కు ఉన్న యుద్ధ అధికారాల చట్టంపై కొందరు రిపబ్లికన్లు కూడా జత కలవడంతో 50–48 ఓట్ల తేడాతో ఈ తీర్మానం ఆమోదం పొందింది. ఇదే తీర్మానాన్ని ఈనెలారంభంలో దిగువసభలో కూడా 215–208 ఓట్ల తేడాతో ఆమోదించారు. దిగువసభలో ఈ తీర్మాన సమయంలో నలుగురు రిపబ్లికన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా డెమోక్రాట్లతో చేతులు కలిపారు. ఉభయసభలూ ఈ తీర్మానాన్ని ఆమోదించినప్పటికీ దీనిని దేశాధ్యక్షుడి పరిశీలనకు పంపించే అవకాశం తరువాయి 8లో

## ఎండలు.. వాడగాడ్పులతో గడగడలాడుతున్న యూరప్

● ఫ్రాన్స్‌లో 42కు పెరిగిన మృతులసంఖ్య ● బ్రిటన్‌లో 1000 స్కూళ్ళు మూసివేత



**పారిస్:** ఊహించని ఎండలు, వడగాలులతో యూరప్ దేశాలు గడగడలాడుతున్నాయి. ఫ్రాన్స్‌లో ఎండవేడి,వడగాలి భరించలేక ఉపశమనం కోసం నీటి వనరులలో దూకి 20 మంది మరణించారు.ఫ్రాన్స్‌లో వడగాలులవల్ల మరణించినవారి సంఖ్య ఇప్పుడు 42 కు పెరిగింది. తీవ్రమైన ఎండవేడి తెలియనందువల్ల ఫ్రాన్స్‌దేశీయులకు చాలా ప్రాంతాలలో ఎయిర్ కండిషన్ల గురించి తెలియదు. వాటిని ఏర్పాటు చేసుకోలేదు. దీంతోపాటు తరువాయి 8లో



బిజెపి 'అంతిమ' లక్ష్యం

## రిజర్వేషన్ల రద్దుకు రాజ్యాంగ సవరణే

కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ :** రిజర్వేషన్లను రద్దు చేసేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించడమే తమ 'నిజమైన, అంతిమ లక్ష్యం' కావడంతో, లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని బుధవారం కాంగ్రెస్ ఆరోపించింది. 'పిటిఐ వీడియోస్'కు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ మాట్లాడుతూ అధికార పార్టీ మొదట మహిళా రిజర్వేషన్ల ముసుగులో పునర్విభజన కోరుకుంటున్నదని, దాని అంతిమ లక్ష్యం రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేయడమేనని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల పట్ల ప్రభుత్వానికి నిజంగా శ్రద్ధ ఉంటే 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్యకు అనుగుణంగా 'నారీ శక్తి వందన అధినియమ్'ను అమలు చేయాలని జైరామ్ రమేష్ డిమాండ్ చేశారు. టిఎంసి, శివసే (యుబిటి)లను చీల్చేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీ 2024లో చేసిన ఆరోపణలను నిజమని నిరూపించాయని జైరామ్ రమేష్ అన్నారు. '400 పార్లమెంట్ స్థానాలను' గెలుచుకోవడం ద్వారా తరువాయి 12లో

# భవిష్యత్తు కమ్యూనిజానిదే

● భారతదేశంలో నిర్బంధాలను ఎదుర్కొని నిలబడ్డ చరిత్ర సిపిఐది
● మహిళలు, రైతులు, యువత చూపు కమ్యూనిస్టుల వైపే
● మోదీ హయాంలో మైనారిటీలు, దళితులు, గిరిజనులపై నిత్యం దాడులు
● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా ఒక వైపు పెట్టుబడిదారీ విధానం విఫలమవుతూ కమ్యూనిస్టు అనుకూల శక్తులు పెరుగుతున్న దశలో అసమానతలు అధికంగా ఉన్న భారత దేశంలో కూడా రానున్న రోజులలో కమ్యూనిజానికి మాత్రమే భవిష్యత్తు ఉండనున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. హైదరాబాద్ నాగోల్‌లోని గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం జరిగిన సూర్యాపేట జిల్లా సమితి సభ్యుల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే మహిళలతో పాటు మైనారిటీలు, దళితులు, గిరిజనులపై దాడులు నిత్యం పెరగడం చూస్తున్నామన్నారు. ఈ క్రమంలో భారతదేశంలో అణగారిన వర్గాల ప్రజలు నిమ్న వర్గాల ప్రజలు, మహిళలు, కార్మికులు, రైతులు, యువత కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారన్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా తరువాయి 8లో

## అరుణాచల్‌ను ముంచెత్తిన వరదలు

● కేయి పన్యార్ జిల్లాలో 18 నివాస గృహాలు ధ్వంసం ● నీప్కో ప్రాజెక్టు కాలనీలో ఆకస్మిక వరదల కారణంగా ముగ్గురు గల్లంతు 07



# 'సర్'కు సర్వం సిద్ధం!

రాష్ట్రంలో నేటి నుంచి జులై 24 వరకూ ఇంటింటి ఎన్యూమరేషన్



● 119 నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి
● అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఓటరు జాబితా ముమ్మర సవరణ కోసం తెలంగాణ ఎన్నికల యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు పూర్తి చేసింది. వలసలు, ద్వంద్వ నమోదు, మరణించిన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగడం వంటి సమస్యలకు చెక్ పెడుతూ.. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)' ప్రక్రియను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, అనర్హుల తొలగింపుల వంటి కీలక ప్రక్రియలతో ఈ సవరణ సాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జిల్లా స్థాయి నుంచి తరువాయి 8లో

ప్రతి కుటుంబానికీ

## సంక్షేమ పథకాలు

అదే ప్రజాప్రభుత్వ లక్ష్యం

> పదేళ్ల బిఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చారు
> ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల మండిపాటు

ప్రజాపక్షం/వైరా



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమ ప్రభుత్వమని ఇందిరమ్మ రాజ్యలంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి తుమ్మలతో పాటు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్త కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటీ సిఎం, మంత్రి తుమ్మల మాట్లాడుతూ 30వ తేదీన తరువాయి 12లో

## నిర్లక్ష్యంగా ఉంటే క్షమించేది లేదు

> కాంగ్రెస్ నేతలు 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి

● పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోబోం
● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక ● ఓటర్ జాబితా నుంచి పేదల ఓట్లు పోతే ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు పోవచ్చు
● ఎవరికీ అన్యాయం జరగనివ్వొద్దని జూమ్ మీటింగ్‌లో సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) విషయంలో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరించే పార్టీ నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పనిచేయని పార్టీ నాయకులకు, బాధ్యులకు 10 రోజుల సమయం ఇచ్చి చూస్తామని, వారిలో పరివర్తన లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని సిఎం స్పష్టం చేశారు. మరోవైపు 'సర్' విషయంలో సక్రమంగా వ్యవహరించకపోతే పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని, జాబితా నుంచి పేదల ఓట్లు పోతే వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుందని, వారికి అన్యాయం జరగనివ్వొద్దన్నారు. ఓటర్ల జాబితా ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై సర్పంచ్‌లతో గ్రామాలలో ప్రచారం చేయించాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) ప్రారంభం తరువాయి 12లో

## సాయికృష్ణది లాకప్ మరణమే

● మృతదేహాన్ని మాయం చేశారు ● తగులబెట్టారో, పూడ్చారో తెలియడం లేదు
● సిఐ నాగరాజు తీవ్ర నేరానికి పాల్పడ్డారు ● 19 పేజీల సిట్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు ● నాగరాజుకు 14 రోజుల రిమాండ్ రాజమండ్రి జైలుకు తరలింపు



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ (25) కేసులో మిస్టరీ వీడింది. అతడిని పోలీసు స్టేషన్‌లోనే తీవ్రంగా హింసించి చంపేశారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమికంగా తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
25-06-2026
www.prajapaksham.in



# కూలీల జీవితాలపై గణాంకాల ముసుగు

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల పనితీరును అంచనా వేయడానికి గణాంకాలు కీలకం. ఆర్థిక వృద్ధి, ఉపాధి, వేతనాలు, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై విడుదలయ్యే అధికారిక గణాంకాలు దేశ పరిస్థితిని ప్రతిబింబించాల్సి ఉంటుంది. అయితే గణాంకాలు వాస్తవాన్ని ప్రతిబింబించే అద్దంలా ఉండాల్సిన చోట, అవి రాజకీయ కథనాలను బలపరిచే సాధనాలుగా మారుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థనే బలహీనపరుస్తున్నాయి. ఇటీవల గ్రామీణ వేతనాల పెరుగుదలపై వెలుగులోకి వచ్చిన వివాదమే ఇందుకు తార్కాణం. గత దశాబ్దంలో గ్రామీణ భారతదేశం ఎన్నో సంక్షోభాల ను ఎదుర్కొంది. వ్యవసాయంలో పెరుగుతున్న వ్యయాలు, పంటలకు సరైన ధరలు లేకపోవడం, ఉపాధి అవకాశాల కొరత, కొవిడ్ మహమ్మారి ప్రభావం, వలసల తిరోగమనం వంటి అంశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ వేతనాల వృద్ధి చాలా నెమ్మదిగా సాగిందని ఆర్థిక వేత్తలందరిలో దాదాపు ఏకాభిప్రాయం ఉంది. అనేక అధ్యయనాలు కూడా అదే విషయాన్ని వెల్లడించాయి. ద్రవ్యోల్బణాన్ని తీసివేస్తే కూలీల వాస్తవ ఆదాయాల్లో పెద్దగా పెరుగుదల లేదనే వాస్తవం బహిరంగ రహస్యం. అయితే, 2025 జులై తర్వాత విడుదలైన అధికారిక గణాంకాల్లో గ్రామీణ వేతనాల వృద్ధి ఒక్కసారిగా 6 శాతం స్థాయి నుంచి 17 శాతానికి చేరినట్లు కనిపించింది. దేశవ్యాప్తంగా కూలీల జీవితాల్లో ఎలాంటి గుణాత్మక మార్పు కనిపించని సమయంలో, ఈ సంఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు అసాధారణంగా పెరిగిన దాఖలాలు లేవు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత ఒక్కసారిగా పెరిగిన సందర్భం లేదు. పరిశ్రమలు గ్రామాలకు పెద్ద ఎత్తున తరలివెళ్లిన పరిస్థితి లేదు. అయినప్పటికీ గణాంకాల్లో మాత్రం అసాధారణ వృద్ధి కనిపించడం అనేక ప్రశ్నలకు దారితీసింది. గ్రామీణ శ్రామిక శక్తిలో వాటా చాలా తక్కువగా ఉన్న పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నమూనా ఎంపికలో అసాధారణంగా అధిక ప్రాధాన్యతనిచ్చి, ఈ గణాంకాలు సిద్ధం చేశారన్న అనుమానాలు లేకపోలేదు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా, ఢిల్లీ, పుదుచ్చేరి వంటి ప్రాంతాలకు కలిపి గ్రామీణ శ్రామిక శక్తిలో ఒకటిన్నర శాతానికన్నా తక్కువ వాటా ఉన్నప్పటికీ, గణాంకాల నమూనాలో వాటి డేటాను 11 శాతం వరకు పెంచినట్లు వెల్లడైంది. అదే సమయంలో మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, రాజస్థాన్ వంటి పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఉన్న రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించారని స్పష్టమైంది.

ఈశాన్య రాష్ట్రాలు లేదా గోవా వంటి ప్రాంతాల్లో సగటు వేతనాలు దేశంలోని పేద రాష్ట్రాల కంటే చాలా ఎక్కువగా ఉంటాయి. అక్కడ వ్యవసాయేతర ఉపాధి వాటా అధికం. నైపుణ్యాధారిత పనులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల అక్కడి సగటు రోజువారీ వేతనాలు సహజంగానే ఎక్కువగా నమోదవుతాయి. ఇలాంటి ప్రాంతాలకు గణాంకాల్లో అధిక ప్రాధాన్యతనిస్తే, దేశ సగటు వేతనం పెరిగినట్లు కనిపించడం సహజం. కానీ అది దేశంలోని కోట్లాది కూలీల జీవితాల్లో జరిగిన నిజమైన మార్పును ప్రతిబింబించదు. ఒక రాష్ట్రంలో వందమంది కూలీలు రోజుకు మూడు వందల రూపాయలు సంపాదిస్తుంటే, మరో చిన్న ప్రాంతంలో పది మంది కూలీలు రోజుకు ఐదు వందల రూపాయలు సంపాదిస్తున్నారని అనుకుందాం. గణాంకాల్లో ఆ పది మందికి అసాధారణంగా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే మొత్తం సగటు పెరిగిపోతుంది. కానీ, వాస్తవానికి వందమంది జీవితాల్లో మార్పు ఏమీ ఉండదు. ఇదే సమస్య ఇక్కడ కనిపిస్తోంది. సంఖ్యలు మెరుగుపడినట్లు కనిపిస్తున్నా, కూలీల జీవన ప్రమాణాలు యథాస్థాయిలో ఉండవచ్చు. 'గణాంకాలంటే, ఒక చీకటి గదిలో ఒక గుడ్డివాడు అక్కడ లేని నల్ల పిల్లిని వెతకడమే' అనే విమర్శ, కేంద్ర శ్రామిక గణాంకాలను ప్రతిబింబిస్తుంది. దేశంలోని అత్యంత బలహీన వర్గాల స్వరాన్ని ఎలా ప్రతిబింబిస్తున్నామనే ప్రశ్నకు ఇలాంటి వివరాలు సమాధానం ఇవ్వవు. ఒక గ్రామీణ కూలీకి గణాంకాల భాష అర్థం కాకపోవచ్చు. కానీ తన చేతికి వచ్చే కూలి ఎంత? తన పిల్లల చదువుకు ఖర్చు పెట్టగలుగుతున్నాడా? కుటుంబానికి మూడు పూటల భోజనం అందించగలుగుతున్నాడా? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలుస్తాయి. స్వానుభవాలకు, ప్రభుత్వ గణాంకాలకు పొంతన లేకపోతే, ఎక్కడో పొరపాటు జరిగిందని ఎవరైనా సులభంగానే గ్రహిస్తారు.

కొవిడ్ అనంతర కాలంలో గ్రామీణ భారతదేశం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. పట్టణాల్లో ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాది మంది గ్రామాలకు తిరిగి వచ్చారు. గ్రామాల్లో ఇప్పటికే పరిమితంగా ఉన్న ఉపాధి అవకాశాలపై అదనపు ఒత్తిడి పడింది. అనేక కుటుంబాలు వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, అప్పులు వంటి మార్గాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో కూలీల బేరసారాల శక్తి తగ్గింది. పనికోసం పోటీ పెరిగింది. ఫలితంగా వేతనాల పెరుగుదల కూడా పరిమితంగానే ఉండటం సహజం. గ్రామీణ భారతదేశంలో నేడు ఒక ముఖ్యమైన సమస్య వాస్తవ వేతనాల క్షీణత. పేరు మీద వేతనం పెరిగినా, ద్రవ్యోల్బణం కారణంగా కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. బియ్యం, పప్పులు, కూరగాయలు, విద్య, వైద్యం, రవాణా వంటి అవసరాల ఖర్చులు పెరుగుతున్నాయి. కూలీకి రోజుకు అదనంగా ఇరవై లేదా ముప్పై రూపాయలు వచ్చినా, పెరిగిన ధరల కారణంగా అతని కొనుగోలు శక్తి మారకపోవచ్చు. జీవన ప్రమాణాల్లో పెద్ద మార్పు లేకపోవచ్చు. అందుకే కేవలం నామమాత్రపు వేతనాల పెరుగుదల కంటే వాస్తవ వేతనాల పెరుగుదల ముఖ్యం. ఇలాంటి సమయంలో గ్రామీణ వేతనాలు అసాధారణంగా పెరిగాయని చూపించడం విధాన నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతుంది. ప్రభుత్వం లేదా విధాన రూపకర్తలు గ్రామీణ ఆదాయాలు బాగా పెరుగుతున్నాయని భావిస్తే, ఉపాధి సృష్టి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. సంక్షేమ కార్యక్రమాల అవసరం తగ్గిందని భావన ఏర్పడవచ్చు.

గణాంకాల్లో పారదర్శకత లేకపోవడం మరో కీలకమైన అంశం. గణాంకాల నమూనాలో ఇంత పెద్ద మార్పు జరిగితే దాన్ని బహిరంగంగా ప్రకటించాలి. పరిశోధకులు, ఆర్థికవేత్తలు, ప్రజలు ఆ మార్పుల ప్రభావాన్ని అర్థం చేసుకునే అవకాశం కల్పించాలి. కానీ మార్పు గురించి స్పష్టమైన సమాచారం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, భారతదేశం ఇప్పటికీ 2011 జనగణన ఆధారంగా అనేక అంచనాలను రూపొందిస్తోంది. గత పదిహేనేళ్లలో దేశ జనాభా నిర్మాణం, వలసలు, ఉపాధి నమూనాలు గణనీయంగా మారాయి. కొత్త జనగణన లేకపోవడం వల్ల గణాంకాల ఖచ్చితత్వంపై ఇప్పటికే అనేక ప్రశ్నలు ఉన్నాయి. సంఖ్యలతో అభివృద్ధిని సృష్టించడం అసాధ్యం.

ప్రజల వాస్తవ జీవితాల్లో మార్పు తీసుకురావాలి. గ్రామీణ కూలీ ఆదాయం పెరగాలంటే వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరగాలి. గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందాలి. ఉపాధి అవకాశాలు విస్తరించాలి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు బలోపేతం కావాలి. ఇవి లేకుండా కేవలం గణాంకాల్లో వృద్ధి చూపించడం రాజకీయంగా తాత్కాలిక లాభాలను ఇచ్చినా, దీర్ఘకాలంలో భర్తీ చేయలేని నష్టాలను మిగిలిస్తుంది. గణాంకాల వెనుక మనుషులు ఉంటారు. ప్రతి శాతం వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ప్రతి వేతన గణాంకం వెనుక ఒక శ్రమజీవి కథ ఉంటుంది. ఆ కథలను దాచిపెట్టి సంఖ్యలను మాత్రమే చూపించడం అన్యాయం. దేశ అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు ముందుగా కూలీల జీవితాలను చూడాలి. వారు మెరుగుపడితేనే ఆర్థికాభివృద్ధి అర్థవంతమవుతుంది. ●



## కేంద్రం దర్యాప్తు సంస్థలను వాడుకుంటోంది

**రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇడి, ఐటి, సిబిఐలను ఉపయోగించుకుంటోంది. గత 12 ఏళ్లలో వేలకొద్దీ సోదాలు జరిగినప్పటికీ, ఇడి సాధించిన నేర నిర్ధారణ రేటు చాలా తక్కువగా ఉంది. ఇది రాజకీయ ప్రేరేపిత చర్యలనే అనుమానాలను మరింత బలపరుస్తోంది. భారతదేశం అంతటా గత 12 ఏళ్లలో వేలకొద్దీ సోదాలు జరిగాయి, కానీ నేర నిర్ధారణ రేటు రెండు శాతం కంటే తక్కువగా ఉంది. ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కేంద్ర ప్రభుత్వానికి సాధనాలుగా మారాయి.అవసరమైనప్పుడల్లా వాటిని ప్రయోగిస్తుంటారు. కాంగ్రెస్ నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకోవచ్చని బిజెపి నాయకులు పదేపదే చేస్తున్న వ్యాఖ్యలు, అటువంటి దర్యాప్తులు రాజకీయ ప్రేరేపితమే.**

\- కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే

## పరిశుభ్రంగా వుండే చేతులు.. ఆరోగ్యానికి సంకేతాలు

అసలే వర్షాకాలం వర్షాలు, వానికి తోడు జబ్బులు కూడా ప్రజలను వెంటాడుతాయి. చేతుల ద్వారా అనేక జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం అనేది ఒక మంచి అలవాటు. చేతులకు మొదట సబ్బు రాసుకుని. బాగా రుద్ది తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఎందుకంటే మన చేతిలో మన కంటికి కనిపించని సూక్ష్మ క్రిములు ఉంటాయి. చేతులను శుభ్రం చేసుకోవటం అంటే మనకు మనం వ్యాధి నిరోధక టీకాలను ఇచ్చుకుంటున్నట్లే. చేతుల ద్వారానే వ్యాధి కారక సూక్ష్మ క్రిములు శరీరంలోనికి ప్రవేశిస్తాయి అనేది సత్యం. కనుక చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఉదయం నుండి సాయంత్రం వరకు మన దినచర్యలో చాలా పనులు చేతుల ద్వారానే చేస్తుంటాము. అన్నం తినడం, ముక్కు చీదడం, పేడ తీయడం, పాలు పితకడం, మల విసర్జన తర్వాత కడుక్కోవడం ఇలా ఇంకా ఎన్నో పనులు చేస్తాం. ఇన్ని పనులు చేసేటప్పుడు ఆ పనికి సంబంధించిన మలినాలన్నీ చేతికి అంటుకుంటాయి. చేతులను నీటితో శుభ్రం చేసుకోకుండా నీళ్ళు త్రాగడానికో, తినడానికో వాడితే చేతికి అంటిన క్రిములన్నీ మన శరీరంలోనికి ప్రవేశిస్తాయి. చర్మం అనేది శరీరానికి ఒక అడ్డుగోడగా ఉంటూ క్రిములను శరీరంలోనికి రానివ్వకుండా అడ్డుకుంటుంది. చర్మం పై ఏవైన గాయాలు అయినప్పుడు బాక్టీరియ చర్మం లోపలికి ప్రవేశించడానికి, అలాగే చేతులు ద్వారా రోగాలు ఒకరి నుండి మరొకరికి వ్యాపించడానికి అవకాశం ఉంది. కాబట్టి చేతులను శుభ్రం చేసుకోవడం చాలా అవసరం.

**చేతులను ఎప్పుడు శుభ్రం చేసుకోవాలి**

* పిల్లలతో సహా ప్రతి ఒక్కరూ మలాన్ని తాకిన తర్వాత
* ఆహారాన్ని ముట్టుకునే ముందు * ఆహారం తినే ముందు
* పిల్లలకు ఆహారం తినిపించే ముందు
* అనారోగ్యంతో ఉన్న వారికి భోజనం పెట్టే ముందు మరియు మందులు ఇచ్చేముందు * చర్మపు గాయాలు తాకినపుడు
* పచ్చి మాంసాన్ని తాకినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మరియు ముక్కు చీదినప్పుడు
* పెంపుడు జంతువులను తాకినప్పుడు మరియు వాటిని కడిగినప్పుడు
* ప్రయాణం చేసినపుడు * చిన్నపిల్లలు బడి నుండి ఇంటికి వచ్చిన తరువాత.

**ఎలా శుభ్రం చేసుకోవాలి**

చేతులను సబ్బు లేదా హ్యాండ్ వాష్‌తో రుద్దుకొని నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. చేతి గోళ్ళను ఎప్పటికప్పుడు కత్తిరించుకొని మట్టిచేరకుండా చూసుకోవాలి. ముందుగా చేతులని నీటితో తడుపుకోవాలి. ఇప్పుడు సబ్బు రుద్ది, ఒక అరచేతిని మరో అర చేతితో రుద్ది, చేతి వేళ్ళ మధ్య వేరే చేతి వేళ్ళు వేసి రుద్ది, 5 వేళ్ళ కొనలను కలిపి అరచేతితో రుద్ది, తరువాత చేతి వెనక మణికట్టు వరకు రుద్ది, వేళ్ళు దగ్గర చేసి అరచేయి పొత్తిలి చేసి చేతితో చుట్టురా శుభ్రపరచాలి. 20 సెకండ్ల వరకు 5 సార్లు రుద్ది చివరగా నీళ్ళతో కడగాలి. చేతులను శుభ్రం చేసుకోవడం వలన అనారోగ్యాన్ని కలిగించే క్రిములు మన శరీరం లోనికి ప్రవేశించకుండా ఉంటాయి. వ్యాధులు ఒకరి నుండి మరొకరికి వ్యాపించకుండా ఉంటాయి. భోజనం తయారు చేసేటప్పుడు చేతులను కడుక్కోవడం వలన భోజనంలోనికి క్రిములు చేరకుండా ఆపవచ్చు. భోజనం తినేముందు చేతులను శుభ్రం చేసుకోవడం వలన క్రిములు శరీరంలోనికి ప్రవేశించకుండా ఉంటాయి. నీళ్ళు, సబ్బు మరియు శానిటైజర్లను ఉపయోగించాలి. శానిటైజర్లను ఉపయోగించడం వలన బాక్టీరియా మరియు క్రిములను 60% వరకు తొలగించవచ్చు. అలాగే ఒకటి లేదా రెండు శానిటైజర్ చుక్కలను చేతులపై వేసుకొని వేళ్ళ సందుల మధ్యన కూడా అంటుకొనేలా చూసుకోవాలి, తరువాత కొద్ది సేపు చేతులను ఆరబెట్టుకోవాలి. ఎక్కువగా సబ్బులను ఉపయోగించడం వలన చర్మం పొడిబారిపోతుంది. మనం రోజూ వాడే సబ్బులు చర్మంలో ఉండే సహజ నూనెలను గ్రహించడం వలన చర్మం పొడిగా మారి దురదలకు కారణమవుతుంది. కావున రసాయనాలు లేని సబ్బులను మాత్రమే చేతులను శుభ్రపరిచేందుకు ఉపయోగించుకోవాలి. సాంప్రదాయ శానిటైజర్లను ఉపయోగించి కూడా మన చేతుల నుండి క్రిములను తొలగించవచ్చు.

**కామిడి సతీష్ రెడ్డి**
9848445134

### మాస్కోలో మూడవ అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఫోరం పిలుపు

# సామ్రాజ్యవాదం, యుద్ధం, టెర్రరిజంపై ఐక్యపోరాటం



రామకృష్ణ పాండా
సిపిఐ కేంద్ర కార్యదర్శి

రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మాస్కోలో నిర్వహించబడిన మూడవ అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఫోరం ప్రపంచ నలుమూలల నుంచీ కమ్యూనిస్టులు, కార్మికవర్గ పార్టీలు, ప్రగతిశీల శక్తులను ఒక చోటకు చేర్చింది. పెరుగుతున్న యుద్ధాలను, సైనిక జోక్యాలను, ఆర్థిక సంక్షోభాలను, ప్రజాస్వామిక హక్కులపై దాడులను, నయా–ఫాసిజం పెరుగుదలను, అంతర్జాతీయ టెర్రరిజం నుంచి ప్రమాదాన్ని మానవజాతి ఎదుర్కొంటున్న తరుణంలో ఈ సమారోహం జరిగింది.''అంతర్జాతీయ టెర్రరిజం, నిరంకుశత్వం, దురాక్రమణకు వ్యతిరేకంగా, శాంతి, భద్రతల కోసం'' అనేది చర్చనీయాంశం. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, శాంతి దృక్కోణంతో కూడిన సంఘీభావం అనే సందేశాన్ని ఈ మహాసభ ప్రపంచ ప్రజలకు ఇచ్చింది. ఫాసిజం, యుద్ధోన్మాదం, సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటాన్ని జాతీ య సరిహద్దులలో మాత్రమే సాగించలేమన్న చారిత్రక అవగాహన నుంచి ఈ ఫోరం ఆవిర్భావం పొందింది.

అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఫోరం మొదటి, రెండవ సభలు ప్రపంచవ్యాప్తంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల మధ్య ఐక్యత కొనసాగింపునకు, ఆ క్రమం విస్తరణకు ప్రాతినిధ్యం వహించింది. పెరుగుతున్న అభివృద్ధినిరోధక, సామ్రాజ్యవాద, నయాఫాసిస్టు ధోరణులకు ప్రతిస్పందనగా ప్రపంచస్థాయిలో ఉమ్మడి రాజకీయ స్పందనను అభివృద్ధి చేయటాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

శక్తిమంతమైన సామ్రాజ్యవాద దేశాలు సర్వసత్తాక రాజ్యాలపై ప్రత్యక్షయుద్ధాలు, సైనిక కూటములు, ఆర్థిక ఆంక్షలు, రాజకీయ జోక్యాల ద్వారా, ఇంకా ''మానవతావాద'', ''ప్రజాస్వామ్యయుత'' కార్యకలాపాల పేరుతో దాడులు చేస్తుండగా, ఈ ఫోరం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక ప్రగతిశీల రాజకీయ దృష్టి నుంచి చూచినపుడు, అంతర్జాతీయ టెర్రరిజం ప్రభుత్వయేతర వ్యక్తులు లేక సమూహాలు సాగించే హింసకు పరిమితం కాలేదు. ప్రభుత్వం అండతో సాగే దురాక్రమణ, ఆక్రమణలు, సామూహికంగా శిక్షించటం, ఆర్థిక దిగ్బంధనాలు, రాజకీయ అస్థిరత సృష్టించే విధానాలు కూడా టెర్రరిజం రూపాలే. వాటి నుంచి కూడా ప్రజలకు ప్రమాదం పెరుగుతున్నది. ఈ సందర్భంలోనే ఈ మహాసభ యుద్ధం, సామ్రాజ్యవాదం, నయావలసవాదం, ఫాసిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా విశాలమైన ప్రపంచవ్యాప్త ప్రతిఘటన ఆవశ్యకతను వక్కాణించింది.

108 దేశాల నుంచి 180 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చైనా ప్రజారిపబ్లిక్, డిపిఆర్ కొరియా, వియత్నాం, లావోస్, క్యూబా వంటి సోషలిస్టు దేశాల నుంచి, అమెరికా సామ్రాజ్యవాదం ప్రోత్సాహంతో అనేకరకాల ఒత్తిళ్లు, జోక్యాలు చవిచూస్తున్న పాలస్తీనా, ఇరాన్, లెబనాన్, వెనిజులాల నుంచి కూడా ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి సిపిఐ ప్రతినిధివర్గం (ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి, అంతర్జాతీయ డిపార్ట్‌మెంట్ హెడ్ రామకృష్ణ పాండా) పాల్గొన్నది. రాజా తొలి సమావేశంలో ''21వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం, అంతర్జాతీయ టెర్రరిజం : కారణాలు, గమ్యాలు, పద్ధతులు'' అనే అంశాలపై ప్రసంగించారు. రెండవ సమావేశంలో రామకృష్ణ పాండా, ''అంతర్జాతీయ టెర్రరిజం, దాని వ్యక్తీకరణలకు వ్యతిరేకంగా పోరాటంలో సంఘీభావం : వామపక్ష, ప్రగతిశీల శక్తుల పాత్ర'' అనే అంశంపై ప్రసంగించారు.

రాజా తమ ప్రసంగంలో ఇలా చెప్పారు : ''ఇది ప్రపంచ చరిత్రలో అత్యంత ముఖ్యమైన క్షణం. మానవాళి అనేక సంక్షోభాలు ఎదుర్కొంటున్నది — యుద్ధం, ఆర్థిక అస్థిరత, వాతావరణంలో వినాశకర మార్పులు, పెరుగుతున్న అసమానతలు, నయాఫాసిస్టు, అతిజాతీయవాద శక్తులు ప్రమాదకరంగా పెరుగుదల వాటిలో ఉన్నాయి. ప్రపంచం పెట్టుబడిదారీ విధానంలో తీవ్రమవుతున్న సంక్షోభం, ఆధునిక సామ్రాజ్యవాదం దుందుడుకు స్వభావం ఈ సంక్షోభాల వెనుక ఉంది. 21వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం, అంతర్జాతీయ టెర్రరిజం గూర్చి మనం చర్చించేటపుడు అది అకడమిక్ చర్చ కాదు. అది శాంతి, ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వం, మానవ నాగరికత భవిష్యత్‌కు సంబంధించిన సమస్య. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ అని, గుత్త పెట్టుబడిదారుల, ద్రవ్య పెట్టుబడి, సైనిక ఆధిపత్యం, ప్రపంచాన్ని విభజించుకునేందుకు పోరాటం దాని లక్షణమని లెనిన్ చెప్పారు. 21వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం సైనిక కూటములు, బహుళజాతి కార్పొరేషన్‌లు, ద్రవ్య సంస్థలు, ఆంక్షల విధింపు, సమాచార యుద్ధతంత్రం, సర్వసత్తాక దేశాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా జోక్యం చేసుకోవటం ద్వారా పనిచేయటం కొనసాగిస్తున్నది. అందువల్ల యుద్ధం, ఆక్రమణలు, దారిద్ర్యం, మతోద్రేకాలు రెచ్చగొట్టటం, విదేశీ జోక్యంతో కూడిన ప్రస్తుత పరిస్థితుల నుంచి అంతర్జాతీయ టెర్రరిజాన్ని వేరు చేసి అవగాహన చేసుకోలేము. 21వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం లక్ష్యాల్లో ప్రాథమికంగా ఎటువంటి మార్పులేదు. ప్రపంచంపై ఆధిపత్యం దాని ప్రధాన ధ్యేయం. అది అనుసరిస్తున్న పద్ధతుల్లో మార్పులు వస్తున్నాయి. నయా వలసవాద పద్ధతుల స్థానంలో చాలా వరకు వలసవాద ప్రత్యక్ష ఆక్రమణ చేరింది. ప్రభుత్వాలను మార్చటం, మీడియాను వశం చేసుకోవటం, సైబర్ యుద్ధ తంత్రాలు, రాజకీయ అస్థిరత సృష్టించటం, బయటనుంచి 'రంగుతో అభివర్ణిస్తున్న విప్లవాలను' ప్రోత్సహించటం వాటిలో ఉన్నాయి. అదే సమయంలో భౌగోళిక రాజకీయ సంఘర్షణ లోపల టెర్రరిజాన్ని కూడా ఉపయోగిస్తున్నారు. సామ్రాజ్యవాదం, టెర్రరిజం ప్రమాదకరంగా కలిసిపోవటాన్ని పశ్చిమాసియాలో చూడవచ్చు. సమకాలీన సామ్రాజ్యవాదం సైనికం, ఆర్థికం మాత్రమే కాదు. భావజాల సంబంధం కూడా. కార్పొరేట్‌ల నియంత్రణలోని మీడియా, డిజిటల్ ప్రచార వ్యవస్థలు యుద్ధాలను సమర్థించే ప్రయత్నం చేస్తున్నాయి. స్వతంత్ర రాజ్యాలను భూతంగా చిత్రిస్తున్నాయి. కమ్యూనిజం వ్యతిరేకతను ప్రచారం చేస్తున్నాయి. ప్రజలను మతం, జాతి, ఉపజాతి ప్రాతిపదికపై విభజిస్తున్నాయి. శాంతి, జాతీయ సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం ప్రపంచంలోని ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంకావాలని రాజా పిలుపు ఇచ్చారు. సోషలిస్టు శక్తులు, సోవియట్ ప్రజల వీరోచిత పోరాటం, త్యాగాల వల్లనే ఆనాడు ఫాసిజం ఓడించబడింది. అదే మాస్కోగడ్డ నుంచి మరో శక్తిమంతమైన సందేశం వెళ్లాలి:

- ''మేము యుద్ధానికి వ్యతిరేకం, శాంతి కోసం నిలబడతాం.
- మేము జోక్యాలకు వ్యతిరేకంగా సార్వభౌమత్వాన్ని బలపరుస్తాం.
- మేము ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యంకోసం నిలబడతాం.
- మేము దోపిడీకి వ్యతిరేకంగా సోషలిజం కోసం నిలబడతాం.''
- మేము సామ్రాజ్యవాదం, టెర్రరిజంకు వ్యతిరేకంగా అంతర్జాతీయ సంఘీభావం కోసం నిలబడతాం''.

రామకృష్ణ పాండా తమ ప్రసంగంలో అంతర్జాతీయ టెర్రరిజానికి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని శాంతి, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, జాతీయ సార్వభౌమాధికారం, సామాజిక న్యాయం కోసం జరిపే విస్తృత పోరాటం నుంచి వేరుచేయ వీలులేదని వక్కాణించారు. పశ్చిమాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజలు, 'భద్రత', 'ప్రజాస్వామ్యం' పేరుతో సామ్రాజ్యవాదం సాగించిన జోక్యాలకు భారీమూల్యం చెల్లించారని గుర్తుచేశారు. ఇరాక్, లిబియాలపై దండయాత్రలు రాజ్యవ్యవస్థలను ధ్వంసంచేసి అస్థిరత, తీవ్రవాదానికి అనువైన పరిస్థితులు సృష్టించాయన్నారు. సిరియాలో దీర్ఘకాలంపాటు ప్రాక్సీ యుద్ధాలు వినాశం కలుగజేశాయన్నారు. పాలస్తీనా భూభాగాల ఆక్రమణ, గాజాపై పదేపదే దాడు లు, సమష్టిగా శిక్ష, వేలాది మంది అమాయకుల హత్యలు ఇవన్నీ సమకాలీన ప్రపంచంలో రాజ్య టెర్రరిజానికి స్పష్టమైన ఉదాహరణలని అన్నారు.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల పాత్రను వక్కాణిస్తూ ఐదు ప్రధాన కర్తవ్యాలను ఆయన ప్రతి పాదించారు : అంతర్జాతీయ సంఘీభావం పటిష్టం చేయటం; సెక్యులరిజం, ప్రజాస్వామ్యాలకు సమర్థన; టెర్రరిజానికి గల సామాజిక ఆర్థిక కారణాలను బహిర్గతం చేయటం; యుద్ధం, సైనికీకరణకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలను ముమ్మరం చేయటం; పాలస్తీనా, వెనిజు లా, క్యూబా, ఇతర సర్వసత్తాక రాజ్యాలతో సంఘీభావం పటిష్టం చేయటం.

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గెన్నడీ జ్యుగానోవ్ ఈ మహాసభలో ప్రారంభోపన్యాసం చేశారు. వామపక్ష శక్తుల పోరాటాన్ని సామ్రాజ్యవాదానికి, రాజ్యటెర్రరిజానికి, సైనిక దురాక్రమణకు, నయా వలసవాదానికీ, నయా ఫాసిజానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటాలనుంచి వేరు చేయలేమన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తన లక్ష్యాలను ''భౌతికంగా బలప్రయోగం, ఆలోచనను ప్రభావితం చేయటం'' ద్వారా ముందుకు తీసుకెళుతున్నదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శక్తులు ఈ ధోరణులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఈ ఫోరం ప్రపంచ తిరోగమన శక్తులకు వ్యతిరేకంగా పోరాటంలో మరో చర్య అన్నారు.

జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్ (జిడిఆర్) చివరి నాయుడు ఇగోన్ క్రెంజ్ ఈ మహాసభలో ప్రసంగించారు. రాజకీయంగా ఆయన కృషి, ఫాసిస్టు వ్యతిరేక వారసత్వంతో ఆయన సంబంధాన్ని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మకమైన లెనిన్ బహుమతితో ఆయన్ను సత్కరించారు. పలువురు కమ్యూనిస్టు, వర్కర్స్, ప్రగతిశీల శక్తుల నాయకులు కూడా ప్రసంగించారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో, శాంతి, ప్రజాస్వామ్యం, జాతీయ సార్వభౌమత్వం, సామాజిక న్యాయం కాపాడుకోవటం కోసం ప్రగతిశీల, ప్రజాస్వామిక, వామపక్షశక్తుల మధ్య విశాల ఐక్యత అవసరమని ఈ ఫోరం బలమైన సందేశాన్ని ఇచ్చింది.



మాస్కోలో జరిగిన అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఫోరం మూడవ మహాసభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గెన్నడీ జుగనోవ్

# విలువలను మింగేస్తున్న అశ్లీల ప్రవాహం

'తల చెడినా తత్వం చెడకూడదన్నది పెద్దల మాట. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా సత్ప్రవర్తనను, సదాలోచనలను విడిచిపెట్టకూడదన్నదే దాని అంతరార్థం. మనసులో మంచితనం, ఆలోచనల్లో వివేకం, మాటల్లో సంస్కారం ఉంటే అవే మనిషి పురోగతికి సోపానాలుగా నిలుస్తాయి. కానీ నీచమైన కోరికలు, వికృత ఆలోచనలు మనసును ఆక్రమించి, వాటి ప్రభావంతో ప్రవర్తన అదుపు తప్పితే పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారతాయి. అలాంటి వ్యక్తులు ఘోర నేరాలకు పాల్పడుతూ కుటుంబానికే కాదు, సమాజానికీ ముప్పుగా పరిణమిస్తారు. దురదృష్టవశాత్తూ నేడు అలాంటి ఆందోళనకర పరిస్థితులే నెలకొన్నాయి. అసభ్య, అశ్లీల దృశ్యాలకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా, వాటి ప్రభావంతో జుగుప్సాకర ఘటనలు అధికమవుతున్నాయి. ఫలితంగా మన సమాజం తీవ్రంగా గాయపడి, నైతిక విలువలు క్షీణిస్తున్నాయి.'

భారతదేశంలో అంతర్జాల వినియోగదారుల సంఖ్య దాదాపు 90 కోట్లకు చేరుకుంది. పాఠశాల విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ కనిపిస్తోంది. నిజానికి జ్ఞాన వికాసానికి, ప్రభుత్వ సేవల వినియోగానికి, సమాచార మార్పిడికి, వినోదం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించడానికి అంతర్జాలం ఎంతో ఉపయుక్తంగా మారింది. అయితే ఇంట్లో దీపం కింద చీకటి ఉన్నట్లే, ఈ సాంకేతిక విప్లవం వెనుక అశ్లీల కంటెంట్ విస్తరణ కూడా ఆందోళన కలిగిస్తోంది. దాని ప్రభావంతో వ్యక్తిగత జీవితాలే కాకుండా సామాజిక వ్యవస్థ కూడా సంక్షోభంలోకి జారిపోతోంది.

**సోషల్ మీడియా నుంచి పోర్న్ సైట్ల వరకు**

అసభ్య కంటెంట్ సోషల్ మీడియాలో నేడు కంపు కొడుతోంది. వెబ్ సిరీస్‌ల్లోకి చేరుతున్న పచ్చి బూతుమాటలు, పరిధి దాటిన శృంగార సన్నివేశాలు ఒటిటిల ద్వారా నేరుగా నట్టింట్లోకి వచ్చిపడుతున్నాయి. ఇక పోర్న్ వెబ్ సైట్లు, యాప్‌లలో మెదళ్లను కలుషితం చేసే వికృత చిత్రాలు, దృశ్యాలు వరదలా పారుతున్నాయి. వాటిని చూస్తూ బుర్ర చెడగొట్టుకుంటున్న ఎంతోమంది నైతికంగా పతనమవుతున్నారు. కామోద్రేకంతో నేరాలకు పాల్పడుతూ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు.

**నేరాలకు దారితీస్తున్న వికృత వ్యసనం**

నిరుడు కోల్‌కతాలో వైద్యురాలిపై పాశవిక అత్యాచారానికి పాల్పడిన రాక్షసుడు నీలిచిత్రాలకు బానిసయ్యాడని పోలీసుల విచారణలో తేలింది. అతడి ఫోన్‌లో హింసాత్మక పోర్న్ కంటెంట్ ఉన్నట్లు వెల్లడైంది. అశ్లీల వీడియోలు చూసి మెదడు మొద్దుబారిన ఓ బాలుడు నిరుడు మధ్యప్రదేశ్‌లో సొంత సోదరిపైనే హత్యాచారానికి ఒడిగట్టాడు. హైదరాబాద్‌లో రోత వీడియోలను చూడటానికి అలవాటుపడిన మరో ప్రబుద్ధుడు కన్నకూతురితో తప్పుగా ప్రవర్తించి, ఆమె ప్రతిఘటించడంతో బండరాయితో మోది హతమార్చాడు. పోర్న్‌సైట్లలో కంటబడే జుగుప్సాకర దృశ్యాలను అనుకరిస్తూ కట్టుకున్నవాళ్లను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు చాలామంది. దాంతో పచ్చని సంసారాలు కుప్పకూలుతున్నాయి. భర్తల పైశాచిక ప్రవృత్తికి ఎదురు చెప్పలేని ఎంతోమంది గృహిణుల ఆరోగ్యాలు దెబ్బతినిపోతున్నాయి.

అశ్లీల దృశ్యాలనే అనకొండను అడ్డుకోవాలంటే ఎంతో వ్యవస్థాగత కృషి అవసరం? ఆన్‌లైన్ ఆటలు ఆడేటప్పుడో, సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తున్నప్పుడో, ఇంకేదో సమాచారం చదువుతున్నప్పుడో ఉన్నట్టుండి అశ్లీల కంటెంట్ ప్రత్యక్షమవుతుంది. ఎవరైనా ఒక్క నిమిషం దాని వంక చూశారంటే, ఆపై అలాంటివే గుట్టలుగుట్టలుగా వచ్చిపడుతుంటాయి. ఆల్గారిథమ్‌ల మాయ మూలంగా ఫోన్ పట్టుకునే ఎంతోమంది చిన్నారులు, యువత తెలియకుండానే ఘోరమైన ఊబిలో దిగబడిపోతున్నారు. వాటి నుంచి బయటపడలేక ఉజ్వల భవితను బుగ్గిచేసుకుంటున్నారు.

అంతర్జాలంలోకి పోటెత్తుతున్న అశ్లీల కంటెంట్‌కు అలవాటుపడుతున్న చిన్నారులు, యువతలో హింసాత్మక ప్రవర్తన, దూకుడు స్వభావం పెరుగుతున్నాయి. అలాంటి వారు చిన్నపిల్లలు, మహిళలపై వేధింపులు, కిడ్నాపులు, లైంగిక దాడులకు ఒడిగడుతున్నారని మనస్తత్వ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి వెన్నెముకలాంటి నవతరం ఇలా గాడితప్పుతుంటే, ఇండియా నిజమైన అభివృద్ధిని ఎప్పటికి సాధించగలుగుతుంది?

**నవతరాన్ని కాపాడే బాధ్యత అందరిదీ**

అశ్లీల చిత్రాలను వీక్షించే వారి సంఖ్య అధికంగా ఉన్న దేశాల్లో భారతదేశం ఉండటం ఆందోళన కలిగించే విషయం. కేవలం వీక్షణలకే పరిమితం కాకుండా, అలాంటి వీడియోలను అప్‌లోడ్ చేసే దేశాల జాబితాలో కూడా భారత్ ముందంజలో ఉండటం మరింత విచారకరం. ఈ పరిస్థితి దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. అశ్లీల కంటెంట్ కారణంగా నాశనమవుతున్న జీవితాలను కాపాడాలంటే సంబంధిత వెబ్‌సైట్లపై కఠిన నియంత్రణలు విధించాల్సిన అవసరం ఉంది. నిషేధాల నుంచి తప్పించుకోవడానికి పేర్లు, రూపాలు మార్చుకుని తిరిగి ప్రత్యక్షమయ్యే వెబ్‌సైట్లను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలి. కేంద్ర ప్రభు త్వం సూచించిన మార్గదర్శకాలను ఒటిటి వేదిక లు బాధ్యతాయుతంగా అమలు చేయాలి. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న అసభ్యకర రీల్స్, వీడియోలపై కూడా సమర్థవంతమైన నియంత్రణ అవసరం. పలు అధ్యయనాల ప్రకారం, టీనేజర్లలో సగానికి పైగా పిల్లలు పదమూడేళ్ల వయస్సుకే అశ్లీల దృశ్యాలకు పరిచయం అవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను జాగ్రత్తగా గమనించాలి. పాఠశాల స్థాయి నుంచే వారికి నైతిక విలువలు, బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించాలి. అప్పుడే అశ్లీలత అనే ప్రమాదకర వలయంలో చిక్కుకుంటున్న భావితరాన్ని రక్షించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయగలం. 'సాంకేతికత మనిషి అభ్యున్నతికి సాధనంగా మారాలి గానీ, విలువలను మింగేసే విషప్రవాహంగా కాదు. భావితరాన్ని కాపాడుకోవడం కోసం ఇప్పుడే సమాజం, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసికట్టుగా చర్యలు చేపట్టాలి.'

హరిప్రసాద్ దూపాటి
9963456992

# యూరియా సరఫరా కేంద్రం బాధ్యతే

**రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో తెలంగాణకు పూర్తి వాటా కేటాయించాలి : మంత్రి పొన్నం డిమాండ్**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** యూరియా కొరతపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఎరువుల తయారీ, కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఎరువులు అందకపోతే దానికి బిజెపి నాయకత్వమే బాధ్యత వహించాలన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో తెలంగాణకు పూర్తి వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాలకు తావులేకుండా నాణ్యమైన విత్తనాల పంపిణీ చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అపఖ్యాతిపాలు చేయడానికి కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా కోసం కేంద్రంతో గట్టిగా పోరాడుతామని స్పష్టం చేశారు. తెలంగాణ పిసిసి ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖీ' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించామని, ప్రస్తుతం రేషన్ కార్డుల కోసం ఒక్క దరఖాస్తు కూడా రావడం లేదన్నారు. భూసమస్యలు, కొత్త పెన్షన్లకు సంబంధించిన వినతులు మాత్రమే ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. కొత్తగా రెండు లక్షల పెన్షన్లు మంజూరు చేశామని, త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తవుతుందని వెల్లడించారు. హైదరాబాద్‌లో గృహ అవసరాలు అధికంగా ఉన్న నేపథ్యంలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజావాణి లేదా కలెక్టరేట్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోతే గాంధీ భవన్‌కు రావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జూన్ 29 నుంచి ఏరువాక పౌర్ణమి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరుగుతుందని మంత్రి చెప్పారు.




# మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి

**ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి యూసఫ్ డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసఫ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) 4వ రాష్ట్ర మహాసభల ప్రతినిధుల సభను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. అలాగే శాశ్వత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను విడుదల చేసి, మూడో పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, ఎన్ఎంఆర్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఉద్యోగంలో ఉండగానే మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.6లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలన్నారు. యూనియన్ నాయకుడు కె.ఏసురత్నం మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే జిహెచ్ఎంసి ఎంటమాలజీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించి, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 135 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మహాసభ పోరాట కార్యక్రమాలను రూపొందించిందన్నారు. త్వరలో నిరాహార దీక్షలు చేపట్టడంతో పాటు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ముట్టడికి కూడా సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

**నూతన నాయకత్వం ఎన్నిక**

ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కె.రవిచంద్రన్, అధ్యక్షుడిగా కె.ఏసురత్నం, కార్యనిర్వహక అధ్యక్షుడుగా పి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా వి.జైపాల్ రెడ్డి, కోశాధికారిగా వి.హరినాథ్ రావుతో పాటు పలువురిని రాష్ట్ర కార్యవర్గం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**ప్రభుత్వాసుపత్రుల కార్మికుల జీతాలు పెంచాలని జులై 9న డిఎంఇ కార్యాలయం ముట్టడి**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, గడువు ముగిసిన కాంట్రాక్టుల స్థానంలో వెంటనే కొత్త టెండర్లు పిలవాలని డిమాండ్ చేస్తూ జూలై 9న కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన యూనియన్ కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల కాంట్రాక్టు కాలపరిమితి ముగిసి ఏడాది దాటినా ప్రభుత్వం కొత్త టెండర్లు పిలవకపోవడంతో పాటు వేతనాలు కూడా పెంచలేదని విమర్శించారు. గత టెండర్లలో జిఒ 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నప్పటికీ, కార్మికులకు తగిన జీతాలు అందడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మిక చట్టం ప్రకారం పండుగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు, బోనస్ వంటి హక్కులు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిత్యం సేవలందిస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనాలు కూడా అందకపోవడం దురదృష్టకరమన్నారు. జీతాల పెంపు, కొత్త టెండర్ల కోసం జూలై 7, 8 తేదీల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో గంటసేపు నిరసన కార్యక్రమాలు నిర్వహించి, జూలై 9న డిఎంఇ కార్యాలయం ముందు భారీ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షురాలు ఎం. లక్ష్మీ బాయి, ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శి ఏ.పార్వతి, నాయకులు తోట రామాంజనేయులు, ఎండి ఇమ్రామన్, కవిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టి, యాజమాన్య కోటా ('బి' కేటగిరి) సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు యాజమాన్య కోటా సీట్లను లక్షల రూపాయలకు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని వారు ఆరోపించారు. డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లను బ్లాక్ చేసి, మెరిట్ విద్యార్థులకు అవకాశాలు నిరాకరిస్తూ అధిక ఫీజులు చెల్లించే వారికి అడ్మిషన్లు ఇస్తున్నారని విమర్శించారు. కొన్ని కళాశాలలు ఫీజు నియంత్రణ కమిటీ నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తున్నాయని, డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకొని అవసరమైతే సీజ్ చేయాలని కోరారు. అధికారుల తనిఖీల సమయంలో మాత్రమే అర్హత కలిగిన అధ్యాపకులను చూపించి, అనంతరం నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించి ఫీజుల దోపిడీని అరికట్టాలని, అక్రమాలకు పాల్పడుతున్న కళాశాలలపై ఎసిబి, ఆదాయపు పన్ను శాఖలతో దర్యాప్తు జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

# 'పిఎం కుసుమ్ పథకం'లో రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి తెర

**విద్యుత్ శాఖలో మరో స్కాం**
**దీనిని త్వరలోనే బయటపెడతా**
**మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'పిఎం కుసుమ్ పథకం'లో వెయ్యి కోట్ల కుంభకోణానికి తెర తీశారని, విద్యుత్ శాఖలో మరో స్కాము జరిగిందని, దీనిని త్వరలోనే బయటపెడతామని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ చాలా మంది అప్పులు చేసి 'పిఎం కుసుమ్ పథకం'లో చేరి ప్లాంట్లను నిర్మించి, వెయ్యి, 12 వందల మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణం పూర్తయి రెండు నుంచి మూడు నెలలు అవుతున్నదని వివరించారు. వీరిని ఇంధన శాఖ, రెడ్‌కు చెందిన ఇద్దరు అధికారులు వేధించి డబ్బులు డిమాండ్ చేశారని, మెగావాట్‌కు కోటి రూపాయలు ఇవ్వాలని చెబుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు వారి రక్తం తాగుతున్నారని, ఇందులో కొందరు పెద్దల పేర్లు వినిపిస్తున్నాయని, ఎవరి పాత్ర ఉన్నదనే అంశంపైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.3.13 ధర చెబితే, నిన్నటికి నిన్న ఒక ఉన్నతాధికారి రూ.2.90 అని ఎందుకు చెప్పాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రికి కూడా సంబంధం ఉందని అనుకోవాల్సి వస్తుందన్నారు. ఇందులో పాత్ర ఉన్న అధికారుల పేర్లు త్వరలో భయటపెడతానని చెప్పారు. వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రకటించడం దుర్మార్గమని, తమతో మంత్రులు వస్తే మిగిలిన వడ్లను చూపిస్తామన్నారు. రాష్ట్రంలో మిగిలిన వడ్లు మొత్తం కొనుగోళ్లు చేయాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పని అయిపోయిందని చెబుతున్న పిసిసి అధ్యక్షుడు, ముందుగా ఆయన పదవి ఉంటుందో? లేదో? చూసుకోవాలని ఎద్దేవా చేశారు. కేంద్ర కేబినెట్ మంత్రిని భయపడితే, మరో కేంద్ర మంత్రిని కలిపించడం భారతదేశ చరిత్రలో ఎప్పుడైనా చూశామా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి, జనసేన అన్నీ ఒకటే టీమ్ అని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎలు భాస్కర్ రావు, గాదరి కిషోర్ కుమార్, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలే

**సత్తుపల్లి బిఆర్ఎస్ సమావేశంలో కెటిఆర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఐదేండ్ల పాటు అధికారాన్ని అప్పగిస్తే కాంగ్రెస్ పాలనలో బూతులు, ఎగవేతలు, కూల్చివేతలు మినహా మరేమి జరగడం లేదని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటి రామారావు తెలిపారు. గిట్టని వారిని బూతులు తిట్టడం, ఇచ్చిన హామీలను ఎగవేయడం, పేదల ఇండ్లను కూల్చివేయడమే ఇప్పుడు రేవంత్ పాలనలో జరుగుతుందని ఆయన తెలిపారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన నియోజక వర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి కేటిఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ చేతిలో మోసపోయి గోసపడుతున్నారని కాంగ్రెస్ పోయి కేసిఆర్ రావాలని కోరుకుంటున్నారన్నారు. బిఆర్ఎస్ పాలనలో 11 సార్లు రైతుబంధు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకర, రెండు ఎకరాలు అంటూ ఇప్పటికే రెండు సార్లు ఎగవేసిందని ఆయన ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని ఇచ్చే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టును ప్రారంభించి ఆనాటి అంచనా ప్రకారం రూ.10వేల కోట్లలో రూ.8వేల కోట్లు ఖర్చు చేసిందని ఈ రెండున్నర ఏళ్ల కాలంలో ఎక్కడ తట్టెడు మట్టి ఎత్తలేదని ఆయన తెలిపారు. రుణమాఫీ విషయంలోనూ రైతాంగాన్ని మోసం చేసిందని తొలుత రూ.50 కోట్లు అని అంచనా అటు మార్చి ఇటు మార్చి చివరకు రూ.20వేల కోట్లు అన్నారని కానీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు ధాన్యం కొనుగోలు విషయంలోనూ 30 సన్న రకాల ధాన్యాలను కొనుగోలు చేస్తామని ఇప్పుడు ఏడు రకాలకు దిగివచ్చారని అప్పుడు ధాన్యం కొనుగోలుకు మోడీకి ఏమి సంబంధం అని చెప్పిన నేతలు ఇప్పుడు మోడీ చెప్పినంతే ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించడమంటే హామీల నుంచి వెనుదిరగడమేనని కేటిఆర్ తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నారని రాష్ట్రంలో ఉన్న 1.65 కోట్ల మంది మహిళల ఖాతాల్లో ఒక్కో లక్ష చొప్పున జమ చేస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా విరమిస్తానని కేటిఆర్ సవాల్ విసిరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పు తెచ్చి ప్రాజెక్టు నిర్మించిందని రైతుబంధు ఇచ్చిందని, వెయ్యి గురుకులాలు నిర్మించిందని, పింఛన్ పెంపుదల చేసిందని తెలిపిన కేటిఆర్ రెండున్నర ఏళ్ల కాలంలో తెచ్చిన అప్పుతో మీరు ఏమి చేశారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. వెలుగుమట్లలో పేదల గుడిసెలను మంత్రుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే కూల్చివేశారన్నారు. రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్‌పై బిఎల్‌ఎలకు స్లైడ్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అంతకు ముందు ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఎంఎల్‌సిలు తాతా మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీంద్రరావు, మాజీ డిసిసిబి అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

# ధర్మపురి విద్యా అభివృద్ధికి హెచ్ఎఎల్ చేయూత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఎఎల్ ముందుకొచ్చింది. సంస్థ తన సిఎస్ఆర్ నిధుల కింద రూ.10 కోట్ల వ్యయంతో ధర్మపురిలో నూతన డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మించనుంది. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హెచ్ఎఎల్ ప్రతినిధులు, జగిత్యాల జిల్లా యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.



ధర్మపురి, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల విద్యార్థులకు ఈ డిగ్రీ కళాశాల ఎంతో ఉపయోగకరంగా మారనుందని, పేద, గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. నూతన కళాశాల భవనంలో ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యా రంగానికి సిఎస్ఆర్ నిధుల ద్వారా సహకరిస్తున్న హెచ్ఎఎల్ యాజమాన్యానికి మంత్రి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# కర్నాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోండి

- అవసరమైతే 'సుప్రీం'లో కేసు వేయండి
- ఆర్‌డిఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టల ప్రయోజనాలు కాపాడండి..
- సిఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుంగభద్ర జలాల్లో తెలంగాణ రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని, తుంగభద్రపైన కర్నాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్‌డిస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని బిఆర్ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సిడబ్ల్యూసి, కెఆర్‌ఎంబి, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు అధికారికంగా అభ్యంతరాలను తెలియజేయాలని, తుంగభద్ర జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ విధించిన నిబంధనలను కర్నాటక తుచ తప్పకుండా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కర్నాటక అక్రమ ప్రాజెక్టులపై సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. ఈ మేరకు ఆయన సిఎం రేవంత్ రెడ్డికి బుధవారం లేఖ రాశారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్నాటక నుంచి ఎన్‌ఒసి తీసుకొస్తున్నామనే సాకుతో తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారా? అని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్నాటక నిర్మిస్తున్న కురిడి,(2 టిఎంసి), చిక్కాలపర్వి(2.5 టిఎంసి), చిక్కాలమంచి (5 టిఎంసి) బ్రిడ్జ్‌కమ్‌బరాజ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? అని హరీశ్‌రావు ఆ లేఖలో పేర్కొన్నారు. 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్నాటక ప్రభుత్వం ఎన్‌ఒసి ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటన్నారు. ఏడాది కాలంగా కర్నాటక అక్రమ నిర్మాణాలపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి అనుమతించినట్టేనా ? ప్రశ్నించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్) ఎగువన కర్నాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్‌డిఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయనే విషయం తెలియదా? లేదా తెలిసే ఇదంతా చేస్తున్నారా? అని అన్నారు రాయచూర్ జిల్లాలో 2 టిఎంసిల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్నాటక అక్రమంగా నిర్మిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని, ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్‌టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తయిందని వివరించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్ఎంబి), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్నాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని, దీని వెనుక ఉన్న లోపాయికార ఒప్పందాలు ఏమిటన్నారు. కర్నాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం ఆర్‌డిఎస్,తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదని, తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయని హరీశ్‌రావు సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను ఎపికి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు సిఎంకు రేవంత్ రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని ఆరోపించారు.

# కాళేశ్వరం బురదలో కూరుకుపోయి.. కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారు

**బిఆర్ఎస్‌పై యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఘాటు విమర్శలు..**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారి వ్యవహార శైలి పాత సినిమాల్లో కనిపించే 'సాఫ్ట్ విలన్ల'ను గుర్తు చేస్తోందని, ఎవరైనా మంచి పని చేస్తుంటే దాన్ని అడ్డుకునే ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డికి నీటిని ధారాదత్తం చేసి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని ఆరోపించిన యెన్నం కొత్త ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయలను గోదావరిలో ముంచారని, ఒక్క ఎకరానికి నీరు అందకపోయినా అప్పుల భారం మాత్రం ప్రజలపై మోపారని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు 70 టిఎంసిల హామీ నీటిని సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రారంభించిందని, అయితే బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దాని పురోగతి నిలిచిపోయిందని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు డిపిఆర్ కూడా పూర్తికాకముందే లక్షల కోట్ల అవినీతి అంటూ బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని యెన్నం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వివాదాలతో బిఆర్ఎస్ ఇరుక్కుపోయిందని, అందుకే కాంగ్రెస్‌పై కూడా బురద చల్లాలని ప్రయత్నిస్తోందన్నారు. ఫార్మా సిటీని 'భారత్ ఫ్యూచర్ సిటీ'గా మారుస్తున్నామని, డిఫెన్స్ శాఖ నుంచి 83 ఎకరాల భూమిని సాధించి ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మూసీ తీరం వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు, పేద విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

# నాడు కెజిఎఫ్...నేడు జిజిఎఫ్

**• రాయలసీమకు పూర్వ వైభవం...స్వర్ణగిరిగా జొన్నగిరి • గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభ సభలో ఎపి సిఎం చంద్రబాబు**

**పత్తికొండ:** జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో బంగారం వెలికితీతతో రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైందని, సీమకు పూర్వ వైభవం రానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకప్పుడు కెజిఎఫ్...ఇప్పుడు జిజిఎఫ్ అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో జియో మైసూర్ డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు ఏర్పాటు చేసిన గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును సిఎం ప్రారంభించారు. ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శుద్ధి చేయాల్సిన బంగారు ఖనిజంతో కూడిన మట్టిని తీసుకెళ్లే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సిఎం సందర్శించారు. రూ.405 కోట్ల పెట్టుబడితో జొన్నగిరిలో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు బంగారాన్ని తవ్వి, ప్రాసెస్ చేసి విక్రయించనున్నారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో తొలి ఏడాది 400 కేజీలతో మైనింగ్ ప్రారంభించి తదుపరి దశలో 900 కేజీలు, అనంతరం 2 టన్నుల వరకూ బంగారాన్ని ఉత్పత్తి చేసే ప్రాజెక్టును సిఎం ప్రారంభించారు. జియో మైసూర్ డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు జొన్నగిరిలో తవ్వకాలు జరిపి ముడి ఖనిజం నుంచి బంగారం ఉత్పత్తి చేసే ప్రక్రియను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఉత్పత్తి యూనిట్లలోని వేర్వేరు విభాగాలను పరిశీలించారు. బంగారు బిస్కట్లు సహా వివిధ రూపాల్లోని తుది ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ నుంచి తుది ఉత్పత్తి వరకూ జరిగే ప్రక్రియలను జియో మైసూర్ సంస్థ చైర్మన్ ప్రభాకరన్, ఎండి నవీన్ లాల్ చంద్ర సిఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం మొదలైందని...దీనికి రతనాల సీమ అయిన రాయలసీమ కేంద్రమైందన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించడం శుభపరిణామమన్నారు. రాయలసీమ అంటేనే రతనాల సీమ. శ్రీకృష్ణదేవరాయల కాలంలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారన్నారు. ప్రపంచానికి కోహినూర్ వజ్రాన్ని అందించిన ఘనత మన రాష్ట్రానిదేనని... కాలక్రమేణా రాయలసీమ ఎడారిగా మారే పరిస్థితులు తలెత్తాయన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి, సాగునీరు ఇచ్చి సీమకు మళ్లీ జీవం పోశామని... గోల్డ్ మైనింగ్‌తో సీమకు పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. ఈ ప్రాంతానికి జొన్నగిరి బదులు స్వర్ణగిరి అని పేరు పెట్టుకుందామన్నారు. తొలి ఏడాది 400 కిలోలు నుంచి ప్రారంభమై 50 మెట్రిక్ టన్నుల బంగారం ఉత్పత్తికి చేరుకుంటామని... దీంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారంలో కొంత మేరైనా తగ్గుతుందని...విదేశీ మారక నిల్వల్ని కొంత కాపాడుకోవచ్చునని తెలిపారు.




**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

Lr.No: 04/CMC/HQ/EE/2026-27 Date: 24.06.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 04/CMC/HQ/EE/2026-27, Date: 24.06.2026 | అభివృద్ధి పనులు | రూ. 7.10 లక్షలు | 25.06.2026 ఉ.10.30 నుండి 02.07.2026 మ.2.30గం.ల వరకు | శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి. సెల్ నెం. 9154299633, 7337367270 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బిల్డింగ్ మెయింటెనెన్స్, సిఎంసి-హెచ్‌క్యూ
DIPR R.O. No. : 4892-PP/CL/ADVT/2026-27, Date: 24-06-2026

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, డివిజన్ : కామారెడ్డి

2026-27 సంవత్సర కాలానికి గాను (2) పనుల కొరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : కామారెడ్డి టెండర్లను ఆహ్వానించడమైనది. **మొత్తం అంచనా విలువ:** రూ.8.00లక్షలు, టెండరుదారులు టెండర్ షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https//tenders.telangana.gov.inలో 22.06.2026 మ.3.00గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది:** 06.07.2026 మ.03.30గం.ల వరకు లేదా అంతకు ముందు. మరిన్ని వివరాలకు https//tenders.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : కామారెడ్డి
DIPR R.O. No. : 4838-PP/CL/ADVT/2026-27, Date: 24-06-2026

## పల్స్ పోలియోకు ఏర్పాట్లు

### డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ డి. రామారావు




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** 28,29,30 తేదీలలో జరగనున్న పల్స్ పోలీయో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఐడిఒసి లోని మొదటి అంతస్తులో గల ప్రేరణ మీటింగ్ హాల్ నందు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రతాప్ సంపత్‌కుమార్, డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ వేణుమాధవరావు పాల్గొన్నారు. సమావేశంలో డాక్టర్ రామారావు మాట్లాడుతూ పట్టణప్రాంతాలోని మురికివాడలు, వలస, సంచార జనాభా, రవాణా కూడళ్లు, అధిక ప్రమాద ప్రాంతాలను ముందస్తుగా గుర్తించటం జరిగిందని, గుర్తించిన అట్టి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, వలస కార్మికులు అధికంగా నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. అలాగే ఇంటింటి సర్వేలు 29, 30 తేదీలలో నిర్వహించి అర్హులైన పిల్లలను గుర్తించి, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు తీసుకోకుండా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంలో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజలు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రహదారులపై గేదెలు కట్టేసిన వారికి అధికారులు నోటీసులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండలంలోని మంగాపురం తండా పంచాయతీ లోని చిన్న తండాలో రహదారిపై గేదెలు కట్టేసిన వారికి బుధవారం పంచాయతీ అధికారులు నోటీసులు అందజేశారు. గేదెలను రహదారిపై కట్టేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కలెక్టర్‌కు దీరావత్ పుష్పావతి ఫిర్యాధు చేసిన క్రమంలో పంచాయత్‌రాజ్ చట్టం ప్రకా రం మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో సంబంధిత వివరాలకు తగు వివరణ మూడు రోజుల్లో ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 'సర్' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ఎన్యుమరేషన్‌కు సంబంధించిన సామగ్రిని పంపిణీ చేశారు. బుధవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమంలో పాల్గొనే ఎఇఆర్‌ఒలు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నేటి నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమంలో బిఎల్‌ఒలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలు అందిస్తారని తెలిపారు. వాటిని ఓటర్లు తమ వివరాలు నమోదు చేసి తిరిగి బిఎల్‌ఒలకు అందజేయాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమ అమలుకు సంబంధించి ఖమ్మం నియోజక వర్గ పరిధిలో ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు, బుక్ 1, బుక్ 2 రిజిస్టర్లు, బిఎల్‌ఒ కిట్లు, ఓటరు అవగాహన కరపత్రాలు, పాంప్లెట్లు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు తదితర ప్రచార సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి సంబంధిత అధికారులకు అవగాహనతో పాటు పలు సూచనలు చేశారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

### సిఐ ఉస్మాన్ షరీఫ్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ఇసుక మాఫియాపై కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ బుధవారం తెలిపారు. రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం అంబారుపేట నదుల నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు, ట్రాన్స్‌పోర్ట్ చలానాలు, ఈ వేబిల్లులు లేకుండా 112 టన్నుల ఇసుకను మూడు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నందిగామ అన్న సాగర్‌కు చెందిన పాములపాటి గోపాలకృష్ణ, ఉమ్మినేని గోపి, బండ్ల కృష్ణ, దాసరి రామకృష్ణ, బండ్ల రామకృష్ణ, లారీ డ్రైవర్, యజమానిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక రవాణాకు ఉపయోగించిన మూడు వాహనాలు, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన కారు తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి ఖమ్మంతో పాటు తెలంగాణలో ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి అక్రమంగా లాభాలు పొందుతున్నట్లు తేలిందన్నారు. అదేవిధంగా పాములపాటి గోపాలకృష్ణపై తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో 12 క్రిమినల్ కేసులు, దాసరి కృష్ణపై ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు కేసులు నమోదైనట్లు సిఐ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా, దొంగతనం, మోసం వంటి నేరాల్లో వీరి ప్రమేయం ఉందన్నారు. అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, క్రయ, విక్రయాల్లో పాల్గొనే వ్యక్తుల పట్ల, సహకరించే మధ్య వర్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణా, వ్యాపారం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క రూ.17.48 కోట్లతో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/బోనకల్:** మధిర నియోజకవర్గ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అభివృద్ధి పనుల జాతరను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి, సుమారు రూ.17.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు కీలక ర హదారుల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. మండలంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తూ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా పనులు ప్రారంభమయ్యాయి. చిరునోముల నుండి వత్సవాయి రహదారి రూ.3.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ రహదారి పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ముష్టికుంట్ల నుండి గార్లపాడు రోడ్డు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.5.50 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించనున్నారు. దళితవాడల అభివృద్ధిలో భాగంగా ముష్టికుంట్ల గ్రామంలోని ఎస్‌సి కాలనీలో రూ.73 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముష్టికుంట్ల నుండి నాగులవంచ మీదుగా చోప్పకట్లపాలెం వరకు రూ.4.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు డిప్యూటీ సిఎం కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. అందులో భాగంగానే నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతాంగానికి అవసరమైన విత్తనాలు, యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులను సకాలంలో అందజేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఎఐయుకెఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ గుమ్మడి నరసయ్య అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నరసయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాల పంటల సీజన్ ప్రారంభమైన నేపద్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు,నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఎరువుల సరఫరా, పంట పెట్టుబడులు వంటి అనేక సమస్యలతో రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు, కల్లూరి కిషోర్, బానోత్ ధర్మా, పందురి వీరబాబు, భూక్యా పంతులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

### 24గంటల్లో పరిశుభ్రత పూర్తి చేయాలని ఆదేశం
### ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలి
### కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో పరిశుభ్రత, నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. బుధవారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠతో కలిసి అశ్వాపురం మండలం గొందిగూడెం గిరిజన ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మికంతగా తనిఖీ చేశారు. కంప్యూటర్ ల్యాబ్, వసతి గృహాలు, వంటశాల, తరగతి గదుల్లో పరిశుభ్రత లోపాలు, కంప్యూటర్ల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని గుర్తించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని గుర్తించి హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ, హాస్టల్, వంటశాలల్లో 24 గంటల్లో పూర్తి స్థాయి పరిశుభ్రత చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తదుపరి ఎలకలగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్, అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. యాప్‌లో నమోదు చేసే వివరాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో ఎంపిడిఒతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

### మంత్రి పొంగులేటికి కెటిఆర్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విలేకరులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సతాయిస్తుందని, ప్రజా సమస్యలను గలమెత్తి చాటే జర్నలిస్టులకే సమస్యలు సృష్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విలేకరుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని ఎంఆర్ గార్డెన్ లో జరిగిన కార్యకర్తల అవగాహన సమావేశానికి బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆర్‌సి జర్నలిస్టులకు మండల అక్రిడిటేషన్ ఇవ్వటంతో పాటు బస్ పాస్ రాయితీలో సైతం కోత పెట్టిన విషయాన్ని సత్తుపల్లి జర్నలిస్ట్ జెఎసి ఆధ్వర్యంలో కెటిఆర్‌కి వివరించి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన కెటిఆర్ జర్నలిస్టుల సమస్య పరిష్కారమయ్యే వరకు జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. వినతిపత్రం అందించిన వారిలో షైబుద్దీన్, సుధాకర్, రాము, శ్రీకాంత్, బాలు, శ్రీను, సురేష్, అప్పారావు, నాగేశ్వరరావు తదితరులున్నారు.

## రిపోర్టర్ అపర్ణ మృతి దిగ్భ్రాంతి కలిగించింది

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్త-గూడెం :** సీనియర్ రిపోర్టర్ అపర్ణ మృతి తీవ్ర గిగ్భ్రాంతిని కలిగించిందని, ఆమె మరణం బాధాకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని ఐలయ్య కాలనీకి చెందిన అపర్ణ (32) తన ఇంట్లో బుధవారం ఉరి వేసుకుని బలవన్మరణం పొందారు. ఈ విషయం తెలుసుకున్న పాషా అపర్ణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న జర్నలిస్టు అపర్ణ ఇలా అర్థాంతరంగా తనువు చాలించడం అత్యంత బాధాకరం అన్నారు. ఆమెకు తల్లితో పాటు ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారని, వారు ఇప్పుడు పూర్తిగా అనాథలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, అపర్ణ మృతిపై విచారణ జరపాలని కోరారు. నివాళులర్పించిన వారిలో నాయకులు కొమారి హన్మంతరావు, మాచర్ల శ్రీనివాస్, సపావట్ రవి తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'కు రాజకీయ పార్టీలు సహకరించాలి

### ప్రతీ ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు
### బిఎల్ఒ, బిఎల్ఎలు సమన్వయంతో పనిచేయాలి
### కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో రానున్న 30 రోజుల్లో ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని తిరిగి స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో గుర్తించిన ఎక్కువ శాతం అనామలీలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లల వివరాలను వెంటనే అందజేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు ఓటు హక్కు కొనసాగేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలన్నారు. బిఎల్ఎలు తమ రాజకీయ పార్టీ జారీ చేసిన గుర్తింపుకార్డు కలిగి ఉండాలన్నారు. ముసాయిదా జాబితాలో ఎవరి పేరు లేకపోయినా తప్పనిసరిగా అభ్యంతరం నమోదు చేయాలని అలా చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కోసం జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. బిఎల్ఒలు, బిఎల్ఎలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమస్యలు, సందేహాలను వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అవసరమైన చోట్ల బిఎల్ఒలకు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో సిసి రోడ్డు నిర్మాణం

### సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా సిసిరోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సిపిఐ కౌన్సిలర్ దండి రంగరావు అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో గల శ్రీ చైతన్య నగర్3లో రూ.15లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వార్డు ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రహదారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్ల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దశలవారీగా అన్ని అంతర్గత రహదారులను సిసిరోడ్లుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పని చేస్తున్న అన్నారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూ చించారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ఏర్పాటుకు నిధులు కేటాయించిన మంత్రి పొంగులేటికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోసూరి బాబురావు, కాలనీవాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్తగూడెంలో విత్తన మేళా

### 'కేతి బచావో అభియాన్', ఆయిల్‌పామ్ సాగుపై సూచనలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెం రైతు వేదికలో నిర్వహిస్తున్న విత్తన మేళాను కూసుమంచి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సతీష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు...కేతి బచావో అభియాన్ కార్యక్రమ లక్ష్యాలు, వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ఉమానాగేష్ రైతులకు ఆయిల్‌పామ్ సాగు అవకాశాలు, పీఎంకుసుమ్ పథకం, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటల ఎంపిక, అలాగే నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానాలపై వివరించారు. వ్యవసాయ రంగంలో కొత్త సాంకేతికతలు, ప్రభుత్వ పథకాలపై రైతులు అవగాహన పెంచుకొని లాభదాయక సాగువైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కొలతల్లో కోతలు.. తూకాల్లో మోసాలు!

### ఎలక్ట్రానిక్ కాంటాల్లో భారీ అక్రమాలు
### కానరాని తనిఖీలు
### జాడలేని తూనికలు, కొలతలశాఖ అధికారులు
### భద్రాచలంలో తెరుచుకోని కార్యాలయం






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వినియోగదారులకు ఖచ్చితమైన తూకం (బరువు) ఉన్న వస్తువులను అందించాలి. ఇలా పొందడం వినియోగదారుని హక్కు కూడా. అయితే జిల్లా వ్యాప్తంగా చాలా చోట్లు వ్యాపారులు కొలతల్లో కోతలు విధించడంతో పాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తూకపు రాళ్ల వ్యవహారంతో పాటు ఎలక్ట్రానికి కాటాల్లో కూడా ఇదే తరహా తంతు కొనసాగుతోంది. దీనిని నియంత్రించాల్సిన అధికారులు పత్తాలేకుండా పోవడం, నెలలు తరబడి కార్యాలయాన్నే తెరవకపోవడం విడ్డూరం. వాస్తవానికి ప్రతీ ఏటా తూకపు రాళ్లను తూనికలు కొలతల అధికారులు తనిఖీ చేసి వాటికి అధికారిక సీల్ వేయాలి. కానీ అది ఎక్కడా కానరావడం లేదు. అంతే కాకుండా ఎలక్ట్రానిక్ కాంటాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ మోసాలకు తావు లేకుండా చూడాలి. ఏళ్ల తరబడి తూకపు రాళ్లను వాడటంతో అవి అరుగుదలకు గురై వాస్తవపు బరువును కోల్పోతుంటాయి. వినియోగదారులకు వాటితోనే వ్యాపారులు తూకాలేసి ఇవ్వడంతో వాస్తవపు బరువు గల వస్తువులు రావడటం లేదు. తద్వారా కేజీకి సుమారు 50గ్రాముల నుండి 100 గ్రాముల వరకు వినియోగదారులు నష్టపోతున్నారు. ఇదిలా ఉండగా ఎలక్ట్రానిక్ కాంటాల మోసం అంతా ఇంతా కాదు. కాంటాలోనే ప్లస్, మైనస్ అనే రెండు రకాల ఆప్షన్లు ఉంటున్నాయి. మైనస్‌లో పెట్టి తూకం వేయడం ద్వారా సుమారు 100 గ్రాముల నుండి 150 గ్రాముల వరకు తరుగు వస్తోంది. ఇలాంటి మోసాలు భారీగా మాంసాహారాన్ని విక్రయించే దుకాణాల్లో తారసపడుతున్నాయి. మరో పక్క కూరగాయల వ్యాపారాలు, చిన్నచిన్న కిరాణా దుకాణాల్లో ఎదురవుతున్నాయి. ఇక మాంసాహారపు దుకాణాల్లో ప్రత్యేకమైన రోజుల్లో జరిగే దోపిడీ అంతా ఇంతా కాదు. కోట్ల రూపాయల్లో వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. జన సంచారం లేని సమయాల్లో అధికారులు మార్కెట్లలోకి ప్రవేశించి తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో పక్క ఒక షాపులో తనిఖీలు జరుగుతుండగా మిగతా వారు సర్దుకుంటున్నారు. ఏక కాలంగా కనీసం పది నుండి 20షాపుల్లో ఈ తనిఖీలు నిర్వహిస్తే తప్ప దొంగలు దొరికే పరిస్థితి లేదు. ఇదిలా ఉండగా సాధారణ కాంటాల్లో తూకపు మధ్య భాగంలో ఉండే సూచిక కింద ఉండే బటన్‌ను తెలివిగా పక్కకు జరుపుతున్నారు. దీంతో తూకంలో కనీసం 100 గ్రాములు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తూనికలు, కొలతల అధికారులు జాడే లేదు. కనీసం తనిఖీలు చేసిన దాఖలాలే లేవు. అసలు కొందరికైతే ఆ శాఖకు చెందిన అధికారులు ఎవరో కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. తనిఖీలు చేసింది, దోషులను గుర్తించింది, అపరాద రుసుము ఏ మేరకు కట్టించారో అనే వివరాలు తెలుకుందామన్నా కష్ట తరంగా మారింది. వినియోగదారుల జేబులకు భారీగా చిల్లు పడుతున్నా పట్టించుకునే వారు లేకపోవడం హాస్యాస్పదం.

### భద్రాచలంలో మూతపడ్డ కార్యాలయం

భద్రాచలంలోని ఐటిడిఎ ప్రాంగణంలో ఉన్న తూనికలు కొలతల కార్యాలయానికి ఎప్పుడు చూసిన తాళం బిగించే ఉంటుంది. ఏదైనా ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వెళితే అక్కడ ఎవ్వరూ ఉండరు. ఏదోలా తంటాలు పడి ఫోన్ నెంబర్ దొరికించుకుని మాట్లాడితే క్యాంపులో ఉన్నాం, ఇప్పుడెవ్వరూ ఆఫీసులో ఉండరూ ఫీల్డ్‌లో ఉన్నామంటూ బదులివ్వడంతో పాటు ఫిర్యాదు చేయదలుచుకుంటే తెల్లకాగితంపై రాసి అక్కడ పెట్టి వెళ్లండి అంటూ బదులిస్తున్నారని పలువురు వాపోతున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరిద్దామని అనుకుంటే కార్యాలయపు బోర్డులో ఏ అధికారి పేరు కనిపించదు. అన్నిశాఖలకు సమాచార చట్టం అప్పిలేట్ అధికారి నెంబర్ సంబంధిత కార్యాలయంలో కనిపించేలా పెడతారు, కానీ ఇక్కడ అదేమీ లేదంటే ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తూనికలు, కొలతల వ్యవహారంలో జరుగుతున్న కోట్ల రూపాయల దోపిడీపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



## విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి

విచారం వ్యక్తం చేసిన సిఎండి వరుణ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ రూరల్ :** విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతిచెందిన సంఘటన జనగామ మండలంలోని చిటకోడూరులో జరిగింది. రాధమల్ల కరుణాకర్‌రెడ్డి అనే వ్యక్తి షాక్‌కు గురై అక్కడికి అక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విద్యుత్ సంస్థ తరుపుల కరుణాకర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని హామి ఇచ్చారు. పూర్తి వివరాల్ని పరిశీలిస్తే గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమస్యను పరిష్కరించేందుకు బుధవారం ఉదయం లైన్‌మెన్ కరుణాకర్‌రెడ్డి ట్రాన్స్‌పార్మర్ వద్ద లైన్ తనిఖీ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్ తగలడంతో కరుణాకర్‌రెడ్డి అక్కడికి అక్కడే మృతి చెందారు. కాగా కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పటల్‌కు తరలించారు. విద్యుత్ ఉద్యోగులు మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. డిపార్ట్మంట్ తరుపున అన్ని విధాల ఆదుకుంటామని హామి ఇచ్చారు. సిఎండి వరుణ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. విద్యుత్ సిబ్బంది విధుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## నీటి తొట్టిలో పడి చిన్నారి... గుండెపోటుతో నానమ్మ మృతి




**ప్రజాపక్షం/జనగామ :** జనగామ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో విషాద సంఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం రెండేళ్ల చిన్నారి రియాన్సీ ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందింది. ఆ చిన్నారి మృతిని తట్టుకోలేక నానమ్మ మారబోయిన నాగమ్మ తీవ్ర ఆవేదనకు గురై గుండెపోటుతో కుప్పకూలింది. కుటుంబ సభ్యులు వెంటనే హాస్పటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందింది. దీనితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు ఒకేరోజు జరగడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు ఈ నరసింహన్ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన నరసింహన్‌కు ఆలయ ఈవో రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. నరసింహన్ వెంట రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పోరిక రాము, డిప్యూటీ డైరెక్టర్లు సునయన చౌహాన్, పరుశరాములు తదితరులు ఉన్నారు. ముందుగా ఆది శంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహుకరించి ప్రసాదాలు అందజేసి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో సహాయక ఆడిట్ అధికారులు సురేందర్ రెడ్డి, రవిప్రసాద్, రమేష్, ఆరిఫ్, సీనియర్ ఆడిటర్లు సుమన్ రావు, అశోక్, కిషోర్, నాగరాజు, దుర్గారావు, ఆలయ అధికారి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## 27న మెగా జాబ్ మేళా

టిఆర్ఎల్‌డి రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఈ నెల 27న హసన్‌పర్తి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీఆర్ఎల్డీ రాష్ట్ర అధ్యక్షుడు కె. దిలీప్ కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ లో బుధవారం తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ హనుమకొండలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయాధారిత వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన 100కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. 27న శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని, వరంగల్, పరిసర జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనడానికి ఎటువంటి రుసుము లేదని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న), మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ వెంకటనారాయణ, మాజీ పార్లమెంట్ సభ్యులు కెప్టెన్ లక్ష్మీ కాంతరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.నాగరాజు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగ్గా, అవినీతి రహిత సమాజ నిర్మాణ లక్ష్యంతో లక్ష్యం కోసం లక్ష సైన్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ అధికార ప్రతినిధి గౌర బీరప్ప మాట్లాడుతూ రానున్న నల్గొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ తరపున కపిలవాయి దిలీప్ కుమార్ పోటీ చేయనున్నట్లు ప్రకటించారు ఈ విలేకరుల సమావేశంలో టీఆర్ఎల్డీ వరంగల్ జిల్లా అధ్యక్షులు రాంప్రసాద్, టీఆర్ఎల్డీ యువజన విభాగం అధ్యక్షులు రాజ్ కుమార్ రెడ్డి, టీఆర్ఎల్డీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు బుల్లెట్ వెంకన్న, టీఆర్ఎల్డీ రాష్ట్ర కోశాధికారి గిరి కుందే, రాష్ట్ర కార్యదర్శి కోటి, ప్రధాన కార్యదర్శి నరసింహారావు తదితర టీఆర్ఎల్డీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాఖల సమన్వయంతోనే ఆదర్శ గ్రామాలు

అధికారులకు మంత్రి సీతక్క దిశా నిర్దేశం




**ప్రజాపక్షం/ములుగు :** తెలంగాణ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ఉమ్మడి ప్రణాళిక రూపొందించి పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. శాఖలు విడివిడిగా పనిచేస్తే ఆశించిన ఫలితాలు రావని, సమగ్ర అభివృద్ధికి సమన్వయమే కీలకమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఏటా వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నప్పటికి ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని ఆమె అన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న హెచ్‌ఓడి అధికారులు కలిసి పనిచేస్తే గంగదేవిపల్లి తరహా ఆదర్శ గ్రామాలను సులభంగా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని స్థానిక వనరులు, అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాలకు వచ్చే ప్రతి రూపాయిని సద్వినియోగం చేయడంతో పాటు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే రెండు నెలల్లో గ్రామ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై అదనపు కలెక్టర్లు, ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని గ్రామసభ ఆమోదం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని చోట్ల నిధుల దుర్వినియోగంపై వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. తాను కూడా మౌలిక సదుపాయాలు లేని గ్రామం నుండి వచ్చానని, గ్రామీణ ప్రజల కష్టాలు తెలుసునని మంత్రి సీతక్క అన్నారు. శాఖ పరిధిలో 1.35లక్షల మంది సిబ్బంది, రూ.34వేల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న నేపథ్యంలో ప్రతి రూపాయిని ప్రణాళికబద్దంగా వినియోగిస్తే అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించవచ్చని ఆమె పేర్కొన్నారు.

## ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధ్యయన కేంద్రం (స్టడీ సర్కిల్), బంజారాహిల్స్, హైదరాబాద్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీఎస్ఏటీ) – 2026– 27 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ చైర్పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కలెక్టరేట్ లో బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, తెలంగాణలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అభ్యర్థులు 19 జూన్ 2026 నుంచి 12 జూలై 2026 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకోసం http://tsstudycircle.co.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 19 జూలై 2026న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకులు డాక్టర్ కె. జగన్ మోహన్, పర్యాటక అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఎం. శివాజీ, కనకరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

## కలిమే చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

సహజ వనరుల దోపిడీ అరికట్టాలంటున్న వీరారం గ్రామస్థులు



**ప్రజాపక్షం/మరిపెడ :** గ్రామ చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోని న్యాయం చేయలని గ్రామస్తులు వేడుకుంటున్న సంఘటన మరిపెడ మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామ పరిధిలోని కలిమే చెరువులో గత కొన్ని రోజులుగా కొందరు అక్రమార్కులు జెసిబిలు, ట్రాక్టర్లతో అక్రమంగా నల్ల రేగడి మట్టిని ఇటుక బట్టిలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారని, అధికారులు పట్టించుకున్న పాపన పోవట్లేదని ఆరోపించారు. అక్రమ మట్టి తవ్వకాలతో చెరువు సహజ రూపం కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్బ జలాలు పడిపోయే ప్రమాదం ఉందని, వర్షకాల సాగు కష్టమేనని వాపోయారు. ఇప్పటికైనా రెవిన్యు, ఇరిగేషన్, మైనింగ్ శాఖల జిల్లా అధికారు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి మట్టిమఫియాపైన, వారికి సహకరిస్తున్న కిందిస్థాయి అధికారులపైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలనీ, అక్రమ తవ్వకాలను అరికట్టలనీ గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# 'డబుల్ ఓట్ల'పై చట్టపరమైన చర్యలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఓటరు జాబితాను మరింత ప్రామాణికంగా, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ 2026) కార్యక్రమానికి ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ 2026 అమలు విధానం, ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఓటర్ల బాధ్యతలపై సమగ్ర వివరణ అందించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారం పూరించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సరైన సమాచారం చేరవేసే విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలని అన్నారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో నిర్వహించిన ముందస్తు ఎస్ఐఆర్ ప్రక్రియ సానుకూల ఫలితాలను ఇచ్చిందన్నారు. వరంగల్ పశ్చిమలో 68 శాతం, పరకాలలో 87 శాతం మేర మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని చెప్పారు. వాటిని పూర్తిగా నింపి తిరిగి సమర్పించడం ద్వారా ఓటర్లు తమ వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు, 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే ఎస్ఐఆర్ 2026 విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, డీఆర్ఓ కె. శ్రీనివాస్, డీపీఆర్ఓ అయూబ్ అలీ,ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి


గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్

**ప్రజాపక్షం/జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్ అన్నారు. గుడిసెలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న నిరుపేదలకు రెండో విడతలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బుధవారం జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నెల్లుట్ల, జనగామ మున్సిపాల్టీ పరిధిలో వార్డు నెంబర్ 2,10లో, వీవర్స్ కాలనీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బాణాపురంలోని రెండు పడక గదుల ఇళ్లను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌తో కలిసి గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండో విడతకు ముందే మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలని, దశల వారిగా విడుదలయ్యే నిధులను సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యతో ఇళ్ల నిర్మాణం చేయాలన్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అయ్యింది, ఎంత మేరకు బిల్లు పొందారు, ఇటుకలు, ఇసుక, సిమెంట్ నిర్మాణ సామాగ్రికి ఎంత ఖర్చు అయ్యిందని అడిగి తెలుసుకున్నారు. కడమంచి అబ్బమ్మ అనే లబ్ధదారురాలి ఇంటి నిర్మాణ పురోగతిని పర్యవేక్షించి ఎంత ఖర్చు అయిందని, బిల్స్ ఎంత వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. రేకుల ఇళ్లు, గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత నిరుపేదలు, సొంత పక్కా ఇల్లు లేని కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. నిర్మాణ పనుల విషయంలో ఇంజనీరింగ్ అధికారులు నిరుపేద కుటుంబాలకు సాంకేతిక సహాయం అందించి నాణ్యమైన నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే బాణాపురంలో రెండు పడకల గదుల ఇళ్లకు తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్య, రహదారులు, విద్యుత్ వంటి మౌళిక వసతులు కల్పించాలన్నారు. గుడిసెల్లో నినసిస్తూ కట్టెల పోయ్యిలపై వంటలు చేసేవారికి గ్యాస్ కనెక్షన్లు మంజూరి చేయించాలని తహాశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి, గృహ నిర్మాణ శాఖ పిడి మాతృనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



## 2బిహెచ్‌కె ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/రాయపర్తి :** మండలంలోని గన్నారం, కాట్రపల్లి గ్రామంలోని 2బిహెచ్‌కే గృహాలను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల నిర్మాణ స్థితి, మౌళిక వసతులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2బిహెచ్‌కే ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో అరుహలైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి, జడ్పి సిఈఓ రాంరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హుల జాబితాను రూపొందించి, నిజమైన నిరుపేదలకు గృహాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్‌డిఓ సుమ, తహసీల్దారు శ్రీనివాస్, ఆర్ఐ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి శ్రీధర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి ఎన్.శ్రీధర్ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మార్చి 6 నుండి జూన్ 12వ తేదీ వరకు జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి మండల జిల్లా స్థాయి వరకు నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు బాగా చేశారని అభినందించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సూచించారు. ప్రజాపాలన గ్రామసభల్లో 6391 దరఖాస్తులు రాగా 716 పరిష్కారం అయ్యాయని, 5674 దరకాస్తులు పరిష్కరించాల్సి ఉన్నట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో పింఛన్ల, రెండు పడక గదుల ఇండ్లు, విద్యుత్తు, సైడ్ డ్రైన్లు, సిసి రోడ్లు, మంచినీరు, గ్రామ పంచాయతి భవనాలు నిర్మాణాలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని వాటిలో ప్రాధాన్యతను ప్రామాణికంగా తీసుకుని పరిష్కరించాలని, తదుపరి మిగిలిన దరఖాస్తులు పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కార స్వభావాన్ని ప్రజలకు తెలియచేయాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు గత 5 సంవత్సరాలలో ఎంత ఆదాయం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని సోలార్ విద్యుత్, బస్సులు, బ్యాంక్ లింకేజీ రుణాలు ఇస్తున్నదని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాదించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారులు నిర్వహణ, మొక్కలు పెంపకం, వ్యర్థాలు నిర్వహణ పకడ్బందీగా జరగాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, సమస్యలు, పరిష్కారానికి టై బాండ్ యాక్షన్ ప్లాన్ తయారు చేయనున్నట్లు తెలిపారు. 99 రోజుల కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో దిగ్విజయంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి శాఖ ద్వారా చేపట్టిన పనులు పూర్తిచేసేలా కార్యాచరణ తయారు చేయనున్నట్లు తెలిపారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా స్వచ్ఛత, కచ్చితత్వ పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు :** ఓటరు జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వాన్ని పరిరక్షించేందుకు ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్లు 17, 18, 31 నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటరు నమోదు నిషేధమని, సెక్షన్ 17 ప్రకారం, ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు కావడానికి అర్హుడు కాదని తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పేరు నమోదు అయినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత నమోదులను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీలో ప్రజలు సహకరించాలని, ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి, సరైన సమాచారం మాత్రమే అందించాలని, ఒకటి కంటే ఎక్కువ నమోదులు ఉన్నట్లయితే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. స్వచ్ఛమైన, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో ప్రతి పౌరుడు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆ ప్రకటనలో కోరారు.

# డిటిఒ వెంకన్న ప్రమాదంపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్


రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్

**ప్రజాపక్షం/భూపాలపల్లి/గణపురం :** ఈ నెల 22న ఉదయం భూపాలపల్లి ఆర్టిఓ ఆఫీస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన డిటిఓ వెంకన్న దుర్మరణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ ప్రమాదంపై సీన్ రీకన్స్రక్షన్ నిర్వహించడం జరిగిందని రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు. బుధవారం గణపురం మండలం చెల్పూర్ ఆర్టీవో కార్యాలయం ముందు ప్రమాద ఘటనపై రీ కన్స్రక్షన్ నిర్వహించారు. మరణించిన జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మృతిపై ఈ విచారణలో భాగంగా విచారణ అధికారి చంద్ర శేఖర్ గౌడ్ భూపాలపల్లిలో సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా మొదట ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. సంఘటనకు సబంధించి పోలీసులు చేపట్టిన ప్రాథమిక దర్యాప్తు వివరాలను స్టేషన్ సిఐ కరుణాకర్ రావు, ఎస్ఐ అశోక్‌లను అడిగి తెలుసుకున్నారు. తర్వాత లారీ డ్రైవర్‌ను, లారీ ఓనర్, హార్వెస్టర్ డ్రైవర్‌ను విచారించారు. తర్వాత జెన్ కో అధికారులతో సమావేశమయ్యి ఆ రోజు లారీలో ఉన్న బొగ్గు వివరాలు తెలుసుకున్నారు. తర్వాత సంఘటనా స్థలానికి చేరుకుని నలుగురు ప్రత్యక్ష సాక్షులను విచారించారు. సీన్ రీ కన్స్రక్షన్ చేసి సంఘటన జరిగిన పరిస్థితులను విశ్లేషించారు. సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. తర్వాత బొగ్గు లోడింగ్ పాయింట్ అయిన తాడిచర్లకు వెళ్లి అక్కడ ఓపెన్ కాస్ట్ ప్రతినిధులతో సమావేశమయ్యి ఆరోజు ఆ లారీ లోడ్ రికార్డులను పరిశీలించారు. విచారణ అధికారి చంద్ర శేఖర్ గౌడ్ వెంట మోటారు వాహన తనిఖీ అధికారులు జంగ్లీ శ్రీనివాస్, శివపల్లి శ్రీనివాస్, బారగాడి శ్రీనివాస్, ఘన్‌పూర్ సిఐ కరుణాకర్ రావ్, ఎస్ఐ అశోక్, భూపాలపల్లి ఏఎంవిఐలు ఫాహిమా సుల్తానా, సుందర్ లాల్, శ్రీనివాస్ ఉన్నారు. ఒకటి రెండు రోజుల్లో సంఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదిక వివరాలను రవాణా కమిషనర్‌కు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం సుబేదారి పోలీస్ స్టేషన్ ఆవరణలోని మహిళా పోలీస్ స్టేషన్1ను సందర్శించి, నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలు, కార్యాచరణ అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ వరంగల్ రంగంపేటలోని మహిళా పోలీస్ స్టేషన్–2లో ప్రస్తుతం కొనసాగుతున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం నిర్వహణ విధానం, కేసుల పరిష్కార ప్రక్రియ, నిర్వహిస్తున్న రికార్డులు, నమోదు పుస్తకాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, మహిళా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, సూర్యప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత, సుబేదారి ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్, సర్వోదయ కార్యదర్శి డా.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం / గంగాధర :** గంగాధర మండలం చెర్లపల్లి (ఆర్) గ్రామానికి చెందిన పుల్కం కావ్య తిరుపతి నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎట్టెపు కనుకయ్య, ఉప సర్పంచ్ నేరెళ్ల అయిలయ్య, కాంగ్రెస్ నాయకులు అట్ల రాజశేఖర్ రెడ్డి, దాది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'యాంటీ డ్రగ్స్'పై అవగాహన



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** మాదకద్రవ్యాల నిర్మూలన ,యువతలో అవగాహన పెంపొందించేందుకు గొల్లపల్లి ఎస్సై ఎం. కృష్ణసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ నార్కోటిక్స్ అండ్ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులకు మాదాక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక మానసిక సామాజిక నష్టాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . ఎవరైనా గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలను విక్రయించడం, కొనుగోలు చేయడం,నిల్వ చేయడం లేదా వినియోగించడం గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

**ప్రజాపక్షం/కొమురవెల్లి:** బంగారు,వెండి ఆభరణాలతో పాటు ద్విచక్ర వాహనాలను అపహరించి న సంఘటనలో కొమురవెల్లి మండల పోలీసులు చేధించి ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను పట్టుకొని అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఫిర్యాదు దారుడు సార్ల సురేష్ (39) ఇచ్చి న ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన క్రమంలో ఈ నెల 23న మండల పరిధిలోని వేచరేణి గ్రామ శివారులోని గుర్జకుంట కమాన్ వద్ద ఎస్ఐ టి.మహేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు.నిందితులు దొంగరి రాజు 31,పొట్ట ప్రవీన్ (29),బొద్దుల శ్రీనాథ్ (2 8)లు మెదక్ జిల్లా కుల్చారం పోలీస్టేషన్ పరిధిలో ని చేపల దుకాణంలో మహిళమెడలోంచి పుస్తెల తాడు,ఒక మొబైల్ ఫోన్‌ను,నిజామాబా ద్ జిల్లా జక్రాన్ పల్లి పోలీస్టేషన్ పరిధిలోని మొ బైల్ షా పులో హెచ్‌పి ల్యాప్ ట్యాప్,సిసి కె మెరా మానిటర్‌ను,కొమురవెల్లి పోలీస్టేషన్ పరిధిలోని తాళం వే సి ఉన్న ఇంటిలో చోరీ చేసి బంగా రు,వెం డి ఆభరణాలు అపహరించినట్లు అంగీకరించారు. దొంగలించిన బంగారు ఆభరణంలోని కొంత భా గాన్ని హైదరాబాద్‌లో విక్రయించగా కుల్చారం కే సుకు సంబంధించిన బంగారు పుస్తెల తాడును ని జామాబాద్ ఎఫ్ఐడి బ్యాంకులో కుదువ పెట్టిన ట్లు విచారణలో తెలిపారు.నిందితుల వద్ద నుండి బం గారు,వెండి ఆభరణాలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలనుస్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై కేసులు నమోదు

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు తప్పనిసరిగా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సి రెగులైజేషన్ ఆక్ట్ 2005 నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన తర్వాతే కార్యకలాపాలు నిర్వహించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో లైసెన్స్ లేకుండా ప్రైవేట్ సెక్యూరిటీ సేవలు అందిస్తున్న ఏడు సెక్యూరిటీ ఏజెన్సీలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సి రెగులైజేషన్ ఆక్ట్ 2005 చట్టం ప్రకారం అనుమతి లేకుండా సెక్యూరిటీ ఏజెన్సీలను నిర్వహించడం నేరమని పేర్కొన్నారు. గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ వన్ టౌన్, కరీంనగర్ టూ టౌన్ మరియు చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధుల్లో పనిచేస్తున్న ఆయా ఏజెన్సీలపై ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సి రెగులైజేషన్ ఆక్ట్ 2005 సెక్షన్ 20, 22 మరియు బిఎన్ఎస్ సెక్షన్ 318(4) కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఏజెన్సీల ద్వారా దాదాపు 146 మంది సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల యజమానులు చట్టబద్ధమైన అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే కార్యకలాపాలు కొనసాగించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సి రెగులైజేషన్ ఆక్ట్ 2005 చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం / రామడుగు:** మండలంలోని పందికుంటపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన కురుమపల్లెలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా సంఘ భవనానికి బుధవారం సర్పంచ్ దయ్యాల లత వీరమల్లు ఉప సర్పంచ్ వినోద్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళా సంఘాల మహిళల కోసం ఇట్టి భవన నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మహిళా సాధికరత కోసం మరిన్ని పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాజేశ్వరి, పంచాయతీరాజ్ ఏఈ సుమన్, ఏపిఎం, పంచాయతీ కార్యదర్శి, ఐకెపి సిసివివోలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో అగ్రగామి కరీంనగర్

ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా




**ప్రజాపక్షం / కరీంనగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలలో కరీంనగర్ జిల్లాను అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి హైదరాబాద్ నుంచి నేరుగా కరీంనగర్ కలెక్టరేట్‌కి చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు సేవలు అందించడం అధికారుల అదృష్టంగా భావించాలని, ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని సమస్యల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుపై నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రతినెల ఒకటో తేదీన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజాపాలన/ప్రగతి నివేదిక ప్రణాళికను కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన జిల్లాయంత్రాగాన్ని ఆయన అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నిధుల కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫించన్లు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 ప్రధాన అంశాలపై జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారంలో భాగంగా 4290 ఫైళ్లు పరిష్కరించగా 3835 ధరఖాస్తులు స్వీకరించామని అరైవ్‌అలైవ్ కార్యక్రమంలో 318 గ్రామ పంచాయతీల్లో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో 1.33 లక్షలమంది రైతులకు 134.35 కోట్ల రైతు భరోసా, 206 రైతు కుటుంబాలకు రూ.14 కోట్ల రైతు భీమా అందించగా 319 కోనుగోలు కేంద్రాల ద్వారా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.554 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేయడం జిగిందన్నారు. సంక్షేమ పథకాల కింద 45920 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా 96775 కొత్త సభ్యుల పేర్లను చేయించడం జరిగందన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు రూ.334 కోట్ల ప్రయోజనం, గృహజ్యోతి ద్వారా రూ.153.10 కోట్ల లబ్ధికల్పించామని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 10209 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 7220 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, మెగా జాబ్‌మేళాలో 292 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని, ప్రజావాణి ద్వారా వచ్చిన 2995 దరఖాస్తుల్లో 2144 దరఖాస్తులు పరిష్కరించినట్లు కలెక్టర్ వివరించారు. బడిబాట కార్యక్రమం ద్వారా 9435 మందిని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చేర్పించడం జరిగిందన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతమైందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సిపి గౌష్ ఆలం, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్‌తోపాటు ఆయా శాఖల అధికారులు, తమ తమ శాఖలకు సంబంధించిన 99 రోజుల కార్యక్రమంపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలపై కఠిన చర్యలు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలు, భూ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ కో య శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముత్తారం మండలంలోని పోతారం, మై దంబండ గ్రామాల్లో ప్రభుత్వ భూములపై అక్రమ ంగా సృష్టించబడిన పట్టాలపై సమగ్ర విచారణ నిర్వహించినట్లు తెలిపారు.విచారణలో భాగంగా రెవిన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత అధికారుల నివేదికలు, అందుబాటులో ఉ న్న ఆధారాలను పరిశీలించగా పోతారం గ్రామంలోని సర్వే నెం.59లో 19 ఎకరాలు 01 గుంటల భూమి, మైదంబండ గ్రామంలోని సర్వే నెం.113లో 11 ఎకరాలు 02 గుంటల భూమి ప్రభుత్వ భూములుగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. సం బంధిత వ్యక్తులు సదరు భూములను ఎప్పు డూ సాగు చేయలేదని, భూములు వారి భౌతిక స్వాధీనంలో కూడా లేవని విచారణలో తేలిన నేపథ్యంలో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలను రద్దు చేసినట్లు తెలిపారు.తదనుగుణంగా సంబంధిత భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుని నోషనల్ ఖాతాలో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై, ప్రభుత్వ భూముల పై అక్రమ హక్కులు పొందేందుకు సహకరించిన మిషన్ భగీరథ మంథని సబ్ డివిజన్ హెల్పర్ గుజ్జుల శ్రీధర్ , మంథని ముత్తారం ఎంపిడిఒ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ పాదాల సతీష్, ముత్తారం నరేగా ఫీల్డ్ అసిస్టెంట్ ధూమల శ్రవణ్ వారిపై, అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## పకడ్బందీగా ఓటరు జాబితా: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, పకడ్బందీగా, పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లత కోరారు.సర్ కార్యక్రమం అమలులో జగిత్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు.బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్ఒలు ఇంటింటి సందర్శన చేపట్టి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి నింపిన ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలోబిఎల్ఎలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు.జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం చేపట్టి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.బిఎల్ఒలు ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఫారం అందని వారు లేదా పొరపాటున జాబితాలో చేరని అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్ల సహకారాన్ని కూడా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పుల కోసం ఫారం8, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం6 వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్‌డిఒలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

## తెగిపోయిన మానేరు వాగు తాత్కాలిక రోడ్డు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లోని ముత్తారం మండలం ఓడేడు మానేరు వాగుపై నేషనల్ హైవే కాంట్రాక్టర్ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది.గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మానేరు వాగులో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో జాతీయ రహదారి పనుల కోసం వేసిన ఈ మట్టి రహదారి నీటి ప్రవాహానికి కొంతమేరకు తెగిపోయింది.నిలిచిపోయిన రాకపోకలు వాహనదారుల ఇబ్బందులుఈ తాత్కాలిక రహదారి తెగిపోవడం వల్ల పెద్దపల్లి భూపాలపల్లి జిల్లాల మధ్య ప్రధాన రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఇటువైపుగా ప్రయాణించే వందలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

**అటువైపు రావొద్దు..!**

**ఎస్ఐ రవికుమార్ హెచ్చరిక**

రోడ్డు పూర్తిగా దెబ్బతినడం,వాగులో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని ముత్తారం ఎస్సై రవికుమార్ తోపాటు అధికారులు హెచ్చరించారు. ప్రయాణికులు,వాహనదారులుఎవరూ కూడా మానేరు వాగు మట్టి రోడ్డు వైపు రావద్దని, ప్రత్యామ్నాయ మార్గాల ను ఎంచుకోవాలని సూచించారు. వరద తగ్గాక, రోడ్డు పునరుద్ధరణ పనులు చేపడతామని కాంట్రాక్ట్ ప్రతినిధులు తెలిపారు.

## ఆల్ఫోర్స్ ఇ-టెక్నోలో లెడ్‌పై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం / కొత్తపల్లి :** విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా వారు ఆరోగ్యంగా ఉండాలని తద్వార సంపూర్ణంగా లక్ష్యాలను చేరుకుంటారని పోత రాజ హరిప్రసాద్, అదనపు కలెక్టర్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ విద్యాధికరి, ఎన్.ప్రశాంత్ రెడ్డి, అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్‌లోని ఆల్ఫోర్స్ టెక్నో పాఠశాలను లెడ్‌పై నిర్వహించినటువంటి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మానవ శరీరంలో ముఖ్యంగా పిల్లలలో సీసం (లెడ్) పేరుకుపోవడాన్ని లీడ్ పైజనింగ్ అంటామని దీనివల్ల మెదడు, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయని అది కలుషితమైన గాలి, పాత పాయింట్లు, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. లీడ్ సెజనింగ్ ప్రపంచవ్యాప్తంగా పిల్లలను చాలా ఉంటుందని తెలుపుతూ దీనికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లతో సంప్రదింపుల ద్వారా సీసం యొక్క ప్రభావాన్ని తక్కువ చేయాలని చెప్పారు.ప్రతి వ్యక్తికి 4 లేదా 5 గ్రాముల కంటే ఎక్కువగా సీసం ఉండకూడదని రక్తశాతంలో బలహీనత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు యువత కృషి

జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్, ఎస్ఐ ఉమాసాగర్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంను మంగళవారం జగిత్యాల రూరల్ పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ ఉమాసాగర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జగిత్యాల రూరల్ పోలీసులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు,ఆరోగ్యపరమైన నష్టాలు విద్యా భవిష్యత్తుపై వాటి ప్రభావం, కుటుంబ, సామాజిక జీవితంపై ఏర్పడే దుష్పరిణామాల గురించి జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్, ఎస్ఐ ఉమాసాగర్ వివరించారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి స్నేహితుల సాంగత్యంలో ఉంటూ చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు పోలీసు అధికారులు సూచించారు. అలాగే మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జగిత్యాల రూరల్ పోలీసులు కోరారు. యువత తమ లక్ష్యాల సాధనకు కృషి చేస్తూ, సమాజానికి ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని పలు సూచనలు చేశారు. పిల్లలు చెడు అలవాట్లు, మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలని జగిత్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.సుధాకర్, జగిత్యాల రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఉమాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సం ఖ్యలోవిద్యార్థులు,వారు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నా రు.

## అనాథగా మారిన గజ్వేల్

**ప్రజాపక్షం / గజ్వేల్:** గజ్వేల్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అనాథగా మారిందని, ప్రతిపక్షనేత కెసిఆర్ ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం దురదృష్టకరమని సిపిఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి బట్టు దయానంద రెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్ మున్సిపల్‌లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్, ఢిల్లీలో బిజెపి ప్రభుత్వాలు అధికారంలో ఉండి కూడా ఇక్కడి సమస్యలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోతుండగా, ప్రభుత్వ అసైన్ స్థలాలు, వక్ఫ్ బోర్డ్ భూములు కబ్జాకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడం తగదని చెప్పారు. ప్రజలు తిరగబడకముందే బాధ్యతగల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పద్ధతి మార్చు కోవాలని, లేని పక్షంలో ప్రజల నుండి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు







**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. తరగతులు, వసతి గదులు, మూత్ర శాలల నిర్వహణ కూడా మెరుగ్గానే ఉంది. నీటి సమస్య కూడా పెద్దగా లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారని, వసతి గృహాల్లో సౌకర్యాల పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని బిసిబాలికల హాస్టల్లో డిప్లొమా, పాలిటెక్నిక్, బీటెక్ విద్యార్థులు ఉంటారు. బాలికలు 80 మంది ఉండగా, ఇంకా కొత్త అడ్మిషన్లు కూడా వస్తున్నాయి. దాదాపు 20 సీట్స్ ఖాళీ ఉన్నాయి. హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతుండగా, వసతి గదులు, బాత్రూమ్స్ సౌకర్యాలు అన్ని బాగానే ఉన్నాయి. నీటి సమస్య లేదు. భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మించి ఉండడంతో పాటు సిసి కెమెరా కూడా ఏర్పాటు చేశారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నారు. హాస్టల్ వార్డెన్ హాస్టల్ నుంచి 100 మీటర్ల దూరంలో వుంటారు. అలాగే ఎస్‌సి బాలికల హాస్టల్‌లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉంటారు. బాలికలు 25 మంది ఉండగా, ఇంకా కొత్త అడ్మిషన్ వస్తున్నాయి. దాదాపు 75 సీట్స్ ఖాళీ ఉన్నాయి. సొంత భవనంతోపాటు వసతి గదులు, బాత్రూమ్స్ సౌకర్యాలు అన్ని బాగానే ఉన్నాయి. నీటి సమస్య లేదు. ప్రహరీ గోడ నిర్మించి ఉండడంతో పాటు సిసికెమెరా కూడా ఏర్పాటు చేశారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నారు. ప్రతి నెల 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు విద్యార్థులకు రూ.175 అందిస్తున్నారు. 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు రూ.275 అందిస్తున్నారు. హాస్టల్ వార్డెన్ హాస్టల్ నుంచి 100 మీటర్ల దూరంలో వుంటారు. అలాగే మహాత్మ జ్యోతి బా పూలే బాలుర, బాలికల హాస్టల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు ఉంటారు. బాలురు 296 మంది, బాలికలు 396 మంది ఉండగా, ఇంకా కొత్త అడ్మిషన్ వస్తున్నాయి. దాదాపు 200 సీట్స్ ఖాళీ ఉన్నాయి. మహాత్మ జ్యోతిబా పూలే హాస్టళ్లు అద్దె భవనంలో కొనసాగుతోంది. హాస్టల్ వార్డెన్ పిల్లలతోనే కలిసి ఉంటారు.

### మెనూ ప్రకారమే భోజనాలు

### ఉపాధ్యాయులే వార్డెన్లుగా..

#### ఎలాంటి ఇబ్బందులు లేవు.. బి.జ్యోతి, బిసి బాలికల హాస్టల్ ప్రిన్సిపల్



వసతి గృహంలో విద్యార్థుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చూసుకుంటున్నాం. ప్రభుత్వం తరపున సకాలంలో సరుకులు అందుతున్నాయి. ప్రస్తు తం వసతి గదుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవు. సిబ్బ ంది టైముకు వస్తున్నారు సరిగానే పనిచేస్తున్నా రు. విద్యార్థులకు బోధన విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. స్థానిక శాసనసభ్యుడుఆది శ్రీనివాస్ సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

#### సౌకర్యాలు బాగున్నాయి.. కరుణ శ్రీ, డిప్లొమా విద్యార్థిని



భోజనాలు రుచికరంగానే పెడుతున్నారు. స్నానగదులు, మూత్రశాలలు బాగానే ఉన్నా యి. విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మెలిసి ఉంటున్నారు.

**ఉపాధ్యాయులే వార్డెన్లా..!**

విద్యా బోధన అందించే ఉపాధ్యాయులే హాస్టల్ వార్డెన్లాగా విధులు నిర్వహిస్తున్నారు. 15 రోజులకు ఒక్కసారి ఉపాధ్యాయులు ఒకరి తరువాత ఒకరు వార్డెన్‌గా మారుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఈ విషయంలో అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా వార్డెన్ స్థానాన్ని వెంటనే భర్తీ చేయాలని కోరుతున్నారు.

# మహారాష్ట్ర, అరుణాచల్‌లో భారీ వర్షాలు

- వరదల కారణంగా రోడ్డు, రైల్ రాకపోకలకు తీవ్ర అంతరాయం
- లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిన వరద
- అరుణాచల్‌లో ముగ్గురు గల్లంతు



**ముంబయి/ఇటానగర్ :** ముంబయిలోకి నైరుతు రుతుపవనాలు ప్రవేశించాయి. మంగళవారం రాత్రంతా భారీ వర్షాలు కురిశాయి. వరదల కారణంగా రోడ్డు, రైలు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో 24 గంటల్లో 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు అయింది. దీంతో ప్రయాణికులు వరదల్లో చిక్కుకుపోయారు. కింగ్స్ సర్కిల్‌లోని నీటితో నిండిన గాంధీ మార్కెట్‌ను మేయర్ రితు తావ్డే తనిఖీ చేస్తున్న సమయంలో, బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) సూపర్‌వైజర్ ఒకరు తెరిచి ఉన్న నీటి కాలువలో పడిపోయారు. అయితే, అతడిని వెంటనే రక్షించినట్లు అధికారులు తెలిపారు. ముంబయిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఆ ప్రాంతంలో నీరు తీవ్రంగా నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కాంగ్రెస్ ఎంపి వర్షా గైక్వాడ ఈ ఘటనకు సంబంధించిన వీడియోను 'ఎక్స్' ఛానెల్‌లో షేర్ చేస్తూ, మేయర్‌ను లక్ష్యంగా చేసుకుని, 'ఈ వ్యక్తి మీ నిష్క్రియాత్మకత, అవినీతి అనే గోతిలో పడిపోయాడు. ఇది ప్రమాదం కాదు; మీ అవినీతి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది' అని ఆరోపించారు. వర్షాకాలంలో నీరు నిలవడం, ట్రాఫిక్ అంతరాయాలను నివారించడానికి మురుగు కాలువలను శుభ్రపరచడం, ఎండిన చెత్తను తొలగించడం వంటి పనులను ముమ్మరం చేయాలని అధికార శివసేన ఎమ్మెల్సీ మనీషా కాయండే తావ్డేను కోరారు. వాతావరణ హెచ్చరికలను పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో పౌర నియంత్రణ గదులను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ అశ్విని భిడే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా, రానున్న 24 గంటల్లో ముంబయి, పొరుగున ఉన్న థానే, పాల్ఘర్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) 'ఆరెంజ్' హెచ్చరిక జారీ చేసింది. బుధవారం ఉదయం 8 గంటలకు ముగిసిన 24 గంటల వ్యవధిలో కొలాబాలోని నగర వేధశాల 248 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేయగా, శాంతాక్రూజ్‌లోని శివారు వేధశాల 225 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేసిందని బిఎంసి తెలిపింది. అసాధారణంగా భారీ వర్షపాతం నమోదైన ప్రాంతాలలో, పశ్చిమ శివారు ప్రాంతమైన మాల్వానీలో 340 మిల్లీమీటర్లు, మధ్య ముంబైలోని పరేల్‌లో 334 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తరువాత వర్ష తీవ్రత తగ్గింది. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐలాండ్ సిటీ, తూర్పు, పశ్చిమ శివారు ప్రాంతాలలో వరుసగా 13 మిల్లీమీటర్లు, 6 మిల్లీమీటర్లు మరియు 7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అది తెలిపింది. నైరుతి రుతుపవనాలు సాధారణంగా రావలసిన తేదీ కంటే 13 రోజుల ఆలస్యంగా మంగళవారం ముంబయికి చేరుకున్నాయి.

### కేయి పన్యార్ జిల్లాలో ఎడతెరిపి లేని వర్షం

అరుణాచల్ ప్రదేశ్‌లోని కేయి పన్యార్ జిల్లాలో బుధవారం ఉదయం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ఆకస్మిక వరదలు సంభవించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై 18 నివాస గృహాలు దెబ్బతిన్నాయి. అదే సమయంలో, జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి, పలువురు చిక్కుకుపోయారని ఒక అధికారి తెలిపారు. యజాలి సర్కిల్ పరిధిలోని పూసా సమీపంలో ఉన్న నీప్కో ప్రాజెక్ట్ కాలనీలో ఆకస్మిక వరదల కారణంగా ముగ్గురు గల్లంతైనట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి డాని సులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న ఒక నిలుపుగోడ కూలిపోవడంతో, కాలనీ, దాని చుట్టుపక్కల ఉన్న లోతట్టు నివాస ప్రాంతాలు భారీగా నీటితో నిండిపోయాయని ఆయన చెప్పారు. 18 నివాస గృహాలు దెబ్బతినగా, ముగ్గురు వ్యక్తులు గల్లంతైనట్లు సమాచారం వచ్చిందన్నారు.

# కుప్పకూలిన మూడంతస్తుల గిడ్డంగి

- నలుగురు మృతి, 17 మందిని రక్షించిన సహాయ సిబ్బంది
- భవన శిథిలాల్లో చిక్కుకున్న మరో 18 మంది
- పశ్చిమ కోల్‌కతాలోని తారతలా ప్రాంతంలో ఘటన



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో విషాదం చోటు చేసుకుంది. పశ్చిమ కోల్‌కతాలోని తారతలా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల గిడ్డంగి బుధవారం మధ్యాహ్నం కుప్పకూలింది. ఘటనలో నలుగురు భూ సమాధి అయ్యారు. మరో 17 మందిని రక్షించారు. ఇంకా 18 మందికి పైగా భవనం శిథిలాల కింద చిక్కుకుపోయారని ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. సహాయక చర్యలు జరుగుతున్న ప్రమాద స్థలాన్ని సిఎం సందర్శించారు. శిథిలాల కింద చిక్కుకుని వారిని రక్షించేందుకు ఆర్మీ ఈస్టర్న్ కమాండ్‌తో సహా రాష్ట్ర, కేంద్ర సంస్థలు సమన్వయంతో కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. కూలిపోయిన ఈ గిడ్డంగి నగరంలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్ట్ పరిధిలోని లీజుకు ఇచ్చిన ఆస్తి అని ఒక అధికారి తెలిపారు. 'ఇప్పటివరకు 21 మందిని రక్షించాము; వారిలో ముగ్గురు మరణించారు. మిగిలిన వారిని ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రిలో చేర్చాము, వారికి తగిన వైద్య చికిత్స అందించడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ముఖ్యమంత్రి చెప్పారు. కడపటి వార్తలు అందే సమయానికి రక్షించబడిన 18 మందిని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రిలోని ట్రామా కేర్ సెంటర్‌లో చేర్చారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు న్యూరాలజిస్టులు, ఆర్థోపెడిక్ నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యులతో కూడిన బహుళవిభాగాల వైద్య బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గిడ్డంగి నిర్మాణ పనులు జరుగుతుండగా భారీ ఇనుప దూలాలు, కాంక్రీటు దిమ్మెలు కూలిపడ్డాయి. శిథిలాల కింద చిక్కుకున్న బాధితులు సహాయం కోసం ఆర్తనాదాలు చేయడం విన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మాణ పనులు జరుగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిందని చెప్పారు. కోల్‌కతా పోలీసులు, విపత్తు నిర్వహణ బృందం, సివిల్ డిఫెన్స్, అగ్నిమాపకఅత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలంలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడం చేపట్టింది. కూలిపోయిన ఇనుప దూలాలను తొలగించడానికి క్రేన్లు, భారీ యంత్రాలను మోహరించగా, ఆర్మీ అధికారులు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. ఇనుము, కాంక్రీటును కత్తిరించడానికి గ్యాస్ కట్టర్లను ఉపయోగిస్తున్నారు; అలాగే, శిథిలాల కింద చిక్కుకున్న బాధితులను చేరడానికి సహాయక సిబ్బంది నిలువుగా డ్రిల్లింగ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. శిథిలాల కింద ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో గుర్తించడానికి ఎన్‌డిఆర్ఎఫ్ బృందం స్నిఫర్ డాగ్స్, డ్రోన్లను వినియోగించింది. ఘటన నేపథ్యంలో, రాష్ట్ర సచివాలయంలో విపత్తు నిర్వహణ బృందం కంట్రోల్ రూమ్ నంబర్లు (1070, 8697981070, 033 22143526/22535185) అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ ప్రాంతంలో కొంతకాలంగా భారీ స్థాయిలో అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్నాయని కొందరు స్థానికులు ఆరోపించారు. ప్రమాదానికి గల కారణాలను, ఏవైనా అక్రమాలు జరిగాయేమోనన్న విషయాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని, అయితే ప్రస్తుతానికి, వీలైనంత ఎక్కువ మంది బాధితులను రక్షించడమే తమ ప్రాధాన్యత అని మంత్రి ఇంద్రనీల్ ఖాన్ అన్నారు. భవన కూలిపోవడానికి డిజైన్, నిర్మాణపరమైన లోపాలే కారణమని ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఘటనా స్థలంలో ఉన్న కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అభిప్రాయపడ్డారు.

## ఐదవ రోజూ కొనసాగిన
# సిజెపి నిరసన దీక్ష

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసనదీక్ష బుధవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. తమ సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేయడానికి గల కారణమైన ఉత్తర్వును చూపాలని కోరగా, సమీక్షా సమావేశంలో అధికారులు గోప్యతను సాకుగా చూపి దానిని చూపించడానికి నిరాకరించారని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఆరోపించారు. గ్రూప్‌కు చెందిన 'ఎక్స్' ఖాతాను నిలిపివేయడానికి సంబంధించి మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ ముందు హాజరైన దిప్కే ఈ చర్యకు గల కారణాన్ని అధికారులు వివరించలేదని చెప్పారు. అయితే, నీట్ పేపర్ లీక్ కేసులో ఇలాంటి గోప్యతను ఎందుకు పాటించలేదని అభిజీత్ దిప్కే ప్రశ్నించారు. 'ప్రతీదీ గోప్యమైనదే. అయితే మీరు నీట్ పేపర్‌ను కూడా గోప్యంగా ఉంచాల్సి ఉండేది. అది ఎందుకు లీక్ అయ్యింది?'. అట్లా జరిగితే ఈ ఆత్మహత్యలు జరిగి ఉండేవి కాదుకదా' అని ఆయన ప్రశ్నించారు. తమ గొంతులను అణిచివేయడమే ఈ చర్య లక్ష్యమని, పాకిస్థాన్‌లోని వ్యక్తులు తమ ఖాతాలను అనుసరిస్తున్నారని అధికారులు తమకు చెప్పారని ఆయన ఆరోపించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వారిని 'ఉగ్రవాదుల బి–టీమ్' అని ఆరోపించిన ఒక రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం ఓట్లు అడుగుతున్నామా?.న్యాయం అడుగుతున్నాం. మేం పన్ను చెల్లింపుదారులం. మా తల్లిదండ్రులు కూడా పన్ను చెల్లింపుదారులే. అయినా మీరు మమ్ములను ఉగ్రవాదులని పిలుస్తున్నారు. మీకు సిగ్గులేదా?' అని దిప్కే మండిపడ్డారు. మీరు రైతులు, వైద్యులను ఉగ్రవాదులు అని పిలిచారని అయితే ఇక మిగిలింది ఎవరు? 'అని ఆయన ప్రభుత్వ ప్రతిస్పందనను ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని లక్ష్యంగా చేసుకుని అభిజీత్ దిప్కే మాట్లాడుతూ 'ప్రధాని రాజీనామా చేయలేరు. పైగారష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని నేనే ఆపివేసానని చెప్పుకుంటున్నారు. అయితే ప్రధాని పేపర్ లీక్‌లను ఆపగలరా'? అని దిప్కే ప్రశ్నించారు. విద్యార్థుల మరణాలకు బాధ్యులైన వారిని జవాబుదారీ చేయాలని దిప్కే డిమాండ్ చేశారు. ఈ ఆత్మహత్యలకు ఎవరు బాధ్యులు ? అది ధర్మేంద్ర ప్రధాన్ అని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ చేసిన వ్యాఖ్య గురించి అడిగినప్పుడు యువతలో పేరుకుపోయిన తీవ్ర నిరాశను వెలిబుచ్చడానికి కాక్‌రోచ్ జనతాపార్టీ ఒక ముఖ్యమైన సాధనమని, అయితే వారు లేవనెత్తిన సమస్యను అంతిమంగా స్థిరపడిన ఒక రాజకీయ పార్టీలే ముందుకు తీసుకెళ్లాలని చెప్పిన వారి గురించి అభిజీత్ దిప్కే మాట్లాడుతూ 'రాజకీయ పార్టీలు వారికి నచ్చిందతి చేసుకోవచ్చు. మేం ఓట్ల కోసం ఇక్కడ లేము. రాజకీయ ర్యాలీ కోసమూ కూడా లేము. మేం న్యాయం కోరడానికి ఇక్కడ ఉన్నాము' అని ఆయన అన్నారు.

# 'పిఎం శ్రీ'పై కేరళ అసెంబ్లీలో వాడీవేడిగా చర్చ

- సిపిఐ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై చర్చలో వాగ్వాదం
- తీర్మానానికి అనుమతి నిరాకరించిన స్పీకర్
- సభ నుంచి వాకౌట్ చేసిన ప్రతిపక్ష ఎల్‌డిఎఫ్ సభ్యులు



**తిరువనంతపురం :** కేంద్రం ప్రవేశపెట్టిన 'పిఎం శ్రీ' పాఠశాల పథకంపై కేరళ అసెంబ్లీలో గత రెండు రోజులుగా వాడివేడి చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష ఎల్‌డిఎఫ్ ఎల్‌డిఎఫ్ ఆరోపించింది. అయితే ఈ పథకాన్ని అమలు చేసేందుకు తాము ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని సాధారణ విద్యాశాఖ మంత్రి ఎన్. సంసుదీన్ స్పష్టం చేశారు. సిపిఐ ఎమ్మెల్యే పి. ప్రసాద్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మాన నోటీసుపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. స్పీకర్ తిరువంచూర్ రాధాకృష్ణన్ ఆ తీర్మానానికి అనుమతి నిరాకరించడంతో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రతిపక్ష ఆరోపణలను ఖండిస్తూ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) నాయకుడు కూడా అయిన సంసుదీన్ మాట్లాడుతూ కేంద్రంతో తాము ఎటువంటి ఒప్పందంపై సంతకం చేయలేదని లేదా ఈ పథకం అమలుకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకుంది గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వమేనని మంత్రి ఆరోపించారు. కేరళ ఉన్నత విద్యా రంగంలో గత వామపక్ష ప్రభుత్వ హయాంలోనే జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) ఇప్పటికే అమలైందని మంత్రి వాదించారు. అయితే, ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ మంత్రి వాదనలను తీవ్రంగా ఖండించారు; పిఎం శ్రీ పథకం విషయంలో ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేయడం తప్ప మరేమీ జరగలేదని, ఆ తర్వాత తన ప్రభుత్వం దానిని నిలిపివేసిందని ఆయన పేర్కొన్నారు.

ఈ పథకం రాష్ట్రంలో ఇంకా అమలు కాలేదని కేంద్రమే సుప్రీంకోర్టుకు తెలిపిందని, అలాగే మే 8, 2026 నాటి లేఖ ద్వారా దీని అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేరళను కోరిందని ఆయన చెప్పారు. ఒకవేళ పిఎం శ్రీ ఇప్పటికే అమలై ఉంటే, కేంద్రం అటువంటి అభ్యర్థన చేసి ఉండేది కాదని విజయన్ పేర్కొన్నారు. యుడిఎఫ్ ప్రభుత్వం ఇప్పుడు ఈ పథకాన్ని రహస్యంగా అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒక విధానపరమైన నిర్ణయంలో భాగంగా, కేంద్రంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని 20 రోజుల్లోనే నిలిపివేయాలని గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ తర్వాత దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన చెప్పారు. 'కేవలం అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం అంటే పథకం అమలైనట్లు కాదు. ఎటువంటి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయలేదు, పాఠశాలల జాబితాలను నవీకరించలేదు, ఈ పథకం కింద ఒక్క రూపాయి కూడా రాలేదు' అని విజయన్ అన్నారు. పిఎం శ్రీ పథకాన్ని బిజెపి రాజకీయ ఎజెండాలో భాగంగా అభివర్ణించిన ఆయన, విద్యా రంగం ద్వారా సంఘ్ పరివార్ భావజాలాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాలతో ఈ పథకానికి సంబంధం ఉందని ఆరోపించారు. పిఎంశ్రీ అంశంపై యుడిఎఫ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు 'సిగ్గుచేటైన లొంగుబాటు' అని కూడా ఆయన అన్నారు. ఈ తీర్మానం కోసం నోటీసు ఇచ్చిన ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఇపి (జాతీయ విద్యా విధానం) లౌకికవాదాన్ని, బహుళత్వాన్ని దెబ్బతీస్తుందని ఆరోపించారు, అలాగే పిఎం శ్రీ అనేది ఆర్ఎస్ఎస్ ప్రత్యేక ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. కేరళలో ఈ పథకాన్ని అమలు చేయబోమని ఐయుఎంఎల్ నాయకుడైన సంసుద్దీన్ స్పష్టంగా చెప్పలేకపోవడం 'అత్యంత అవమానకరం అని ఆయన అన్నారు. కాగా మంత్రి సమాధానం తర్వాత, స్పీకర్ ఆ తీర్మానానికి అనుమతి నిరాకరించారు, దీంతో నిరసనగా ఎల్‌డిఎఫ్ సభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు.

# ఇసుక వనరులను ప్రైవేట్‌కు అప్పగించొద్దు

## యుడిఎఫ్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాన్ని చేపడుతాం

## కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** కేరళలో ఖనిజ ఇసుక వనరుల తవ్వకాలను ప్రైవేట్ రంగానికి అప్పగించాలన్న యుడిఎఫ్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాన్ని చేపడతామని సిపిఐ ప్రకటించింది. దీనిని అడ్డుకోవడానికి ఏకాభిప్రాయం కలిగిన అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తామని పేర్కొంది. ఖనిజ ఇసుక తవ్వకాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రభుత్వ చర్య, ప్రైవేట్ మైనింగ్ లాబీలకు లాభం చేకూర్చేలా ఉండటమే కాకుండా, సున్నితమైన తీరప్రాంత పర్యావరణ వ్యవస్థకు, తీరప్రాంత ప్రజల జీవనోపాధికి ముప్పు కలిగిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం ఆరోపించారు. ఈ అంశంపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.ఎం. సుధీరన్‌తో సహా ఏకాభిప్రాయం కలిగిన అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఇసుక తవ్వకాల రంగాన్ని ప్రైవేటీకరించాలని భావిస్తున్నట్లు వచ్చిన వార్తలపై కెపిసిసి మాజీ అధ్యక్షుడు సుధీరన్ ఇటీవల తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనలో అవినీతికి ఆస్కారం ఉందని, అలాగే జాతీయ భద్రతకు సంబంధించిన ఆందోళనలు తలెత్తే ప్రమాదం ఉందని కూడా విశ్వం పేర్కొన్నారు.

ఆరోగ్యం, విద్య వంటి సంక్షేమ రంగాలలో ప్రభుత్వ పెట్టుబడుల ఆధారంగానే కేరళ అభివృద్ధి సాధించిందని సిపిఐ నేత విశ్వం చెప్పారు. యుడిఎఫ్ ప్రభుత్వం తన శ్వేతపత్రం, బడ్జెట్ ప్రతిపాదనల ద్వారా ప్రభుత్వ వనరుల ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేస్తోందని ఆయన ఆరోపించారు. కెఎంఎంఎల్, ఆర్ఆర్ఇఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా నియంత్రిత పద్ధతిలో ఖనిజ ఇసుక తవ్వకాలను చేపట్టడమే రాష్ట్ర దీర్ఘకాలిక విధానంగా ఉందని విమర్శించారు. యుడిఎఫ్ ప్రభుత్వం ఆ విధానానికి భిన్నంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య శక్తుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అలప్పుజ, కొల్లం జిల్లాల్లోని తీరప్రాంత ప్రాంతాలైన తొట్టపల్లి, అరట్టుపుజ, త్రిక్కున్నపుజలలో ఖనిజ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా మత్స్యకారులు, పర్యావరణ కార్యకర్తలు చేపట్టిన చారిత్రాత్మక నిరసనలను విశ్వం ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'ఆ పోరాటాల స్ఫూర్తి సన్నగిల్లిందని ప్రభుత్వం భావిస్తే, రాబోయే రోజులు దానికి భిన్నమైన వాస్తవాన్ని నిరూపిస్తాయి' అని ఆయన అన్నారు. ప్రైవేట్ ఖనిజ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రచారంలో భాగంగా, జులై మూడవ వారంలో అలప్పుజలో ఒక భారీ సదస్సును నిర్వహిస్తామని కూడా ఆయన ప్రకటించారు.

## కార్మికులపై అఘాయిత్యాలు...
# ఆత్మగౌరవంపై దాడి

- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ
- బాధితులకు న్యాయం జరగాలని, దోషులకు శిక్ష విధించాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఒక ఫ్యాక్టరీలో కార్మికులపై జరిగిన అఘాయిత్యాలపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రం ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మనుషుల ఆత్మగౌరవంపై దాడి అని ఆయన అభివర్ణించారు. వారికి న్యాయం జరగాలని, దోషులకు సాధ్యమైనంత కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ముజఫర్‌నగర్ జిల్లా మండి గ్రామంలోని ఒక పేపర్ ప్లేట్ల తయారీ ఫ్యాక్టరీలో పోలీసులు సోమవారం సోదాలు తనిఖీలు చేశారు. తనిఖీల సందర్భంగా శరీరాలపై స్పష్టంగా చిత్రహింసల గుర్తులు, గాయాలు ఉన్న మైనర్లతో సహా పన్నెండు మంది వెట్టిచాకిరి కార్మికులను రక్షించారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ ఉద్యోగాలు కనుమరుగైనప్పుడు, బలహీన వర్గాల కోసం ఉన్న ఎంజి నరేగా కార్మిక చట్టాల వంటి రక్షణలు బలహీనపడినప్పుడు, నిరాశ మాత్రమే పెరుగుతుందని అన్నారు. ముజఫర్‌నగర్‌లో కార్మికుల వెట్టిచాకిరి ఉదంతం అత్యంత దిగ్భ్రాంతికరమని తెలిపారు. వారిని వేతనాలు లేకుండా పనిచేయమని బలవంతం చేయడమే కాకుండా, కార్మికులను కుక్కలతో కరిపించారని, ఈటెలతో పొడిచారని, కొరడాలతో కొట్టడంతో పాటు పశువుల మేత తినిపించాని రాహుల్ తీవ్ర ఆందోన వ్యక్తం చేశారు. ఇది మానవ గౌరవంపై దాడి అని అన్నారు. బాధితులకు పునరావాసంతో పాటు న్యాయం జరగాలని, నేరస్థులకు సాధ్యమైనంత కఠినమైన శిక్ష పడాలన్నారు. ఇది సాధారణ నేర సంఘటన కాదు, కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థ శిథిలాలు అని ఆయన అన్నారు. అదే సమయంలో, తీవ్రమైన అనివార్యతల కారణంగా కార్మికులు ఎందుకు ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో చిక్కుకుపోతున్నారని కూడా ప్రశ్నించుకోవాలని ఆయన అన్నారు.'ఉద్యోగాలు కనుమరుగైనప్పుడు, ఆదాయాలు స్తంభించిపోయినప్పుడు, అత్యంత బలహీన వర్గాల కోసం ఉద్దేశించిన ఎంజి నరేగా కార్మిక చట్టాల వంటి రక్షణలు బలహీనపడినప్పుడు, నిరాశ మరింత పెరిగిపోతుంది. వేరే మార్గాలు లేదా రక్షణ లేని వారు ఇటువంటి దోపిడీకి సులభంగా బలి అవుతారు' అని ఆయన అన్నారు. అధికారులు జరిపిన దాడుల సమయంలో, ఆ కార్మికులను అమానవీయ పరిస్థితుల్లో ఉంచారని, వారికి వాగ్దానం చేసిన నెలవారీ వేతనాలు చెల్లించలేదని అధికారులు మంగళవారం తెలిపారు. కచ్చితమైన సమాచారం అందిన తర్వాత, టిటావి పోలీస్ స్టేషన్ పరిధిలోని మండి గ్రామంలో ఉన్న ఆ కర్మాగారంపై ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రాధే శ్యామ్ గౌర్ నేతృత్వంలోని బృందం దాడి చేసిందని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) సంజయ్ కుమార్ తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో మైనర్లతో సహా 12 మంది వెట్టిచాకిరీ కార్మికులను కర్మాగారం ప్రాంగణం నుండి విడిపించినట్లు ఎస్ఎస్‌పి పేర్కొన్నారు. సంబంధిత సెక్షన్ల కింద కర్మాగార యజమాని అంకిత్ బల్యాన్, ప్రదీప్ బల్యాన్, శివ త్యాగిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రదీప్ బల్యాన్, శివ త్యాగిలను అరెస్టు చేయగా, కర్మాగార యజమాని అంకిత్ బల్యాన్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. విచారణ సమయంలో, నెలకు రూ. 12,000 వేతనం ఇస్తామనే హామీతో ఆ కార్మికులను వివిధ రాష్ట్రాల నుండి తీసుకువచ్చినట్లు వెల్లడైందని అధికారులు తెలిపారు. అయితే, వారికి వేతనాలు చెల్లించకుండా, కేవలం ఆహారం మాత్రమే అందిస్తూ కర్మాగారంలో బలవంతంగా పని చేయించారని పోలీసులు పేర్కొన్నారు.

## భారత్, అమెరికా రెండు రోజుల
# వాణిజ్య చర్చలు పరిసమాప్తం

**ద్వైపాక్షిక ఒప్పందంలోని కీలక అంశాలపై ఇరుదేశాల ప్రతినిధుల సమీక్ష**



**న్యూఢిల్లీ :** భారత్, అమెరికా దేశాలు రెండు రోజులపాటు జరిగిన మంత్రివర్గ స్థాయి సమావేశంలో మధ్యంతర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం జరుగుతున్న చర్చల పురోగతిని సమీక్షించాయి. జులై 24న వాషింగ్టన్ విధించనున్న తాత్కాలిక 10శాతం సుంకం గడువు ముగియడానికి ముందే ఈ ఒప్పందాన్ని ముగించాలని ఈ రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికారిక ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తున్న యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) జామీయిసన్ గ్రీర్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)లోని మొదటి అంశంపై వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో చర్చల నిమిత్తం జూన్ 22–24 తేదీలలో ఇక్కడ పర్యటించారు. సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన భారత్– అమెరికాద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (బిటిఎ) ముందుకు తీసుకెళ్లడానికి, అలాగే ఫిబ్రవరి 7, 2026నాటి ఉమ్మడి ప్రకటనకు అనుగుణంగా ఒక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అని వాణిజ్య శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇద్దరు మంత్రులు పలు దఫాలుగా చర్చలు జరిపారు. మెరుగైన మార్కెట్ ప్రవేశం, డిజిటల్ వాణిజ్యం, సరఫరా గొలుసు, స్థితిస్థాపకత తగ్గింపు వంటి కీలక బిటిఎ అంశాలపై సమగ్ర సమీక్షను నిర్వహించారు. సుంకేతర అడ్డంకులను తొలగించడం, వ్యూహాత్మక రంగాలలో సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలపై ఈ ఒప్పందం కుదిరిందని ఆ ప్రకటన తెలిపింది.ఇటీవల జరిగిన నెలవారీ చర్చల సందర్భంగా ఈ ఒప్పందంపై ఇరుపక్షాల సంప్రదింపుల బృందాలు గణనీయమైన పురోగతిని సాధించాయి అని కూడా ప్రకటన తెలియజేసింది.

ఫారం నెం. 14
(రెగ్యులేషన్ 33(2) చూడుము)
తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా, విఫలమైనచో ప్రచురణ ద్వారా

**రికవరీ ఆఫీసర్-I/II వారి కార్యాలయం**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT-1)**
**3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001**

**డిమాండ్ నోటీసు**
రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్రప్టసీ యాక్ట్, 1993లోని సెక్షన్లు 25 నుండి 28 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూల్ యొక్క రూల్ 2 క్రింద నోటీసు

RC/400/2025 తేది: 17-06-2026

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కు
శ్రీ బొల్ల రమణా రెడ్డి బొల్ల
మధ్య

దిగువ వారికి
**(CD 1) శ్రీ బొల్ల రమణా రెడ్డి తండ్రి బొల్ల రాజ గోపాల్ రెడ్డి,** సీనియర్ అసోసియేట్ కన్సల్టెంట్, ఉద్యోగి ఐడి: 1270325, ఓ/ఓ. ఇన్ఫోసిస్ క్యాంపస్, SEZ2, పోచారం గ్రామం,
సింగపూర్ టౌన్‌షిప్, ఘట్‌కేసర్, హైదరాబాద్, తెలంగాణ- ఇంకా ఇక్కడ కూడా: నివాసం: ఇంటి నెం. 5-3-80/28, ఎల్ఐజి 28, మనగాపురం హెచ్‌బికాలనీ, ఎన్‌టిఆర్ విగ్రహం దగ్గర, మౌలాలి, కాప్రా, హైదరాబాద్-500040. ఇంకా ఇక్కడ కూడా: నివాసం: ఇంటి నెం. 6-48, ప్రహణ వీధి, మామెలకుంట, ఆలూర్, కర్నూలు-518390.
**OA/248/2025** ప్రకారం డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT 1) యొక్క ప్రిసైడింగ్ ఆఫీసర్ ద్వారా జారీ చేసిన ఉత్తర్వులు పరిశీలిస్తూ రికవరీ సర్టిఫికెట్ ప్రకారం **రూ. 2445176.00 (రూపాయలు ఇరవై నాలుగు లక్షల నలభై ఐదు వేల నూట డెబ్బై ఆరు మాత్రమే) + తేది: 22/05/2025** నుండి ప్రభావితమగు సాలుకు **@13.80%** చొప్పున నిలిచిపోయిన మరియు భవిష్య వడ్డీతో, రుణము తీరే వరకు మరియు చార్జీలు **రూ. 71100/- (రూపాయలు డెబ్బై ఒక్క వేల ఒక వంద మాత్రమే)**ను మీరు బకాయి పడినట్లు (జాయింట్‌గా మరియు విడివిడిగా/ పూర్తిగా/పరిమితంగా) గమనించగలరు.
2) కావున ఈ నోటీసు స్వీకరణ నుండి **15 రోజులలోగా** పైన తెలిపిన మొత్తమును చెల్లించవలసిందిగా ఆదేశిస్తూ, విఫలమైనచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టూ బ్యాంక్స్ మరియు ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు రూల్స్‌ను పరిశీలిస్తూ వసూలు చేయబడును.
3) కావున తదుపరి విచారణ తేదీన లేదా అంతకుముందు మీ ఆస్తులపై పూర్తి వివరములతో అఫిడవిట్ దాఖలు చేస్తూ ప్రకటించవలసిందిగా మిమ్మల్ని కోరడమైనది.
4) కావున తదుపరి చర్యల కొరకు **19/08/2026 న ఉ. 10.30 గం॥లకు** ఈ క్రింది సంతకముదారు సమక్షమునకు హాజరు కావలసిందిగా మిమ్మల్ని కోరడమైనది.
5) పైన తెలిపిన మొత్తమునకు అదనముగా మీరు చెల్లించవలసిన మొత్తము:
(ఎ) సర్టిఫికెట్/అమలుచేయు ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమగు సమయమునకు వడ్డీ చెల్లించవలెను.
(బి) బకాయి మొత్తము వసూలు చేసుకొనుటకు అన్ని ఇతర ప్రొసీడింగ్స్ చేపట్టుటకు మరియు ఇతర ప్రాసెస్‌లు, వారెంట్లు మరియు ఈ నోటీసు సేవలకు సంబంధించి అన్ని చార్జీలు, ధరలు మరియు వ్యయములతో చెల్లించవలెను.
**తేది: 17/06/2026** న నా సంతకంచేసి మరియు ట్రిబ్యునల్ సీలు వేసి జారీ చేయడమైనది.
పిపి
**రికవరీ ఆఫీసర్,**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (డిఆర్‌టి-1)**

# ప్రైమరీ ఎన్నికల్లో ప్రగతిశీల, సోషలిస్టుల గెలుపు




**న్యూయార్క్:** నవంబరులో అమెరికా దిగువసభకు జరిగే ఎన్నికలకు ముందుగా జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీలో మమ్దానీ మద్దతు ఇచ్చిన ముగ్గురు ప్రగతిశీల, సోషలిస్టు అభ్యర్థులు ఘన విజయాలు సాధిచారు. దీంతో అమెరికాలో అతిపెద్ద నగరాలలో ఒకటగా ఉన్న న్యూయార్క్‌లో మేయర్ జోహ్రాన్ మమ్దానీ సంపూర్ణ విజయంతో అక్కడి వామపక్ష విభాగానికి పెద్ద ఊరట లభించింది. డెమొక్రాట్స్‌లో ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చిన అభ్యర్థులందరూ ఓటమిపాలయ్యారు.
న్యూయార్క్ కాంగ్రెస్ ఏడవ నియోజకవర్గం, పదో నియోజకవర్గం,13వ నియోజకవర్గాల నుండి మమ్దానీ మద్దతుదారులు విజయాలు సాధించారు. అమెరికాలో ప్రతిపక్ష డెమొక్రటిక్‌పార్టీని వామపక్షాలవైపు మళ్ళించాలని మమ్దానీ ప్రయత్నిస్తున్న తరుణంలో ఆయనకు ఈ విజయాలు లభించాయి. గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్నవారిని ఓడించాలని ఈ అభ్యర్థులు పిలుపు ఇచ్చి విజయాలు సాధించారు.
ముఖ్యంగా 10వ నియోజకవర్గంలో డెమొక్రటిక్ పార్టీకి 2023 నుండి కాంగ్రెస్ దిగువసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న డాన్ గోల్డ్‌మన్ (50) ప్రైమరీ ఎన్నికల్లో ఓడిపోయారు. గాజాలో చేసిన మారణకాండకు ఆయన ఇజ్రాయెల్‌ను సమర్థించి అమెరికాలో ఉన్న ఆ దేశ అనుకూలవాదుల మద్దతు సంపాదించారు. కానీ ఆయనను తీవ్రంగా తప్పుపట్టిన మమ్దానీ మద్దతుదారుడు, న్యూయార్క్ మాజీ కంప్ట్రోలర్, ప్రగతిశీల డెమొక్రాట్స్ అభ్యర్థి బ్రాడ్ లాండర్ (47) విజయం సాధించారు. కాగా 7వ కాంగ్రెస్ నియోజకవర్గంలో మమ్దానీ సమర్థించిన ప్రగతిశీలవాది క్లైర్ వాల్డెజ్ (39) విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధిగా గత ఏడాది జనవరి ఒకటో తేదీన ప్రమాణస్వీకారం చేశారు. డెమొక్రటిక్ సోషలిస్ట్ అమెరికా సభ్యురాలుగా కొనసాగుతున్నారు. బ్రూక్లిన్ బరో ప్రెసిడెంట్ ఆంటోనియో రెనోసోను ఈ ప్రైమరీలో ఆమె ఓడించారు.
అదేవిధంగా 13వ కాంగ్రెషనల్ జిల్లా ప్రైమరీ ఎన్నికల్లో మమ్దానీ మద్దతు ఇచ్చిన అభ్యర్థిని డారియాలిజా ఛెవలియర్ (33) విజయం సాధించారు. అమెరికా కాంగ్రెస్ ప్రతినిధుల సభకు నవంబరు మూడో తేదీన ప్రతిష్ఠాత్మకంగా జరిగబోయే ఎన్నికల్లో ఈ ప్రైమరీ ఎన్నికల్లో ఛెవలియర్ పోటీ చేయనున్నారు. న్యూయార్క్ 13వ కాంగ్రెషనల్ జిల్లా నుండి కాంగ్రెస్ దిగువసభకు ప్రస్తుతం డెమొక్రటిక్‌పార్టీకి 2017 నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆడ్రియానో ఎస్పాయిలాట్ (74)ను ప్రైమరీ ఎన్నికల్లో ఛెవలియర్ ఓడించి ముందజలో నిలిచారు.ఇజ్రాయెల్‌పట్ల ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను ఆమె తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొలంబియా యూనివర్సిటీలో పాలస్తినా అనుకూల ప్రదర్శనలలో ఆమె అగ్రభాగాన ఉండి పోరాడారు. ఛెవలియర్ ప్రతిపక్ష డెమొక్రటిక్‌పార్టీ సభ్యురాలు, అంతకుమించినస్థాయిలో మమ్దానీ తరహాలోనే అమెరికాలో ఉన్న అతిపెద్ద వామపక్ష భావజాల వేదిక సోషలిస్టు పొలిటికల్ అమెరికా సంస్థ సభ్యురాలు. ఈ సంస్థలో లక్షమందికిపైగా సభ్యులున్నారు. అమెరికాలో ప్రజాస్వామ్య సోషలిజం ప్రధానలక్ష్యంగా పనిచేసే వామపక్షవాదులకు ఇదే అతిపెద్ద వేదిక.
రాబోయే నవంబరు ఎన్నికలు అధికార రిపబ్లికన్ పార్టీ నాయకుడు,దేశాధ్యక్షుడు ట్రంప్‌కు అత్యంత కీలకమైనవి.

# ఇరాన్ అణుస్థావరాల్లో తనిఖీలు చేస్తాం

- ●శుద్ధిచేసిన యురేనియం నాణ్యత తగ్గించాలి ●'వాళ్ళకి' ఏకాభిప్రాయం లేదు
- ● కానీ మా విధి నిర్వహిస్తాం ●ఐ.ఎ.ఇ.ఎ అధిపతి గ్రోస్సీ



**టోక్యో:** అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరిన తర్వాత జరిగిన సాంకేతిక చర్చల్లో అణు కేంద్రాలలో తనిఖీలపై జె.డి.వాన్స్(అమెరికా ఉపాధ్యక్షుడు) చేసిన ప్రకటనతో రెండు దేశాల మధ్య ఒకవైపు వాగ్వాదం కొనసాగుతున్న దశలో ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) ప్రధానాధిపతి రాఫెల్ మరియానో గ్రోస్సీ మరో ప్రకటన చేసి అందరికీ షాక్ ఇచ్చారు. ఐతే వాళ్ళ మధ్య (అమెరికా–ఇరాన్) ఏకాభిప్రాయం లేదని, వాగ్వాదం జరుగుతోందని కూడా అంగీకరించారు. రాజకీయ ప్రకటలనేవి చేస్తూ ఉంటారని, వాటి భాషను తాను అర్థం చేసుకుంటానని, అవన్నీ వాస్తవంలో ఒక భాగంగా ఉంటాయన్నారు. రెండు దేశాల అధ్యక్షులూ (ట్రంప్–పెజెష్కియన్) ఒక అవగాహనా ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారని జపాన్‌లోని ఫుకుషిమా డైచీ అణు విద్యుత్ కేంద్రం వద్ద బుధవారం జరిగిన మీడియా సమావేశంలో గ్రోస్సీ చెప్పారు. ఏ రూపంలోనైనాగానీ, అణు కేంద్రాలలో శుద్ధి చేసే కార్యక్రమాలను తనిఖీ చేయడం తమ విధి అని చెప్పారు. ఎప్పుడైనా తనిఖీలు జరగాల్సిందేనన్నారు. ''ఈ తనిఖీలు తప్పనిసరిగా జరగాలి, ఎందుకంటే చాలా బాగా నాణ్యతతో అణుబాంబు తయారు చేయడానికి వీలుగా యురేనియంను శుద్ధిచేశారు, వీటి నాణ్యతా ప్రమాణాలను దిగజార్చాలి, వాటి ప్రమాణాలు తగ్గించాల్సిన అవసరం ఉంది'' అన్నారు.
అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందం ప్రకారం, ఇరాన్‌లో అణు ప్రదేశాలలో ఐఎఇఎ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు నిర్వహిస్తారని బుధవారం ప్రకటించారు. ఇరాన్ అణు నిల్వలపై ఐఎఇఎ గతంలో చేసినదానికంటే భిన్నంగా కొంచెం విశ్వాసంతో ఈ ప్రకటన చేసినట్లు కనిపించింది. గత ఏడాది ఇరాన్‌పై అమెరికా 12 రోజులు యుద్ధ దాడులు చేసింది. ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం పూర్తిగా ధ్వంసం చేశామని ట్రంప్ ఆనాడు ప్రకటించారు. అణ్వాయుధం తయారు చేయడానికి వీలుగా ఉపయోగించేందుకు అత్యంత నాణ్యతతో శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ కొన్ని ప్రాంతాలలో దాచిపెట్టిందన్న ఆరోపణలమధ్య ఆ ప్రాంతాలను తనిఖీల నిమిత్తం ఐఎఇఎను అనుమతించేందుకు ఇరాన్ తిరస్కరించింది. దాదాపు 10 అణ్వాయుధాలను తయారు చేయడానికి సరిపడినంత యురేనియంను నాణ్యతా ప్రమాణాలతో ఇరాన్ శుద్ధి చేసిందని అమెరికా ఆరోపించింది. ఇరాన్ వద్ద 410 కిలోల శుద్ధిచేసిన యురేనియం ఇప్పుడు దాడులు చేసిన తర్వాత శిథిలాల్లో కూరుకుపోయింది. దీనిని వెలికితీస్తామని అమెరికా చెబుతున్నది. అందుకు ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ చెప్పారు. మధ్యంతర ఒప్పందం కుదిరి ఎంఓయుపై సంతకాలు జరిగిన తర్వాత వాగ్వాదం మొదలైంది. రెండు దేశాల మధ్యా ఏకాభిప్రాయం లేదని, వాగ్వాదం జరుగుతోందని గ్రోస్సీ కూడా అంగీకరించారు.

## హోర్ముజ్‌లో సుంకాలు ఒప్పకోం: రుబియో



**దుబాయి :** హోర్ముజ్ జలసంధిలో సుంకాలను అనుమతించేదిలేదని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఖరాఖండీగా చెప్పారు. ఒప్పందం కుదరడానికి ముందు నుండీ అమెరికా ఇదే వాదన చేస్తోంది. మంగళవారంనాడు గల్ఫ్ దేశాల పర్యటన ప్రారంభించిన మార్కో రుబియో గడచిన రెండు రోజులుగా ఇరాన్ చేస్తున్న ప్రకటనలపై తీవ్రంగా స్పందించారు. హోర్ముజ్ జలసంధిలో ఏ ఒక్కనౌకమీదా సుంకాలు లేదా ఫీజుల పేరుతో ధనం వసూలును అనుమతించేది లేదన్నారు.''ఇది ఒక అంతర్జాతీయ జలమార్గం, ఇక్కడ ఎవ్వరి దగ్గర నుండీ ఎవ్వరూ సుంకాలు వసూలు చేయకూడదు, ఈ అంశం నిర్దేశిత అంతర్జాతీయ చట్టం, ఈ విషయంలో ఎవరూ ఎవరినీ ఒప్పించాల్సిన అవసరం లేదు, అందుకు సహించేది లేదు, ఈ ప్రాంతంలో అన్ని దేశాలూ మాతో ఏకీభవిస్తాయని భావిస్తున్నాను'' అన్నారు. జూన్ 18వ తేదీన తాత్కాలిక ఒప్పందం (ఎంఓయు) ప్రక్రియ పూర్తకాకముందు నుండీ ఇరాన్ హోర్ముజ్ జలసంధిలో ప్రతి నౌక నుండీ ధనం వసూలు చేస్తామని స్పష్టం చేసింది. ఫిబ్రవరి ముందునాటి పరిస్థితి ఇకమీదట హోర్ముజ్ జలసంధిలో ఉండబోదని, ఈ జలసంధి పూర్తిగా ఇరాన్ అధీనంలో ఉంటుందని, ఒమన్ సమన్వయంతో ప్రతి నౌక నుండీ నిర్వహణా ఫీజులు వసూలు చేస్తామని ఇరాన్ నాయకులు చెబుతూ వస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయంలో పదే పదే ఇరాన్‌కు హెచ్చరికలు చేసినప్పటికీ ఇరాన్ నుండి ప్రతిసారీ ఈ ప్రకటన వెలువడుతూనే ఉంది.
కాగా మరోవైపు హోర్ముజ్ జలసంధిని నిర్వహించే విషయంపై ఇరాన్–ఒమన్ మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. ఇరాన్ ప్రతినిధి మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ ఒమన్ రాజధాని మస్కట్ వెళ్ళి ఆ దేశ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్‌తో చర్చలు జరిపారు.

## ఇరాన్ క్షిపణులపై రాజీ లేదు: పెజెష్కియన్



**ఇస్లామాబాద్:** ఇరాన్ రక్షణ పాటవం, క్షిపణి సామర్థ్యాన్ని ప్రశ్నించే అధికారం ఎవ్వరికీ లేదని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పష్టం చేశారు. తమ దేశ రక్షణ బలంపై చర్చలు జరపాలన్న అమెరికా పిలుపును ఆయన గట్టిగా తిరస్కరించారు. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం చేయడంలో కీలక మధ్యవర్తి పాత్ర నిర్వహించిన పాకిస్థాన్ నాయకులను అభినందించడంకోసం ఇస్లామాబాద్ పర్యటనకు వచ్చిన పెజెష్కియన్ అక్కడి నాయకులతో బుధవారం సమావేశాలు జరిపారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో సంయుక్త పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఇరాన్ క్షిపణి కారాగారమే తమను అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నుండి కాపాడిందని, తమ దేశ క్షిపణి వ్యవస్థను లేకుండా చేసేందుకు ఎలాంటి బేరసారాలను అంగీకరించేదిలేదని అన్నారు. తమ రక్షణ సామర్థ్యంపై ఏ పక్షంతోనూ, ఎట్టిపరిస్థితుల్లో, ఎవ్వరితోనూ ఇరాన్ చర్చలు జరపబోదని స్పష్టం చేశారు. బాహ్యశక్తుల దాడుల నుండి దేశాన్ని రక్షించడానికి ఈ విధమైన సాంకేతిక రక్షణబలం ఎంతో అవసరమన్నారు.తమ సైనికబలం దురాక్రమణదారులను అడ్డుకుందని, వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిందన్నారు. మానవహక్కుల పరిరక్షకులుగా తమను తాము చిత్రీకరించుకునే పాశ్చాత్యదేశాల వైఖరిని కూడా పెజెష్కియన్ విమర్శించారు. వారి చర్యలకు, మాటలకు పొంతనలేదనిఈ డిమాండ్లు చెబుతున్నాయన్నారు.
అదేవిధంగా షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంలో ఇరాన్ క్షిపణి కార్యక్రమం చర్చల్లో ఎన్నడూ ఒక భాగంగా లేదని పత్రికాగోష్ఠిలో స్పష్టం చేశారు. చర్చల్లో ఏనాడూ బాలిస్టిక్ క్షిపణుల అంశం ప్రస్తావనకు రాలేదని చెప్పారు. దాని గురించి ఎలాంటి ప్రశ్నలుగానీ, సందేహాలు గానీ లేవన్నారు. ఇరాన్ వద్ద క్షిపణులు ఉండకూడదన్న ఆంక్షలను వ్యతిరేకించారు. కొన్ని దేశాలవద్ద క్షిపణులు ఉండాలి,ఇరాన్ వద్ద క్షిపణులు ఉండకూడదనే ఆంక్షలు ద్వంద్వ ప్రమాణాలతో కూడినదని షరీఫ్ అన్నారు.

## హోర్ముజ్ నుండి 11 వేలమంది నావికుల తరలింపు

**మస్కట్:** అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిలో 110 రోజులుగా చిక్కుకుపోయి ఎన్నో కష్టాలు అనుభవించిన,వివిధ దేశాలకు చెందిన 11,000 మంది నావికులను ఐక్యరాజ్యసమితికి చెందిన సముద్రయానసంస్థ ఐఎంఓ సురక్షితంగా బయటకు తరలించేందుకు సంసిద్ధమైంది. వారిలో కొంతమంది సుదీర్ఘమైన ఎదురుచూపులవల్ల శారీరకంగా,మానసికంగా దెబ్బతిన్నారు. వారికి చికిత్స అందించే కార్యక్రమం కూడా చేపడతారు. హోర్ముజ్ జలసంధిలోని ఒమన్ తీరంలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటన తర్వాత ఐక్యరాజ్యసమితి చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఏర్పడింది. ఐఎంఓ ద్వారా ఒమన్ అందించిన నోటీసు ప్రకారం, నావికుల తరలింపునకు రెండు తాత్కాలిక మార్గాలను ఉపయోగిస్తారు.తదుపరి ఒక్కొక్కనౌకకు సూచనలు జారీ చేస్తారు. వారి సురక్షిత మార్గంపై ఎప్పటికప్పుడు నివేదికలు వెలువడతాయి.హోర్ముజ్ జలసంధి తెరచిన తర్వాత జూన్ 18 నుండి ఇప్పటివరకూ 172 నౌకలు ప్రయాణం చేశాయి. ఒక్కశనివారంనాడే 42 నౌకలు ప్రయాణం చేశాయి.
ఇరాన్,ఒమన్,అమెరికా సహా ఈ ప్రాంతంలో ఉన్న తీరప్రాంత దేశాలు, ఇతర సముద్రయాన సంస్థల సహకారంతో ఈ భారీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఐఎంఓ సెక్రటరీ జనరల్ అర్సెనియో డోమింగెజ్ బుధవారం చెప్పారు. ఈ ఆపరేషన్‌ను నిర్వహించడానికి అవసరమైన భద్రతాహామీలన్నింటినీ జలసంధి ప్రాంత దేశాల నుండి తాము పొందామని, తగిన సహాయ సహకారాలు, అన్ని రక్షణలూ తీసుకుంటూ నావిగేషన్ కోసం అన్ని ధృవీకరణలు చేసుకున్న తర్వాతే ఈ భారీ ఆపరేషన్ నిర్వహణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.
సముద్ర భద్రతను పునరుద్ధరించడానికి, పౌర నౌకలపై అమానుషమైన,ఆమోదయోగ్యంకాని దాడులను నివారించడానికి, అంతం చేయడానికి ఇది ఒక నిర్ణయాత్మకమైన ముందడుగు అని డోమింగెజ్ చెప్పారు. ఈ యుద్ధం వల్ల వేలాదిమంది సముద్ర కార్మికులు,నావికులు ఎన్నో కష్టాలు అనుభవించారు, అనేక కుటుంబాలు క్షోభ అనుభవించాయి, యావత్ ప్రపంచంపై ఈ నౌకల స్తంభన తీవ్ర ప్రభావం చూపించింది,ఎట్టకేలకు అమెరికా–ఇరాన్ మధ్య ప్రాథమికంగా ఒక శాంతి ఒప్పందం కుదిరింది, దీనిని నేను ఎంతో ప్రగాఢ సంతృప్తితో స్వాగతిస్తున్నాను అన్నారు డోమింగెజ్.

## గడగడలాడుతున్న యూరప్
(మొదటి పేజీ తరువాయి)

తీవ్రమైన విద్యుత్ కొరతతో బాధపడుతున్నారు. దాదాపు 68,000 కుటుంబాలు విద్యుత్ సరఫరా సమస్యవల్ల విద్యుత్ లేకుండా గడుపుతున్నారు.దీంతో వారు మరిన్ని కష్టాలు పడుతున్నారు.యూరప్‌లో ఈసారి ఉష్ణోగ్రతలు 44.3 డిగ్రీల సెల్సియస్ దాటిపోవడం ఒక రికార్డు. దీనిని గ్లోబల్ వార్మింగ్ ప్రభావ హెచ్చరికగా వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.అదేవిధంగా బ్రిటన్ వ్యాప్తంగా ఎండవేడి ప్రజలను భయపెడుతోంది. వడగాలుల భయంతో ఇంగ్లాండ్,సౌత్‌వేల్స్‌లలో 1000 స్కూళ్ళను మూసివేశారు.సదరన్ ఇంగ్లాండ్‌లో ఎండవేడి 37 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. పర్యాటకులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ప్రభుత్వాలు సూచనలు చేశాయి.

## ఉగ్రవాదులు అంటారా?
(మొదటి పేజీ తరువాయి)

ముద్ర వేసిన విషయాన్ని దేశం మర్చిపోలేదని, ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశద్రోహి అని పిలుస్తున్నారని ఖర్గే పేర్కొన్నారు. కాగా, సిజెపిని 'ఉగ్రవాదుల బిటీమ్' అని ప్రధాన్ అభివర్ణించారన్న ఆరోపణలపై, కాక్రోజ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా ప్రధాన్‌పై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల నిరసనపై ప్రధాన్ అందుకు సంబంధించిన వ్యాఖ్యలు చేస్తున్న వీడియో క్లిప్‌ను కూడా దీప్కే ఎక్స్ ఛానెల్‌లో షేర్ చేశారు. 'ప్రధాన్ ఏమన్నారో ఊహించండి. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు మేము న్యాయం కోరుతుండగా, ఆయన సిజెపిని ఉగ్రవాదుల బిటీమ్ అన్నారు. విద్యాశాఖ మంత్రి ఈ దేశ యువతను ఉగ్రవాదులని పిలుస్తున్నారు' అని దీప్కే ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సార్, మేము ఉగ్రవాదులం కాదు. అమాయక విద్యార్థుల మరణాలకు కారణమైన మీలాంటి వారి నుంచి మాకు దేశభక్తి సర్టిఫికేట్ అవసరం లేదు' అని ఆయన అన్నారు. ప్రధాన్ మమ్మల్ని ఉగ్రవాదులని పిలుస్తాడు. కానీ విచిత్రం ఏమిటంటే, 17 మందికి పైగా విద్యార్థుల రక్తం అతని చేతుల మీదే ఉంది అని దీప్కే పేర్కొన్నారు.

## జోక్యం చేసుకోండి
(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జలసౌధలో బుధవారం సాయంత్రం తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్‌డిఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి న్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపి మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు ఎ.పి.జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సమావేశం లో పాల్గొన్నారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ ఆర్‌డిఎస్ ఆనకట్ట ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించాలని కోరారు. రాజోలి బండ డైవర్సన్ కెనాల్ ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ.59 కోట్లు డిపాజిట్ చేసిందని, పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ప్యాకేజీ 1,2 పనులు ఇప్పటికీ చేపట్టలేదని, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తి అయ్యాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలని గురువారం కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సిఎంలతో జరిగే సమావేశం లో ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు.

**ఆర్‌డిఎస్ పూడికతీతకు కేంద్రానికి విజ్ఞప్తి చేయాలి**

ఆర్‌డిఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడికతీతతో పాటు 2004లో నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతిపత్రం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. అప్పటి నివేదికకు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితిని విశ్లేషించుకోవాలని సిఎం సూచించారు. వెంటనే పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు. తుమ్మిళ్ల నుంచి నీటిని వినియోగించుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచాలని, వీలైనంత వేగంగా పనులను చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి అదేశించారు. అంతకు ముందు ఆర్‌డిఎస్ పరిస్థితిని ఇంజనీర్లు వివరిస్తూ ఆర్‌డిఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల ఆశించిన విధంగా నీటి మళ్ళింపు సాధ్యం కావడంలేదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 2004లో నిపుణుల కమిటీ పూడిక తొలిగించాలని సూచించిందని, ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు ఇప్పటికీ అమలు కాలేదని, వెంటనే పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉండటంతో ఆ రాష్ట్ర సహకారం కోరాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

## లాకప్ మరణమే
(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారించింది. సాయికృష్ణ తీవ్ర గాయాలతో జూన్ 2వ తేదీకి ముందే కృష్ణలంక పోలీస్ స్టేషన్ లాకప్‌లో చనిపోయినట్లు తమకు ఆధారాలు లభించినట్లు వెల్లడించింది. అయితే అతని మృతదేహం ఇంకా లభ్యం కాలేదని తెలిపింది. తగులబెట్టారో, పూడ్చారో కూడా తెలియడం లేదని పేర్కొంది. ఈ కేసులో తొలి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజు తీవ్ర నేరానికి పాల్పడ్డారని సిట్ స్పష్టం చేసింది. అతను ఉద్దేశపూర్వకంగానే సీసీ ఫుటేజ్ సహా ఇతర సాంకేతిక ఆధారాలన్నీ ధ్వంసం చేశారని పేర్కొంది. అంతేకాకుండా హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టుకు కూడా తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపింది. ఈ మేరకు విజయవాడ రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు బుధవారం సిట్ 19 పేజీల నివేదిక సమర్పించింది. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజును మంగళవారం అరెస్టు చేసిన సిట్ అధికారులు.. బుధవారం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ప్రాథమిక విచారణ అనంతరం నాగ రాజుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.
**సిట్ నివేదికలో సంచలన వివరాలు...** గాదె సాయికృష్ణపై కృష్ణలంక, మాచవరం పోలీస్ స్టేషన్లలో రెండు నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో మే 6వ తేదీన ప్రకాశం జిల్లా మార్కాపురంలో గాదె సాయికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని విజయవాడ తీసుకొచ్చారు. 24 గంటల్లో నిందితుడిని కోర్టులో హాజరుపరచాల్సి ఉండగా, ఆ విధంగా చేయలేదు. ఆ తర్వాత అతని తల్లి విజయలక్ష్మి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు తెలుసుకుని వచ్చింది. సీఐ నాగరాజును కలిసి తన కొడుకును చూపించాలని కోరగా, అతను తీవ్రంగా దుర్భాషలాడారని మృతుని తల్లి తెలిపింది. అదేవిధంగా సాయికృష్ణను పోలీస్ స్టేషన్‌లో చూసినట్లు ఒక ఎస్ఐ సహా కొందరు పోలీసు సిబ్బంది కూడా సిట్‌కి చెప్పారు. ఆ సమయంలో అతను తీవ్ర గాయాలతో ఉన్నాడని కూడా వెల్లడించారు. మొత్తం 17 మంది నుంచి వివరాలు సేకరించిన తర్వాత సాయికృష్ణను లాకప్‌లోనే కొట్టి చంపినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సిట్ నివేదికలో పేర్కొంది.

## 'సర్'కు సర్వం సిద్ధం!
(మొదటి పేజీ తరువాయి)

బూత్ స్థాయి వరకు భారీ యంత్రాంగం నేటి నుంచి రంగంలోకి దిగనుంది. ఇప్పటికే వివిధ స్థాయిల్లో ఇఆర్‌ఓ, ఎఆర్‌ఒ, బిఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బిఎల్‌ఓలకు ఎస్‌ఐఆర్‌కు సంబంధించిన కిట్‌లను బుధవారం అందచేశారు. ఎన్యూమరేషన్ పూర్తయ్యాక జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం పరిశీలన, విచారణ, ధృవీకరణ పూర్తిచేసి అక్టోబర్ 1న తుది జాబితా విడుదల చేయనున్నారు.
**మూడు సార్లు ఇంటికి రానున్న బిఎల్‌ఓలు**
ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) ప్రతి ఇంటికీ వెళ్లి ప్రీ‌ప్రింటెడ్ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఓటర్లు వాటిని పూరించి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఫారాల సేకరణ కోసం బిఎల్‌ఓలు కనీసం మూడుసార్లు ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లనున్నారు. ఒకవేళ ఎవరైనా ఇంట్లో లేకపోతే, వారి తరఫున కుటుంబంలోని పెద్దవారు ఫారం పూరించి బిఎల్‌ఓకు అందజేయవచ్చు. ఒకవేళ ఫారం అందకపోతే బిఎల్‌ఓను సంప్రదించవచ్చని, 1950 హెల్ప్‌లైన్ లేదా బుక్ ఎకాల్ విత్ బిఎల్‌ఓ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు సూచించారు.
**ఆన్‌లైన్‌లోనూ ఫారం సమర్పణ**
ఓటర్ల సౌకర్యార్థం ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో కూడా సమర్పించే అవకాశం కల్పించారు.
**ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్**
voters.eci.gov.inలో లాగిన్ అయి ఫారం నింపవచ్చు. ఇంట్లో లేని ఓటర్ల తరఫున కుటుంబంలోని పెద్దవారు కూడా ఫారం పూరించి బిఎల్‌ఓకు అందజేయవచ్చు అని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. ఫారం అందకపోతే సంబంధిత బిఎల్‌ఓను సంప్రదించవచ్చని, లేదా 1950 హెల్ప్‌లైన్, బుక్ ఎ కాల్ విత్ బిఎల్‌ఓ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.
**కొత్త ఓటర్లకు అవకాశం**
18 ఏళ్లు పూర్తిచేసుకున్న వారు కొత్త ఓటర్లుగా నమోదు కోసం ఫారం6 సమర్పించవచ్చు. అలాగే 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా అర్హులుగా పరిగణిస్తారు. వారి దరఖాస్తులను క్లెయిమ్‌లు, అభ్యంతరాల దశలో పరిశీలించి తుది జాబితాలో పేర్లు చేర్చనున్నారు.
**ముసాయిదా జాబితా తర్వాతే చిరునామా మార్పులు..**
ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు చిరునామా మార్పు, పేరు, ఇతర వివరాల సవరణ చేయించుకోవాలంటే ముసాయిదా జాబితా విడుదల అనంతరం ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను కూడా క్లెయిమ్‌లు, అభ్యంతరాల దశలోనే పరిశీలిస్తారు. ఎన్యూమరేషన్ దశలో సాధారణంగా ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే, ముసాయిదా జాబితా అనంతరం ఏదైనా పేరుపై లేదా అర్హతపై అనుమానం తలెత్తితే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నోటీసు జారీ చేసి పుట్టిన తేదీ ధృవపత్రం, పాస్‌పోర్ట్, విద్యా సర్టిఫికెట్లు, నివాస ధృవపత్రం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు వంటి ఆధారాలు కోరవచ్చునని తెలిపారు.

### రాష్ట్రంలో ఓటర్ల వివరాలు

- అసెంబ్లీ నియోజకవర్గాలు : 119
- రిజర్వ్‌డ నియోజకవర్గాలు : 12 ఎస్‌టి, 19 ఎస్‌సి
- పోలింగ్ స్టేషన్ లొకేషన్లు : 19,942
- మొత్తం పోలింగ్ స్టేషన్లు : 35,985
- 1,200లోపు ఓటర్లు ఉన్న కేంద్రాలు : 28,662
- 1,200పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలు : 7,323
- జిల్లా ఎన్నికల అధికారులు : 33
- ఇఆర్‌ఒలు : 119
- ఎఇఆర్‌ఒలు : 882
- బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు : 3,596
- బిఎల్‌ఒలు : 35,985
- బూత్ లెవల్ ఏజెంట్లు : 49,018.

## సెనేట్ షాక్
(మొదటి పేజీ తరువాయి)

లేదు. ఎందుకంటే దీనికి చట్టబద్ధత లేదు. ఐనప్పటికీ కూడా అమెరికా కాంగ్రెస్‌లో మొదటిసారి చేసిన ఈ తీర్మానం ఒక అసాధారణ చర్యగా, ప్రతీకాత్మకమైనదిగా గుర్తింపు పొంది రికార్డులలో నమోదైంది. ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందంపై కాంగ్రెస్‌లోనూ,అధికార రిపబ్లికన్ ఎంపీలలోనూ కూడా సందేహాలురేకెత్తుతున్నాయి.ఈ ఒప్పందం నిలబడేదికాదని ఇరాన్ తీరుతెన్నులే చెబుతున్నాయని అమెరికన్లు కొందరు వాదిస్తున్నారు. ట్రంప్ ప్రారంభించిన యుద్ధానికి, ఈ ఒప్పందానికి కూడా అమెరికాలో అంతర్గతంగా ఎలాంటి ప్రజాదరణ లభించలేదు.
1973లో యుద్ధ అధికారాల చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారి, విదేశంపై చేసిన ఒక సైనికచర్యను ఆపేయాలని దేశాధ్యక్షుణ్ణి కోరుతూ కాంగ్రెస్‌లో తీర్మానం జరిగింది. అందువల్ల అమెరికాలో ఇదొక అసాధారణాంశం. దీనిపై పశ్చిమాసియా విశ్లేషకురాలు లారా బ్రూమెన్‌ఫీల్డ్ స్పందిస్తూ, ఇది అమెరికా ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తుందన్నారు.
అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి ఒక తాత్కాలిక ఎంఓయుపై సంతకాలు జరిగిన తర్వాత తిరిగి అణుసామర్థ్య తనిఖీలపై వాగ్వాదం కొనసాగుతున్న దశలో సెనేట్ ఈ తీర్మానం ఆమోదించింది. ఈ తాత్కాలిక ఒప్పందం నిలబడేదికాదని, ఎవరి మొండి పట్టుదలలో వారు ఉన్నారని విశ్లేషకులు చెబుతుండగా, 60 రోజుల్లో తుది ఒప్పందానికి వస్తారా? లేదా? అనే విషయంపై కూడా సందేహాలు రేకెత్తుతున్నాయి. ఇరాన్‌లో ధ్వంసమైన ప్రాంతాలలో అణు తనిఖీలకు అనుమతించేదిలేదని ఇరాన్ తాజా ప్రకటన చేసింది. ఒప్పందానికి కట్టుబడి ఉండకపోతే తాము చేయాల్సింది చేస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అటు లెబనాన్ విషయంలో ట్రంప్ రెండు రోజుల క్రితం ప్రకటన చేస్తూ, ఇరాన్ పెంచి పోషిస్తున్న హెజ్బొల్లాను దాడులు చేయకుండా అదుపు చేయకపోతే సహించబోమని హెచ్చరించారు. వాస్తవానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ పని చేయాలన్నా అధ్యక్షుడికి కాంగ్రెస్ ఆమోదం కావాలి.దేశ రక్షణకు ఇతరదేశంపై యుద్ధం చేయడానికి కూడా కాంగ్రెస్ అనుమతి ఉండాలి. కాంగ్రెస్ ద్వారా యుద్ధ నిధుల ఆమోదం పొందాలి. కానీ, ఆపద్ధర్మంగా 60 రోజులపాటు యుద్ధం చేసేందుకు అధ్యక్షుడికి ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. ఈ అధికారాలు ఉపయోగించే ఇరాన్‌పై ట్రంప్ యుద్ధం చేశారు. ఈ నిర్ణీత గడువులోపే తాము దాడులను ఆపేశామని కూడా ఆయన వివరణ ఇచ్చారు. ఈ దశలో యుద్ధం ఆపాలని లేదా సైనిక చర్య కొనసాగించేముందు కాంగ్రెస్ ఆమోదం పొందాలని సెనేట్ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది.
**అసందర్భం,అర్థరహితం: ట్రంప్ విమర్శ**
దీనిపై ట్రంప్ స్పందిస్తూ చాలా ఆలస్యంగా ఈ తీర్మానం చేశారని, ఈ తీర్మానం అసందర్భమైనదీ, అర్థరహితమైనదీ అని డెమొక్రాట్లపై విమర్శలు కురిపించారు.నేను ఇరాన్‌ను పతనం అంచున నిలబెట్టాను, కానీ ఇలాంటి తీర్మానాల ద్వారా ప్రతిపక్షం నా కృషిని మరింత కష్టతరం చేస్తోంది, అర్థరహితమైన యుద్ధ అధికారాల చట్టంపై ఓటింగ్ జరపాలనుకున్నారు, వారు నా సమస్యను సంక్లిష్టం చేసినాగానీ నా పని నేను పూర్తిచేస్తాను, ఎందుకంటే నేను మొదలుపెట్టిన పని పూర్తిచేస్తాను అని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ స్పందించారు.

## భవిష్యత్తు కమ్యూనిజానిదే
(మొదటి పేజీ తరువాయి)

వివిధ దేశాలలో యువత, ప్రజలు కమ్యూనిస్టులను ఆదరిస్తున్నారని, కమ్యూనిస్టులు ముందుకు సాగుతున్నారన్నారు. శ్రీలంకలో కమ్యూనిస్టు నాయకుడిని ఆదరించిన ప్రజలు దేశాధినేతగా ఎన్నుకున్నారని, నేపాల్‌లో ఐక్యమైన కమ్యూనిస్టు పార్టీలు రాజ్యాధికారమే లక్ష్యంగా నిలబడ్డాయని తెలిపారు. ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీ పాలనలో చైనా ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందన్నారు. ఇక ప్రపంచ పోలీసులా వ్యవహరిస్తున్న ట్రంప్ పాలనలో కూడా న్యూయార్క్ నగరంలో సోషలిస్టు అభ్యర్థి మేయర్‌గా మంమ్దాని గెలుపొందారని, ఈ పరిస్థితుల లో మన దేశంలోనూ కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని వామపక్ష శ్రేయోభిలాషులు బలంగా నమ్ముతున్నారని సాంబశివరావు వివరించారు. భారతదేశంలో కమ్యూనిస్టులు ఐక్యం కావాలని సాంబశివరావు కోరారు. ఈ క్రమంలో భారత దేశంలో వందేళ్ల కింద ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకూ అనేక నిర్బంధాలను తట్టుకుని నిలబడిన భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని అన్నారు.

**దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆకలి చావులు, పేద, ధనికుల మధ్య వ్యత్యాసం**

దేశంలో నిత్యం పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆకలి చావులు, పేద, ధనికుల మధ్య వ్యత్యాసం భారీగా పెరిగిపోతున్నదని, మరోవైపు దేశంలో ఆధాని, అంబానీల గణనీయంగా సంపద పెరిగిందని సాంబశివరావు చెప్పారు. ప్రపంచ ఆకలి సూచీలో 2014లో 55వ స్థానంలో ఉన్న భారతదేశం 2025లో 102 స్థానానికి పడిపోయిందని 2014లో సుమారు రూ.53 లక్షల కోట్లుగా ఉన్న కేంద్ర ప్రభుత్వ అప్పు 2025–26 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి రూ.197 లక్షల కోట్లకు చేరిందని, ఇంత భారీ అప్పు భారతదేశ ప్రజల మీద మోపబడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిత్యావసర వస్తువులతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాన్నంటి పేద, మధ్య తరగతి ప్రజలకు అందనంత దూరంలో ఉంటున్నాయన్నారు. కేంద్రంలో ఈవిఎంల మాయాజాలంతోనే మూడవసారి ప్రధానిగా మోదీ ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉజ్బెకిస్థాన్‌పై పోర్చుగల్ గెలుపు

పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సరికొత్త రికార్డు లిఖించాడు. ప్రపంచకప్ చరిత్రలో ఆరు ఎడిషన్లలో గోల్స్ సాధించిన తొలి ఆటగాడిగా నిలిచాడు. మంగళవారం ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రొనాల్డో ఈ మైలురాయిని అందుకున్నాడు. క్రిస్టియానో డబుల్ గోల్స్తో సత్తా చాటడంతో గ్రూప్‌కె పోరులో పోర్చుగల్ 5–0తో ఉజ్బెకిస్థాన్‌ను ఓడించి నాకౌట్ రేసులో నిలిచింది. కాంగోతో జరిగిన తొలి మ్యాచ్ పోర్చుగల్ 1–1తో డ్రా కావడం, ఆ మ్యాచ్లో గోల్ చేయలేకపోవడంపై వచ్చిన విమర్శలకు రొనాల్డో తన ఆటతోనే సమాధానమిచ్చాడు. ఆట మొదలైన 6వ నిమిషంలోనే జోవావో కాన్సెలో అందించిన క్రాస్ను అందుకుని 41 ఏండ్ల రొనాల్డో తన కుడి కాలితో బంతిని గోల్ పోస్టొకి పంపి పోర్చుగల్కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆపై పోర్చుగల్ తన దాడిని మరింత ఉధృతం చేసింది. 17వ నిమిషంలో లభించిన ఫ్రీ కిక్ వద్ద రొనాల్డో తాను కిక్ కొట్టబోతున్నట్లు నటిస్తూ తెలివిగా బంతిని వదిలేయగా, అక్కడ సిద్ధంగా ఉన్న నునో మెండిస్ దాన్ని గోల్గా మలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఆ తర్వాత 39వ నిమిషంలో మిడ్ ఫీల్డర్ బ్రూనో ఫెర్నాండెజ్ అందించిన పర్ఫెక్ట్ పాస్ను అందుకున్న రొనాల్డో.. వేగంగా దూసుకెళ్లి బాటమ్‌లెఫ్ట్ కార్నర్లోకి బంతిని పంపి మ్యాచ్లో తన రెండో గోల్ నమోదు చేశాడు. 61వ నిమిషంలో పోర్చుగల్కు



లభించిన కార్నర్ కిక్ను క్లియర్ చేసే ప్రయత్నంలో ఉజ్బెకిస్థాన్ ఓన్ గోల్ చేయడంతో పోర్చుగల్ 4–0తో తిరుగులేని స్థితికి చేరింది. 87వ నిమిషంలో సబ్బిట్యూట్ ప్లేయర్ రాఫెల్ లెయావో అద్భుతమైన గోల్ సాధించి పోర్చుగల్ భారీ విజయం ఖాయం చేశాడు.

## ఇరాక్‌పై ఫ్రాన్స్ విజయం

తన కెరీర్‌లో వందో అంతర్జాతీయ మ్యాచ్‌ను ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ కిలియన్ ఎంబాపె చిరస్మరణీయంగా మార్చుకున్నాడు. అంచనాలను అందుకుంటూ ఎంబాపె డబుల్ గోల్స్‌తో దుమ్మురేపడంతో ఫిఫా ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ వరుసగా రెండో విజయంతో నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన గ్రూప్‌ఐ మ్యాచ్లో ఆ జట్టు 3–0తో ఇరాక్‌ను చిత్తుగా ఓడించింది. ఎంబాపె14, 54వ నిమిషాల్లో రెండు గోల్స్ చెలరేగి జట్టుకు విజయాన్ని అందించాడు. బాలన్ డి ఓర్ విజేత ఉస్మానే డెంబెలె 66వ నిమిషంలో మరో గోల్ సాధించాడు. తన వందో మ్యాచ్లో రెండు గోల్స్ కొట్టిన ఎంబాపె ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో జర్మనీకి చెందిన మిరాస్లావ్ క్లోస్ (16 గోల్స్) రికార్డును సమంచేసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో (15 గోల్స్)ను అధిగమించాడు. ఈ విజయంతో నాకౌట్ బెర్తు సొంతం చేసుకున్న ఫ్రాన్స్ జూలై 4న జర్మనీతో తలపడే అవకాశం ఉంది.

నార్వే ముందంజ.. అల్జీరియా నిరీక్షణకు తెర

ఎర్లింగ్ హాలాండ్ డబుల్ గోల్స్ ధమాకాతో నార్వే జట్టు ఫిఫా వరల్డ్కప్లో తదుపరి దశకు ముందంజ వేసింది. హోరాహోరీగా సాగిన గ్రూప్‌ఐ మ్యాచ్లో నార్వే.. 3–2తో సెనెగల్ను ఓడించింది. ఎర్లింగ్ 48, 58వ నిమిషాల్లో రెండు గోల్స్ చేయగా మార్కస్ పెడర్సన్ (43వ ని.) ఒక గోల్ కొట్టాడు. గ్రూప్‌జేలో అల్జీరియా 2–1తో జోర్డాన్ను ఓడించి 2014 తర్వాత ఈ మెగా టోర్నీలో తొలి విజయాన్ని నమోదుచేసింది. అల్జీరియా తరఫున నాధిర్ బెన్బొలి (69), అమిన్ గుయిరి (82) చెరో గోల్ చేసి తమ జట్టుకు చరిత్రాత్మక విజయాన్ని అందించారు.

# వన్డే బ్యాటర్లలో గిల్‌కు రెండో ర్యాంక్

టెస్టు బౌలర్లలో
బుమ్రాతో సమంగా హెన్రీ

**దుబాయ్:** మేటి వన్డే బ్యాటర్ల జాబితాను ఐసిసి రిలీజ్ చేసింది. భారత కెప్టెన్ శుభమన్ గిల్ ఆ ర్యాంకుల్లో రెండో స్థానంలో నిలిచాడు. ఇక టెస్టు బౌలింగ్ ర్యాంకుల్లో టాప్ ప్లేస్లో ఉన్న జస్ప్రీత్ బుమ్రాకు సమంగా కివీస్ బౌలర్ మ్యాచ్ హెన్రీ వచ్చేశాడు. ఆ ఇద్దరూ ఇప్పుడూ టెస్టు బౌలింగ్ ర్యాంక్‌లో సమంగా ఉన్నారు. ఇక వన్డే బ్యాటింగ్లో కివీస్ బ్యాటర్ డారెల్ మిచెల్ తొలి స్థానంలో ఉన్నాడు. గిల్, మిచెల్ మధ్య 24 రేటింగ్ పాయింట్స్ తేడా ఉన్నది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్తో జరిగిన వన్డే సిరీస్లో గిల్ అద్భుతంగా రాణించాడు. దీంతో అతని ర్యాంకు మెరుగుపడింది. ఇక ఆఫ్ఘన్తో జరిగిన మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ రాలేదు. ఆ మ్యాచ్లో ఇండియా 9 వికెట్ల తేడాతో నెగ్గింది. ఇక రెండు వన్డేల్లో అతను 84, 154 రన్స్ స్కోరు చేశాడు. ఇషాన్ కిషణ్ 21 స్థానాలను దాటి ప్రస్తుతం 43వ ర్యాంక్కు చేరుకున్నది. వన్డే బౌల



ర్లలో అర్షదీప్ సింగ్ 22, ప్రసిద్ధ కృష్ణ 58, వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో ఉన్నారు. ఆఫ్ఘనిస్థాన్తో సిరీస్లో ఆడని కోహ్లి ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్నాడు. ఇక రోహిత్‌శర్మ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక టెస్టుల్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ దూసుకొస్తున్నాడు. బుమ్రాతో కలిసి అతను నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించేశాడు. ఇంగ్లండ్తో జరిగిన రెండో టెస్టులో అతను అద్భుతంగా బౌలింగ్ చేశాడు. సుమారు 36 ఏళ్ల తర్వాత మళ్లీ కివీస్ బౌలర్ టాప్ ర్యాంకులో నిలిచాడు. గతంలో జాక్ కోవ్, రిచర్డ్ హాడ్లీ ఆ అగ్రస్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్తో జరిగిన రెండో టెస్టులో మ్యాట్ హెన్రీ 11 వికెట్లు తీసుకున్నాడు.

# పాకిస్థాన్‌పై భారత్ జయభేరి



ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ లండన్ అంచెలో భారత్ సత్తాచాటింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో హోరాహోరీగా సాగిన పోరులో భారత్.. 4–3తో దాయాది దేశాన్ని చిత్తుచేసింది. భారత్ తరఫున అభిషేక్ (22వ నిమిషంలో), నీలకంఠ శర్మ (24), సుఖ్జీత్ సింగ్ (40), రాజిందర్ సింగ్ (53) తలా ఓ గోల్ చేశారు. పాకిస్థాన్ నుంచి అహ్మద్ నదీమ్ (8), అబు మహ్మద్ (53), మోయిన్ షకీల్ (60) పోరాడినా పాక్‌ను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయారు.

# శక్తివంతమైన రాజ్యం మగధ






మహాజనపదాల యుగంలో అత్యంత శక్తివంతమైన, ప్రభావవంతమైన రాజ్యంగా మగధ ఎదిగింది. క్రీపూ 6వ శతాబ్దం నుండి ఇది రాజకీయ, ఆర్థిక, సైనిక పరంగా ఇతర మహాజనపదాల కంటే ఆధిపత్యాన్ని సాధించింది. మగధ ప్రాభవానికి భౌగోళిక, ఆర్థిక, సైనిక, రాజకీయ అంశాల సమన్వయం కారణమైంది. మగధ రాజ్యం ఉత్తరాన గంగా, పడమరన సోన్, తూర్పున చంపా నదులచే సహజసిద్ధంగా ఆవరించబడి ఉండేది. ఈ నదులు సహజ రక్షణ గోడలుగా పనిచేశాయి. నీటి సమృద్ధి వల్ల వ్యవసాయం విస్తరించింది. పుష్కల వర్షపాతం, నిత్య ప్రవాహం ఉన్న నదులు భూమి సారవంతతను పెంచాయి. అదనంగా, అటవీ ప్రాంతాలు కలిగి ఉండటం వల్ల కట్టడాలకు కావలసిన కలప, రథాలు, గృహ నిర్మాణానికి అవసరమైన వనరులు లభించాయి. యుద్ధాల కోసం ఏనుగుల శిక్షణకు కూడా అడవులు ఉపయోగపడ్డాయి. ప్రాంతంలో ఇనుప ఖనిజాల లభ్యత వల్ల బలమైన ఆయుధాలు, పరికరాల తయారీ సాధ్యమైంది. మగధ మొదటి రాజధాని రాజగృహ (గిరివ్రజ) ఐదు కొండల మధ్య ఉండేది. ఇది సహజ కోటలా ఉండి శత్రువులకు దుర్భేద్యంగా నిలిచింది. ఇది ప్రాచీన భారతదేశంలో మొదటి ప్రణాళికాబద్ధమైన కోట నగరంగా గుర్తింపు సంపాదించింది. తర్వాతి రాజధాని పటలిపుత్ర గంగా, సోన్, గండక్ నదుల సంగమ ప్రాంతంలో స్థాపించబడింది. ఈ ప్రాంతం జలదుర్గంగా ప్రసిద్ధి చెందింది. నదీ మార్గ వాణిజ్యంపై ఏకాధిపత్యం కలిగి ఉండటం వల్ల మగధ ఆర్థికంగా బలపడింది. గంగా లోయ వాణిజ్య మార్గాల నియంత్రణ, అలాగే బెంగాల్ ఉపసముద్ర సముద్ర మార్గాల ప్రాప్తి మగధకు ఆర్థిక ఆధిక్యం ఇచ్చాయి. వ్యవసాయంలో అధిక ఉత్పత్తి వల్ల మిగులు ధాన్యం లభించింది. ఇది జనాభా పెరుగుదల, పట్టణాల అభివృద్ధి, సైన్య విస్తరణకు దోహదపడింది. మగధ భౌగోళికంగా వత్స, అంగ మహాజనపదాల మధ్య ఉండటం వల్ల వాణిజ్య పరంగా అనుకూల స్థితిలో నిలిచింది. మగధ అభివృద్ధికి పాలకుల పాత్ర కీలకం. బింబిసార వివాహ కూటములు, యుద్ధాల ద్వారా రాజ్య విస్తరణ సాధించాడు. అతని కుమారుడు అజాతశత్రు మరింత ఆకాంక్షతో ఇతర రాజ్యాలను జయించాడు. అతను వ్యూహాత్మకంగా యుద్ధాలు నిర్వహించి, కోటల నిర్మాణం చేపట్టాడు. తర్వాత మహాపద్మ నందుడు మగధ సరిహద్దులను మరింత విస్తరించాడు. ఈ పాలకులు బలమైన స్థిర సైన్యాన్ని నిర్వహించడంతో పాటు పరిపాలనను క్రమబద్ధం చేశారు. మగధ సైన్యంలో పదాతి దళంతోపాటు, అశ్వదళం, రథాలు, ఏనుగులు ఉండేవి. ఇనుప ఆయుధాల వినియోగం వల్ల యుద్ధ సామర్థ్యం పెరిగింది. బలమైన కోటలు, సహజ రక్షణ వ్యవస్థలు మగధను దుర్భేద్యంగా మార్చాయి. ఈ అన్ని అంశాల సమ్మేళనం వల్ల మగధ మహాజనపదాలలో అగ్రస్థానాన్ని సంపాదించింది. తదుపరి కాలంలో ఇదే ప్రాంతం నుండి నందులు, అనంతరం మౌర్యులు ఎదిగి విశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. అందువల్ల మగధ మహాజనపద చరిత్ర భారత చరిత్రలో శక్తి, వ్యూహం, ఆర్థిక సమృద్ధి కలిసిన ఉత్తమ ఉదాహరణగా నిలిచింది.

## ద్రవ్యోల్బణం.. కఠిన చట్టం



క్రీస్తుశకం 301లో రోమన్ సామ్రాజ్యం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నిరంతర యుద్ధాలు, అధిక పన్నులు, నాణేల విలువ క్షీణత కారణంగా భయంకరమైన ద్రవ్యోల్బణం ఏర్పడింది. ఈ పరిస్థితిని అదుపులోకి తేవడానికి అప్పటి రోమన్ చక్రవర్తి డయోక్లీషియన్ ఒక అత్యంత కఠినమైన చట్టాన్ని ప్రవేశపెట్టాడు. అదే గరిష్ఠ ధరల ఉత్తర్వు. ప్రజలకు ఉపశమనమివ్వాలన్న ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ ఉత్తర్వు, ఆర్థిక చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ఈ చట్టం ప్రకారం, సామాన్య వస్తువులు, ఆహార పదార్థాలు, సేవలు, కూలీ వేతనాలు, పశువులు, అంతేకాదు బానిసల అమ్మక ధరలకు కూడా గరిష్ఠ పరిమితి ఖరారు చేశారు. మొత్తం మీద దాదాపు 1200కిపైగా వస్తువులు, సేవలు, వృత్తులకు ధరల జాబితా రూపొందించారు. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠినమైన శిక్షలు విధించేవారు. కొన్ని సందర్భాల్లో మరణ శిక్ష కూడా ఉండటం ఈ చట్టం ఎంత కఠినంగా అమలులోకి తీసుకువచ్చారో సూచిస్తుంది. కానీ, ఆచరణలో ఈ ఉత్తర్వు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తుందన్న భయంతో వ్యాపారులు సరుకులను మార్కెట్‌లోకి తేవడం మానేశారు. అనేక వస్తువులు గోదాముల్లోనే ఉండిపోయాయి. ఫలితంగా మార్కెట్‌లో కొరత ఏర్పడింది. పెద్ద వ్యాపారులు రహస్యంగా అక్రమ వ్యాపారం సాగించడం ప్రారంభించారు. బ్లాక్‌మార్కెట్ ఆ రోజుల్లోనే మొదలైంది. ధరలు నియంత్రించాలన్న ప్రయత్నం, మరింత అవినీతి, అక్రమ వ్యాపారాలకు దారితీసింది. సామాన్య ప్రజలకు చౌకగా వస్తువులు అందించాల్సిన బదులు, అవి పూర్తిగా దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ చట్టం ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలని, ప్రజలను రక్షించాలని ప్రభుత్వం భావించినప్పటికీ, ఆర్థిక వ్యవస్థ సహజంగా పనిచేయకుండా అడ్డుపడటం వల్ల ప్రతికూల ఫలితాలే ఎక్కువగా కనిపించాయి. కొంతకాలానికి ఈ ఉత్తర్వును అమలు చేయడం కూడా కష్టమై, ప్రభుత్వం దానిని పట్టించుకోవడం తగ్గించింది. చరిత్రలో ఇది ధరల నియంత్రణకు సంబంధించిన తొలి పెద్ద చట్టాలలో ఒకటిగా నిలుస్తుంది. రోమన్ సామ్రాజ్యంలో పెరిగిన ద్రవ్యోల్బణానికి ప్రతిస్పందనగా ప్రభుత్వం బలవంతపు ఆర్థిక నియంత్రణలు తీసుకున్న స్పష్టమైన ఉదాహరణగా ఇది నిలిచింది. డయోక్లీషియన్ గరిష్ఠ ధరల ఉత్తర్వు ఒక వైపు ధైర్యమైన ప్రయోగంగా, మరోవైపు విఫలమైన ఆర్థిక ప్రయత్నంగా చరిత్రలో నిలిచిపోయింది.

# ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి



**ప్రజాపక్షం/తొర్రూరు :** కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయసారథి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలపై పన్నుల భారం వేసి దోపిడి చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఇచ్చిన హామీల అమలులో విఫలమయిందన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 6 నుంచి 14వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేయడం సరికాదన్నారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జూలై 5,6,7తేదీల్లో తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బంధు మహేందర్, సహాయ కార్యదర్శులు ఘనపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్‌కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, కోటగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే కార్మికుల హక్కుల రక్షణ

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కార్మిక హక్కుల రక్షణ, సింగరేణి పరిరక్షణకు కార్మికులంతా ఐకమత్యంగా ఉద్యమించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఫైవ్ ఇంక్లైన్‌లో ఫిట్ సెక్రటరీ రాజేందర్, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి రక్షణకై కార్మికులంతా ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో నిర్వహించే చర్చల్లో 31 డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, అందులో సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించకుంటే కార్మిక సమస్యల పరిష్కారాన్ని కోసం ఇప్పటికే సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని, సమస్యలు యాజమాన్యం పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఆయన హెచ్చరించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతుందన్నారు. సమావేశంలో మోటాపలుకుల రమేష్, మాతంగి రాంచందర్, అసిఫ్ ఫాషా, నూకల చంద్రమౌళి, రవికుమార్, గోవిందుల తిరుపతి, దోర్నాల తిరుపతి, మల్లికార్జున్, నల్ల సత్తి, కుమార్, ప్రవీణ్, తిరుపతి, కొండపల్లి శ్రీనివాస్‌రావు, ప్రశాంత్, చందు, నరేష్, రఘు, రాంచందర్, రాజు, సమ్మిరెడ్డి, రమేష్, బిమేష్, సదయ్య, రాజు, రఘు పాల్గొన్నారు.

# రానున్న కాలమంతా ఉద్యమాలదే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రానున్న కాలమంతా పోరాటాలు, ఉద్యమాలదే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో బాలనరసింహ్మా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు ముమ్మరం చేస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అమలు చేస్తుందని వేచి చూశామని, కానీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు ప్రజలను సంతృప్తి పరుస్తలేవని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే రకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో ఎటు చూసినా సమస్యలే ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు పింఛన్లు, నిరుద్యోగులకు రూ.2500, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ మొదలగు ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు ఉద్యమాలకు శ్రీకారం చుడతామని బాలనరసింహ్మా హెచ్చరించారు. సమావేశంలో




సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర సమితి సభ్యులు వి.వెంకటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నరసింహ, ఆర్.ఇందిర, జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మి పతి, కృష్ణాజి, మర్యాద వెంకటయ్య, తుమ్మల శివుడు బొల్లెద్దుల శ్రీనివాసులు, టి.కిరణ్ కుమార్, రవీందర్, బాలమురళి, శ్రీనివాసులు, బి.వెంకటమ్మ, సయ్యద్ ఖాజా మొయినోద్దీన్, ఎండి.కుతుబుద్దిన్, పి.గోపాల్ మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సెంట్రల్‌లైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి తోపునూరు చక్రపాణి చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో ధర్నా నిర్వహించి ఎంఇఒ, తహసీల్దార్, ఎంపిఒ కార్యాలయాలలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వేడి వేడి భోజనం పెట్టే హక్కును లాగేసుకుంటున్న ఈ విధానం కార్మికుల ఉపాధిని దెబ్బ తీస్తుందన్నారు. కార్మికులకు పిఎఫ్, ఎస్ఎఫ్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. నిత్యావసర వస్తువులు, సరుకులు, గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సప్లయి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్రవంతి, లక్ష్మి, గంగామణి, సుజాత, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.




# పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలి




సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి
27న ఏకశిల పార్క్ వద్ద నిరసన

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చివేతను తక్షణమే ఆపాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, సిపిఐఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ఎంసిపిఐ(యూ)జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణం శివనగర్‌లోని తమ్మెరభవన్ సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత పదిరోజులుగా మహానగరంలో పేదలు వేసుకున్న గుడిసెలను గోపాలపురం చెరువు, గుండ్ల సింగారంలో కూల్చివేశారని, మరికొన్ని పేదల గుడిసెలను కూల్చలనే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోని గుడిసెల కూల్చివేతలను ఆపాలని, పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలన్నారు. మహానగరంలో అనేకమంది భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకోని వ్యాపారం చేస్తూ చలామనవుతున్న వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోకుడా, నిలువ నీడలేని కిరాయి కట్టలేక ప్రభుత్వ భూములు చెరువులలో గుడిసెలు వేసుకోని జీవనం కొనసాగిస్తుంటే పేదల ఇళ్లను ఎలాంటి హెచ్చరిక లేకుండా కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోని కూల్చివేతలను ఆపి, నిరుపేదలకు పట్టాలు అందించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే ఈనెల 27న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగి ఏలేందర్, రాచర్ల రాజేందర్, సిపిఎం, ఎంసిపిఐ(యూ) నాయకులు సింగారపు బాబు, నర్ర ప్రతాప్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముందు సిపిఐ ధర్నా

**జనగామ :** బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ రోడ్డు ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జనగామ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య మాట్లాడుఽతూ హైదరాబాద్ రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో మిషన్ భగీరథ వాటర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, చెత్తా చెదారంగా ఉన్న రోడ్లను శుభ్రం చేయాలని, అంగన్‌వాడి కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు కమ్యూనిటి హాల్ నిర్మాణం చేయాలనిక్షి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, ఉప్పాల ఐలయ్య, బొడిగే వీరస్వామి, కందాల యాదలక్ష్మి, శోభ, స్వాతి, లక్ష్మమ్మ, సుశీల, యాదలక్ష్మి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# గుడిసెవాసులను జనగణన చేసి, ఓటరుగా నమోదు చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గుడిసెవాసులను జనగణన చేసి, ఓటరుగా నమోదు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం జిహెచ్ఎం నాగోల్ సర్కిల్ అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫజ్ 3, కుంట్లూరు రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 215 నుండి 224 వరకు గల వంద ఎకరాల భూదాన భూమిలో నాలుగేండ్లుగా నివాసం ఉంటున్న 7000 వేల కుటుంబాలని భారత ప్రభుత్వం చేపట్టిన జనగణలో లెక్కించాలని జిఎచ్ఎంసి కమిషనర్‌కు సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భూదాన భూముల్లో నివాసం ఉంటున్న గుడిసెవాసులంత ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల ప్రజలేనని, మౌలిక వసుతులు లేకున్నా తమ పిల్లలను చదివిస్తూ అక్రడ నివాసం ఉంటున్నారని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులందరికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించక పోగా కనీసం మనుషులుగా కూడా గుర్తించటం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రారంభం అయినా జనగణలో గుడిసెవాసులని చేర్చుకోకుండా ప్రభుత్వం వారికీ అన్యాయం చేసే కుట్ర జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకి ఆదేశాలు ఇచ్చి ఆ పేద ప్రజలందరిని జనాభా లెక్కల్లో చేర్చాలన్నారు. సుమారు ముప్పై వేల మంది నివాసం ఉండే గుడిసెల్లో సర్వే చేయకపోతే అది పారదర్శకత లేని సర్వే అవుతుందన్నారు. తక్షణమే జనగణలో చేర్చి, ఓటు హక్కు నమోదు చేయాలనీ, వారికీ కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొన్నారు.

# మోడల్ సిటీగా నల్లగొండ

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### ఆర్‌టిసి బస్టాండ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన, 2 సిటీ బస్సులు ప్రారంభం





**ప్రజాపక్షం/నల్లగొండ :** పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.బుధవారం ఆయన రూ.1.20 కోట్లతో చేపట్టనున్న నల్లగొండ ఆర్‌టిసి బస్టాండ్ విస్తరణ,ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 2 సిటీ బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ షాపింగ్, ఇతర అవసరాల కోసం మహిళలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆసుపత్రికి వెళ్లేందుకు ఇకపై సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. చెరువుగట్టుఎస్‌ఎల్‌బీసీ మార్గంతో పాటు దరవేశిపురం నుంచి దుప్పలపల్లి వరకు సిటీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించామని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్‌ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు,ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్,రెస్టారెంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గార్డెన్, బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు, ఆధునిక ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని, ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు.రూ.83 కోట్లతో తాగునీటి శుద్ధి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, పరిసరాల పరిశుభ్రతతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది మోడల్ సిటీగా రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్,మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర ప్రణాళిక ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్‌పి శరత్‌చంద్ర పవార్,ఆర్‌టిసి ఆర్‌ఎం జ్యోత్స్న,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి,కార్పొరేటర్లు కవిత,రమేష్,లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

### రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మంత్రి పూజలు



దర్వేశిపురంలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు.అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుంచి కల్యాణ మండపం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రలను తీసుకెళ్లి మంత్రి అమ్మవారికి సమర్పించారు.అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షి దివ్య కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, జిల్లా, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని కోరారు.దరవేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ,ఎంపీడీఓ వేద రక్షిత,ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి,ఈవో నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల సంక్షేమమే ధ్యేయం

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారులో గల ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం 10 మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ స్పష్టం చేశారు. డి రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ.6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, అలాగే ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్‌కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, తహసీల్దార్ ఎ.శేషగిరి రావు, డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, నగేష్ కుమార్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలకు గ్రామసర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ 16లక్షల రూపాయల స్వంత ఖర్చులతో పాఠశాలను పునరుద్ధరించి రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలవడం అభినందనీయమాని జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రంథాలయం చైర్మన్ అవైస్ చిస్తీ అన్నారు. భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామంలో గ్రామసర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పునః ప్రారంభ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రముఖ నాయకుల చేతుల మీదుగా పాఠశాలలో పలు సాంకేతిక విభాగల ప్రారంభోత్సవంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భిక్షపతి, సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, ఎంఈఓ రంగరాజన్, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఎపీసీ చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు, మహిళ లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సుకు భారీగా తరలిరావాలి

### 26నహైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలి ఉద్యోగులందరూ ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యేశాల విశ్వకుమార్ పిలుపునిచ్చారు.నల్లగొండలోని టీపీయూఎస్ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ హైదరాబాద్ ఎల్‌బినగర్‌లోని స్వకులశాలి సమాజ భవనంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న పద్మశాలి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘ బలోపేతానికి తోడ్పడాలని కోరారు. పద్మశాలి ఉద్యోగుల హక్కుల పరిరక్షణ,ఉద్యోగ రంగంలో ఎదురవుతున్న సమస్యలు,సంక్షేమ అంశాలు,భవిష్యత్ కార్యాచరణతో పాటు సంఘం చేపట్టనున్న కార్యక్రమాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పున్న వేణుగోపాల్,ఆనందపు సత్యనారాయణ,గంజి నవీన్‌కుమార్,గంజి వెంకన్న,దొంత దామోదర్,దుడుకు జగదీశ్వర్, పగిడిమర్రి శివకుమార్, చిలుకూరి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## గుండె జబ్బులను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దు





**ప్రజాపక్షం/సూర్యాపేట :** గుండె జబ్బులను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దని సికింద్రాబాద్ యశోద హాస్పటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణీత్ పోలమూరి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా పలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ హెల్త్ రిక్స్ గురించి తెలుసుకోవాలన్నారు. గుండె జబ్బులకు వయసుతో సంబంధం లేదని అన్నారు. ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్ల వల్ల గుండెకి హాని జరుగుతుందన్నారు. గుండె ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి పెట్టాలని, ముందు నుంచే జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బులను నివారించవచ్చని తెలిపారు. ఛాతిలో నొప్పి లేదా ఏదో బరువుగా ఉండటం, కొద్దిపాటి శ్రమకే లేదా విశ్రాంతి సమయంలో శ్వాస ఆడకపోవడం, స్పృహ కోల్పోవడం, అలసటగా అనిపించడం, తరచూ తల తిరగడం, ఎడమ చేతి, మెడ, దవడ, వీపులో నొప్పి వంటి లక్షణాలు అనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యున్ని సంప్రదించాలని అన్నారు. రోజువారి వ్యాయమం, యోగా, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉప్పు అధికంగా నూనె, జంక్‌ఫుడ్స్, నిల్వ ఉండే పదార్థాలను తినడం తగ్గించాలన్నారు. బిపి, షుగర్, కొలస్ట్రాల్ టెస్టులు చేయించుకోవడంతో పాటు వాటిని అదుపులో ఉంచుకోవాలన్నారు. గుండె ఆపరేషన్, బైపాస్ సర్జరీ చేయకుండా, కొత్త విధానం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్, కర్నె సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కోకా ప్రవీణ్ పాల్గొన్నారు.



## మెరుగైన వైద్యమే లక్ష్యం

### స్పెషల్ ఆఫీసర్ గౌరవ్ ఉప్పల్

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి, నల్లగొండ జిల్లా ప్రజా పాలప్రగతి ప్రణాళిక స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సమీక్ష నిమిత్తం బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన నల్లగొండ ప్రభుత్వ ప్రధానాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈఔషది,టీహబ్ డయాగ్నస్టిక్, రేడియాలజీ, మేల్ సర్జికల్ వార్డు,ఐసీయూ,సీటీ స్కాన్ విభాగాలను పరిశీలించారు.యంత్రాల పనితీరు, రోగులకు అందుతున్న సేవలపై వైద్యులను, రోగులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను తనిఖీ చేసి మందుల నిల్వ,సరఫరాను రికార్డుల ద్వారా పరిశీలించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా ఉన్నందున ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు,పరికరాలు,మందుల సరఫరాను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.జీజీహెచ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ అవసరమని,సీటీ స్కాన్ రిపేర్ చేయాలని డాక్టర్లు కోరారని,కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించి చర్యలు తీసుకుంటామన్నారు.పరిశీలన వివరాలను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. అనంతరం మాన్యం చెల్క పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఓపీ,ఈఆరోగ్యం,హెచ్ఎంఎస్,ఈఔషది రికార్డులను పరిశీలించారు. అందుతున్న సేవలపై పూర్తి నివేదిక ఇవ్వాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫిరధౌసిని ఆదేశించారు.ఈ తనిఖీల్లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాహుల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే లక్ష్యంగా... ప్రభుత్వం, డెయిరీ యాజమాన్యం పనిచేస్తున్నాయ్

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి మదర్ డైయిరిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మీడియా సమావేశం నిర్వహించారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం, డెయిరీ యాజమాన్యం పనిచేస్తున్నాయి. ప్రైవేట్ డెయిరీలకు పాలు పోయడం కంటే రైతుల సొంత డెయిరీలకు పాలు పోస్తే వచ్చే లాభాలు తిరిగి రైతులకే చేరుతాయి. అందుకే రైతులు తమ డెయిరీలను బలోపేతం చేయాలని కోరారు. డెయిరీ అభివృద్ధి చెందితే రైతులకు మంచి ధరలతో పాటు బోనస్లు కూడా అందించే అవకాశం ఉంటుందని రైతులకు హామీ ఇచ్చారు. మనమంతా కలిసి ఒక్క సంవత్సరం పాటు మన డెయిరీని కాపాడుకుంటే రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందుతాని తెలిపారు. ఇటీవల డెయిరీ బోర్డు డైరెక్టర్లతో చర్చలు జరిపాం. రోజుకు వెయ్యి లీటర్లకు పైగా పాలు సరఫరా చేసే సంఘాలకు ప్రతి లీటరుకు అదనంగా ఒక రూపాయి బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. అలాగే అధిక పరిమాణంలో పాలు పోసే రైతులకు కూడా అదనపు ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ఎండాకాలంలో పాల ఉత్పత్తి తగ్గినందున ప్రైవేట్ డెయిరీలు ఎక్కువ ధరలు ఇస్తున్నట్లు కనిపించవచ్చు. కానీ వర్షాకాలంలో పాల ఉత్పత్తి పెరిగినప్పుడు అదే ప్రైవేట్ సంస్థలు ధరలు తగ్గించే అవకాశం ఉంటుంది. అందువల్ల రైతులు తాత్కాలిక లాభాల కోసం కాకుండా దీర్ఘకాల ప్రయోజనాల కోసం తమ డెయిరీలకు మద్దతు ఇవ్వాలన్నారు. నల్లగొండ జిల్లా పాల ఉత్పత్తిదారులు ముఖ్యంగా తమ డెయిరీని బలోపేతం చేయాలని కోరారు. మన డెయిరీ బలపడితే లాభాలు, బోనస్లు మరియు ఇతర ప్రయోజనాలు రైతులకే వస్తాయని తెలిపారు. ఒక్క చుక్క పాలు కూడా బయటకు వెళ్లకుండా డెయిరీకి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటోందని మూతపడిన పాల సేకరణ కేంద్రాలను తిరిగి ప్రారంభించడం, రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, డెయిరీ సంఘాల నాయకులు అందరూ కలిసి డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు మరిన్ని లాభాలు, బోనస్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





## కూలీ రేట్ల పెంపు కోసం జులై 1 నుంచి 7 వరకు పనిబంద్

### 1న నల్లగొండలో తాపీ కార్మిక సంఘాల జెఏసి విస్తృత సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తాపీ మేస్త్రీలు,సెంట్రింగ్ కార్మికులు,భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్ల పెంపు కోసం తాపీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 7 వరకు పనిబంద్ నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు.ఈ మేరకు పట్టణంలోని భాస్కర్ టాకీస్ అడ్డా వద్ద కరపత్రాలను విడుదల చేసి కార్మికులకు పిలుపునిచ్చారు.జేఏసీ నాయకులు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో సిమెంట్, ఇసుక, ఐరన్, కంకర తదితర నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో నిర్మాణ పనులు తగ్గిపోయాయని, ఫలితంగా కార్మికులకు ఉపాధి అవకాశాలు క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నప్పటికీ కూలి రేట్లు మాత్రం పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.జూలై 1న ఉదయం 10 గంటలకు నల్లగొండ పట్టణంలోని దర్గా మెట్ల వద్ద, పెద్దగడియారం సమీపంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి తాపీ మేస్త్రీలు,అడ్డా కూలీలు,ఆంధ్రా మేస్త్రీలు,ఇతర రాష్ట్రాల కార్మికులు సహా నిర్మాణ రంగానికి చెందిన ప్రతి కార్మికుడు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమాంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్‌రెడ్డి,భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు గుండె రవి,రేవెల్లి యాదయ్య,గోపగాని నర్సంహ్మ ,గుల్లి నరేందర్,ఐఎన్‌టీయూసీ నాయకులు పోలిపురం శంబురెడ్డి,పాలెపాక సహదేవులు, సీఐటీయూ నాయకులు దండంపల్లి సత్తయ్య,సాగర్ల మల్లయ్య, తాళూకా వెంకన్న, జెరిపోతుల యాదయ్యలు ఉన్నారు.

## అక్షర స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన



### అధిక ఫీజులు, అనుమతులు లేకుండా పుస్తకాల విక్రయంపై నిరసన

### ఎంఇఓ తనిఖీల్లో బయటపడ్డ బుక్స్, గదులకు తాళం

**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని అక్షర స్కూల్ ఎదుట బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా ప్రభుత్వ అనుమతులు లేకుండానే పుస్తకాలను విక్రయిస్తోందని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారని వారు ఆరోపించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అధిక ఫిర్యాదుల నేపథ్యంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు స్కూల్ వద్దకు చేరుకుని వివరణ కోరారు. అయితే యాజమాన్యం సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రశ్నించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసిందని సంఘాల నాయకులు పేర్కొన్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, పెద్ద సంఖ్యలో విద్యార్థి సంఘాల కార్యకర్తలు స్కూల్ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న కోదాడ మండల విద్యాధికారి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించగా పెద్ద మొత్తంలో పుస్తకాల నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు సమాచారం. పుస్తకాల విక్రయానికి సంబధించిన అనుమతులు, రికార్డులపై అనుమానాలు వ్యక్తం కావడంతో వాటిని పరిశీలించే వరకు సంబంధిత గదులకు ఎంఈవో తాళం వేసినట్లు తెలిసింది. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని మండిపడ్డారు. అధిక ఫీజులు, బలవంతపు పుస్తకాల విక్రయాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్షర స్కూల్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు ఎంఈవో తనిఖీల అనంతరం పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు సమాచారం. విచారణ పూర్తయ్యే వరకు పుస్తకాల విక్రయం, ఫీజుల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

## బిఎల్‌ఒలకు సర్వే నిర్వహణకు కిట్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుంచి జూలై 24 వరకు బూత్‌స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటి సర్వే నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ పొందిన బిఎల్‌ఓలకు సర్వే నిర్వహణకు అవసరమైన కిట్లు, ఇతర సామాగ్రిని బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. సర్ సర్వే నిర్వహణకు జిల్లా యంత్రాం గం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఓటరు జాబితా శుద్ధీకరణలో భాగంగా చేపడుతున్న ఈ సర్వేలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని కోరారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు పూర్తి సహకారం అందించి, అవసరమైన వివరాలు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** గిరిజనులు, ఎరుకలు, యానాదులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బస్సు యాత్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం గిరిజన ఎంఎల్‌ఏల బృందం కలిసి ఆహ్వానించింది. ఈకార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ గిరిజనులు, ఎరుకలు, యానాదుల సామాజిక, ఆర్థిక విద్యా అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్ల ద్వారా వేలాది మంది గిరిజన యువతకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు లభించాయని తెలిపారు. రిజర్వేషన్లు అమలులోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర ద్వారా గిరిజన సమాజ చరిత్ర, వారి హక్కులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడమే లక్ష్యమని అన్నారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని గిరిజన ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె. సోమయ్య తెలిపారు.బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ నిందితులు మిర్యాలగూడ మండలం గోపసముద్రం తండాకు చెందిన అజ్మీరా శశిధర్ నాయక్ (24) మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డకు చెందిన ధనావత్ కార్తీక్ (25)లు హైదరాబాద్లో రాపిడో రైడర్లుగా పనిచేస్తూ చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితులు ముందుగా హైదరాబాద్లో పార్క్ చేసి ఉన్న ఒక హోండా యాక్టివా స్కూటీని దొంగిలించి, దానిని చైన్ స్నాచింగ్లకు వినియోగించాలని ప్రణాళిక రచించారు. ఈ క్రమంలో ఈ నెల 17న మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్నగర్ ప్రాంతంలో ఇంటి ముందు పనిచేస్తున్న ఒక మహిళ మెడలో ఉన్న బంగారు చైన్ను లాక్కొని పరారయ్యారు. అనంతరం దొంగిలించిన బంగారు చైన్ను మిర్యాలగూడలోని మణప్పురం ఫైనాన్స్ లో తనఖా పెట్టి రూ.1,22,000 రుణం పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. డబ్బును ఇద్దరూ పంచుకుని ఖర్చు చేసినట్లు ఒప్పుకున్నారు.బుధవారం ఉదయం మిర్యాలగూడ హనుమాన్పేట ఫ్లైఓవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నిందితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని ఒప్పుకుని, నేరానికి ఉపయోగించిన వాహనాలు ఇతర వస్తువుల వివరాలు వెల్లడించారు.? నిందితుల నుండి 11.409 గ్రాముల బంగారు గొలుసు, స్కూటీ 1,డియో స్కూటీ 1,మొబైల్ ఫోన్స్ 2,ముసుగు,హెల్మెట్,టీ షర్టులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను రిమాండ్ కు పంపించినట్టు తెలిపారు.కేసును జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పర్యవేక్షణలో ఛేదించిన మిర్యాలగూడ టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె.సోమనర్సయ్య, సబ్ ఇన్స్పెక్టర్ ఎ.సతీష్, సిబ్బంది ఆర్.స్వర్ణానాయక్, బి.మణిదిప్, ఎస్డి.సమద్, అహ్మద్,డి.ఎన్ ప్రసాద్,ఎండీ.అక్బర్ పాషా, ఎం.రామకృష్ణ, ఎన్.రాజశేఖర్ ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ పవార్ ప్రత్యేకంగా అబినందించారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు



ప్రజాపక్షం/మంచిర్యాల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరం

ఎసిపి ప్రకాష్ పిలుపు



ప్రజాపక్షం/హాజీపూర్ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని మంచిర్యాల ఎసిపి ప్రకాష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు నిరంతరం నిఘా ఉంచుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఎవరైనా మాదక ద్రవ్యాల విక్రయాలకు లేదా రవాణాకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులుగా సమాజంలో ఇటువంటి దురలవాట్లపై ప్రజల్లో మరింత అవగాహన క ల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు.మంచిర్యాల రూరల్ సిఐ రవీందర్, హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, ఎక్సైజ్ డిఎస్పి రామ్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాఫూఫ్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగతి దేవి, అధ్యాపకులు, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సినేషన్‌పై..

## ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

అడిషనల్ కలెక్టర్ రాజీవ్ హనుమంతు



ప్రజాపక్షం/నేరడిగొండః మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజీవ్ హనుమంతు పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరికి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించి, అర్హులైన అందరికీ అందే విధంగా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై, ఈ నెల చివరి వా రంలో జరిగే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సద్దాం, ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.మండల తహసిల్దార్ ఎం.ఏ.ఖలీమ్, ఎంపిడివో చంద్రశేఖర్, నాయబ్ తహసిల్దార్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

## ప్రజాసేవే పరమావధిగా..

## సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి



ప్రజాపక్షం/కొండాపూర్ : ప్రజాసేవే పరమావదిగా భావించి విద్యార్థుల భవిష్యతు బాగుపడాలనే ఉద్దేశ్యంతో మరో గొప్ప సంకల్పానికి శ్రీకారం చుట్టారు గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి నా సర్పంచ్ పదవీ కాలంలో వచ్చే గౌరవ వేతనాన్ని మెత్తాన్ని తన అవసరాలకు కాకుండా పేద విద్యార్థుల చదువు కోసమే వినియోగిస్తానని ప్రకటించారు. మండల పరిధిలోని మల్లేపల్లి, గ్రామానికి చెందిన మల్లేశం,సునీతలు చనిపోవం తో వారి పిల్లలు శృతి శాంసన్ ,వాళ్ల అమ్మమ్మ మాణెమ్మ ,తాత నర్సయ్య, సంరక్షణలో పెరుగుతున్నారు. అమ్మమ్మ తాతలు ఆర్థిక ఇబ్బందులు పడుతూ పిల్లలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.మనవడు, మనమరాలు చదివించడానికి డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో విషయం తెలుసుకున్న గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి, దేవుడిలా వచ్చి వారి చదువుల కోసం తనకు వచ్చిన 30 వేల వేతనాన్ని శృతి శాంసన్ లకు అందజేసి వారి కుటుంబానికి అండగా నిలిచారు. వారికి భరోస్తా నిస్తూ మంచిగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## వార్డుల సమగ్రాభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్

ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1,2 వార్డులలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ కౌన్సిలర్లు నరసమ్మ, సుధీర్ గౌడ్ లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు వివరించారు.



# పేదల సంక్షేమమే

# కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



ప్రజాపక్షం/రామాయంపేట: పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుదవారం మండలంలోని కాట్రియాల, పర్వతాపూర్ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంబోత్సవాలు చేశారు. పర్వతాపూర్ గ్రామంలో ఎంఎస్ఎస్‌వో ద్వారా బోరుబావి తవ్వకం, నియోజకవర్గ అభివృద్ధి నిదులు 10లక్షల వ్యయంతో పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కాట్రియాల గ్రామంలో ఎంఎస్ఎస్‌వో ద్వారా బోరు ప్రారంబంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు నక్క యాదయ్య, మంగలి మల్లేశంల ఇళ్లను సర్పంచు కొత్త స్రవంతి రాజేందర్ గుప్తతో కలిసి ప్రారంబించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఇందిరమ్మ ఇళ్ల దర్శనం ఇస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే నిరుపేదలకు 2వందల యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు 2లక్షల రుణమాఫీ వంటి చారిత్రాత్మక పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. రాబోయె రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తార్యానాయక్, కొత్త స్రవంతి రాజేందర్‌గుప్తా, ఉప సర్పంచు బాబునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, దేవుని రంజిత్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మానెగల్ల రామకిష్టయ్య, బన్సీనాయక్, మద్దూరి సునీల్, నాయకులు పోచమ్మల గణేష్, నాగులు, సిద్దరామిరెడ్డి, సంజీవరెడ్డి, దేమె యాదగిరి, గడీల నగేష్, మహేందర్‌రెడ్డి, ర్యాగల రాజు, కాట్రియాల సిద్దరాములు, ఎల్లం, స్వామి, బైగిరి నాగరాజు, కమ్మరి రమేష్‌చారితో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు

## జాబితా సమగ్ర సవరణ

కలెక్టర్ హరిత

ప్రజాపక్షం/జైనూర్ / ఆసిఫాబాద్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ ఉద్యోగుల హాజరు, సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి నిర్వహించే సర్వే ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్వే పత్రాలను పంచాయతీల వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా పంపిణీ చేయాలని, ఓటరు జాబితాలో ఓటర్ల నూతన పాస్ పోర్ట్ సైజు ఫోటోల కోసం ఫోటోగ్రాఫర్లతో మాట్లాడి గ్రామాలలో తక్కువ ధరకు ఫోటోలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు నింపి ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో సేకరించి ఫారంలో పొందుపరిచిన వివరాలను యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ తహసిల్దార్ ఆడ బిర్షావ్, ఆర్ ఐ మోహన్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితా సవరణలో

## ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

ప్రజాపక్షం/మెదక్: ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రతి మాసింగ్ పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్2026పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అద్వర్యంలో మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి రాంబాస్ చౌరస్తా వరకు నిర్వహించిన 2కే రన్‌ను బుదవారం కలెక్టర్ ప్రారంబించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బిఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. మృతుల పేర్లు, డూప్లికేట్ ఓట్లు ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లు తొలగింపుతో పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించవచ్చన్నారు. అదనపు ఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో ప్రజలందరు బాగస్వాములు కావాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సొనకు కృషి చేయాలని సూచించారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఎలక్షన్ సూపరిండెంట్ గఫార్, ఆర్అండ్‌బి ఈఈ వేణు, జిల్లా పౌర సంబందాల అధికారి రామచంద్రరాజు, డిఎస్‌పి ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పజాప్రతినిదులు, విద్యార్థులతో పాటు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్ : భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నెన్నెల మండలం పుప్పల్వానిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన భూ సర్వే అవగాహన సదస్సుకు ఎడిఎస్ఎల్ఆర్ శ్రీనివాస్, మండల తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారితో కలిసి ఆయన హాజరయ్యారు.భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులతో సరిచూసి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సర్వే చేపట్టి ఆయా బ్లాక్ లకు పన్ను విధించడం జరుగుతుందని చెప్పారు. పట్టాదారులు తమ భూములకు సంబంధించి హద్దులను సమగ్రంగా చేసుకోవాలని, రికార్డుల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మోకా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు సరైన పత్రాలతో సర్వేలో పాల్గొనాలని, దరఖాస్తుల పరిశీలనలో బోగస్ ఉన్న వాటిని రద్దు చే యడం జరుగుతుందని, వివాదాలలో ఉన్న భూములను న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. అంతకుముందు మండల తహసిల్దార్ కా ర్యాలయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధులలో సమయపాలన పాటించాలని సూచించారు.ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎడిఎస్ఎల్ఆర్ శ్రీనివాస్, మండల తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బిజెపి హామీ ఎక్కడ ?

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

ఆంజనేయులు గౌడ్



ప్రజాపక్షం/నర్సాపూర్ : ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎక్కడ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ విమర్శించారు. బుధవారం ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్ లో ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ ప్రారంభించిన చాత్రోన్ కి గూంజ్ ఉద్యమానికి మద్దతుగా నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం తరచు జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలు నియామక ప్రక్రియలో జాప్యాలు లక్షలాదిమంది విద్యార్థుల, ఉద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశ వ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. లక్షలాదిమంది విద్యార్థులు కష్టపడి పరీక్షలకు సిద్ధమయ్యారని పేపర్ లీకేజీల కారణంగా వారి శ్రమ వృధా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగుల భర్తీపై స్పష్టమైన విధానాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. యువత గొంతుకై దేశ భవిష్యత్తు చాత్రోన్ గూంజ్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మెదక్ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, నర్సాపూర్ మండలం మైనార్టీ సెల్ అధ్యక్షులు అజ్మత్, నర్సాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్, సర్పంచులు పద్మావతి అశోక్ గౌడ్, ఉదయ్ కుమార్ నాయకులు పాషా, సుధీర్ కుమార్ గౌడ్, నరేష్, సురేష్ గౌడ్, మోహన్ దాస్ గౌడ్ పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ ఫలితాల్లో

## 'దీక్ష' విద్యార్థుల ప్రభంజనం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : బుదవారం ప్రకటించిన కాకతీయ యనివర్సిటీ డిగ్రీ ఫలితాలలో నిర్మల్‌లోని దీక్ష డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రబంజనం సృష్టించారు. యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించికళాశాల కీర్తిని దశదిశలా చాటారు. విభాగాల వారిగా చూస్తే బీఎస్సీ డేటా సైన్స్ విభాగంలో బర నేహా 9.42 గ్రేడ్‌తో అగ్ర స్థానంలో నిలవగా, మావియా తస్నీమ్ 9.28, పోలాస సిందూజ 9.26 కొనిశెట్టి అనూష 9.15 గుమిద్యాల విహారి 9.14 గ్రేడ్లతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే బీఎస్సీ బిజెడ్‌సీ విభాగంలో నాసిర తరన్నం 9.28 షిఫా త బస్సుం 9.22 జోహా కైనియన్ 9.12 సనియా మహివిష్ 9.00 గ్రేడ్లతో ఘన విజయం సాధించారు. బీకాం కంప్యూటర్స్ నందు మాల్సని సాక్షి 8.96 గ్రేడ్లతో యూనివర్శి పరిధిలోనే అత్యున్నత మార్కులు సాధించి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో అత్తుమ గ్రేడ్ పాయంట్లతో ప్రతిభ చాటిన విద్యార్థులను దీక్ష విద్యా సంస్థలు డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, ప్రమోద్‌రావు, ప్రిన్సిపాల్ మెంగ శ్రీధర్, మరియు ఆద్యాపక బృందం ఘనంగా సత్కరించారు. అద్యాపకుల సరైన మార్గదర్శకత్వం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని కళాశాల యాజమాన్యం కొనియాడింది.

## డ్రగ్స్ రహిత 'నిజామాబాద్'

## మన అందరి ధ్యేయం

పోలీస్ కమిషనర్ వెల్లడి



ప్రజాపక్షం/బోధన్: డ్రగ్స్ రహిత నిజామాబాద్ మన అందరి ధ్యేయమని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని మాడల్ హై స్కూల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదక ద్రవ్యాల నిర్మూలన సంబందించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం దాదాపు 400కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియచేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తం అవసరమని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. జూన్ 22నుంచి 26వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏర్పాటు చేసిన యాంటి డ్రగ్ సోల్జర్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించి యాంటి డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రగ్స్‌కు సంబంధించిన డ్రాయింగ్, వ్యాస రచన పోటీలో గెలుపొందిన సాత్విక, శ్రీనిధి, శ్రీజల్, పాటిల్ శృతి, అక్షర కోయల్ శ్రీ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి పోలీస్ కమిషనర్ అభినందించారు.

# సంగారెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి

ఎం.పి సురేష్ షెట్కర్,

ఎంపి రఘునందన్‌రావు




ప్రజాపక్షం /సంగారెడ్డి : ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ సూచించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపి సురేష్ షెట్కర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ ,పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు తో కలిసి కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మౌళిక సదుపాయాల పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి సురేష్ షెట్కర్, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నఅన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం స్వనిధి పథకం కింద అర్హులైన ప్రతి లబ్దిదారునికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసకోవాలని మున్సిపల్ కమీషనర్లకు సూచించారు. పెద్దపూర్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. సంగారెడ్డి ,పటాన్‌చెరు మార్గంలో అవసరమైన రహదారి అభివృద్ధి పనులకు సీఆర్ఎఫ్ కింద ప్రతిపాదనలు పంపాలని అర్ అండ్ బి అధికారులకు సూచించారు.నేషనల్ టీబీ నిర్మూలన కార్యక్రమంలో బాగంగా తండాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భవనాలు ,పాఠశాలలు ,కార్యాలయాలు, నివాస, వాణిజ్య భవనాలలో పిఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ వ్యవస్థల ఏర్పాటు పై విస్తృత అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌డిఓ జ్యోతి జిల్లా స్థాయి అధికారులు ,జాతీయ రహదారులు సంస్థ ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్లు, కమీషనర్లు దిశా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఓటరూ భాగస్వామి

ప్రజాపక్షం/సంగారెడ్డి : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమం జూన్ 2026 నుంచి జిల్లాలో ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా ,పారదర్శకంగా రూపొందించేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం ఓటరు జాబితాలోని తప్పులను సరిద్దిడం మార్పులు, చేర్పులు తొలగింపులను పారదర్శకంగా నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రదాన ఉద్దేశ్యమని తెలిపారు. జూన్ 25 నుంచి జులై 24, 2026 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే (ఎన్యూమరేషన్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.బూత్ స్థాయి అదికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరణ ప్రజలు వారికి అవసరమైన సమాచారంసహకరించాలని కోరారు. జిల్లాలోని రాజకీయ పార్టీలు , ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు స్వచ్ఛంద సంస్థలు ,యువజన సంఘాలు విజయవంతం చేసేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.




కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని ,దానిని ఖచ్చితంగా రూపొందించడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన వివరాలు అందించాలని కోరారు.

‘ రామ్ చరణ్ హీరోగా నటించిన పెద్ది సినిమా ఇటీవల విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో వేదికలో శిల్పకళావేదికలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన చిరంజీవి మాట్లాడుతూ మా అభిమానుల్లో ఆనాటి నుంచి ఈనాటి వరకు క్రమశిక్షణలో ఎలాంటి మార్పు లేదు. ’

రీల్

# కార్తీ హీరోగా ‘సర్దార్ 2’



హీరో కార్తీ తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన ‘సర్దార్’కి సీక్వెల్ ‘సర్దార్ 2’తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ ‘సర్దార్ 2’ కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్సెమెంట్ పోస్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అగ్నిపర్వతంలా ఎగిసిపడుతున్న పేలుడు నేపథ్యంలో, చేతిలో తుపాకీతో ధైర్యంగా నిలబడ్డ హీరో లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా డిజైన్ చేసిన ఈ పోస్టర్ కథలోని యాక్షన్ సూచిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని రేకెత్తిస్తోంది.ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్ గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు.సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లోతెరకెక్కుతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. సామ్ సిఎస్ సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. కార్తీ, సూర్య, మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, యోగి బాబు, రజిషా విజయన్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత ఎ. వెంకటేష్, సంగీతం డిఒపి జార్జ్ సి విలియమ్స్, ఎడిటర్ విజయ్ వేలు కుట్టి.

# పరిశ్రమ సుభిక్షంగా ఉండాలి థియేటర్లు కళకళలాడాలి

## ‘పెద్ది’ సక్సెస్ ఈవెంట్ లో చిరంజీవి



రామ్ చరణ్ హీరోగా నటించిన పెద్ది సినిమా ఇటీవల విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో వేదికలో శిల్పకళా వేదికలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన చిరంజీవి మాట్లాడుతూ మా అభిమానుల్లో ఆనాటి నుంచి ఈనాటి వరకు క్రమశిక్షణలో ఎలాంటి మార్పు లేదు. నేను ఇక్కడికి ఒక అతిథిగా, ఒక సీనియర్ నటుడిగా, సినిమాపై అపారమైన ప్రేమ ఉన్న వ్యక్తిగా వచ్చాను. ఇలాంటి సినిమాలు రావాలి. పరిశ్రమ సుభిక్షంగా ఉండాలి. థియేటర్లు కళకళలాడాలి. ఆ దిశగా పెద్ది ఒక గొప్ప విజయంగా నిలిచింది. ఈ సినిమా చూస్తున్నంతసేపూ నేను ఒక ట్రాన్స్‌కి వెళ్లిపోయిన అనుభూతి కలిగింది. పాత్రలతో మమేకమై వారి పోరాటంలో నేనూ ఒకడినై ప్రయాణించాను. ఇంత పవర్ఫుల్, ఎమోషనల్, మోటివేషనల్ కథను ఎంచుకుని, దానికి రామ్ చరణ్ న్యాయం చేస్తాడని నమ్మి ఈ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు బుచ్చిబాబుకు సభాముఖంగా అభినందనలు. ఇది మట్టి మనుషుల కథ. బుచ్చిబాబు కూడా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి కావడంతో ఆ భావోద్వేగాలను అద్భుతంగా తెరపై ఆవిష్కరించాడు. ఈ కథకు ఆయన నూటికి నూరు శాతం న్యాయం చేశాడు. ఇలాంటి దర్శకుడిని తెలుగు సినీ పరిశ్రమకు అందించిన సుకుమార్ కి కూడా నా అభినందనలు. మట్టిలో దాగి ఉన్న మాణిక్యాలను వెలికి తీయగల దార్శనికుడు సుకుమార్ . ఒక నటుడికి అవసరమైన అన్ని కోణాల్లో పరిపక్వత సాధించి, దానిని 100 శాతం తెరపై చూపించిన రామ్ చరణ్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఒక తండ్రిగా గర్వపడుతున్నాను. రంగస్థలంలో చరణ్ ఎంత అద్భుతంగా నటించాడో చూశాం. అలాంటి పాత్ర మళ్లీ రావాలంటే చాలా కాలం పడుతుందని అనుకున్నాం. మగధీర, రంగస్థలం, అర్‌అర్‌అర్ లాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. కానీ మూడేళ్ల వ్యవధిలోనే పెద్దిలాంటి మరో గొప్ప పాత్ర రావడం ఆశ్చర్యంగా అనిపించింది. ఈ పాత్ర దక్కడం నిజంగా చరణ్ అదృష్టం.సినిమా చూస్తున్నప్పుడు మాకు చరణ్ కనిపించలేదు... పెద్ది మాత్రమే కనిపించాడు. ఆ పాత్రను పూర్తిగా ఒంటబట్టించుకున్నాడు.షూటింగ్ సమయంలో చరణ్ కంటికి గాయం అయింది. ఆ ఫోటో చూసి నేను చాలా భయపడ్డాను. డాక్టర్లతో మాట్లాడిన తర్వాత ప్రమాదం లేదని తెలిసి ఊపిరి పీల్చుకున్నాను. ఎనిమిది కుట్లు పడ్డాయి. అయినా వెనక్కి తగ్గలేదు. ఆ సమయంలో నాకు గూండా సినిమా షూటింగ్ గుర్తొచ్చింది. ట్రైన్ కింద యాక్షన్ సీన్ చేస్తున్నప్పుడు మా నాన్న చాలా భయపడ్డారు. అప్పుడు నేను ‘ప్రేక్షకులను అలరించాలంటే ఇలాంటి రిస్కులు చేయాల్సిందే’ అన్నాను. అప్పుడు ఆయన ఒక మాట చెప్పారు ‘నీకు కొడుకు పుట్టి, వాడు హీరో అయి ఇలాంటి కష్టాలు పడితే అప్పుడు ఒక తండ్రి బాధ తెలుస్తుంది’ అని. చరణ్ కి గాయమైనప్పుడు నాన్న మాట గుర్తుకు వచ్చింది. అయితే తను కష్టాన్ని నమ్ముకోవడం తండ్రిగా నాకు చాలా ఆనందాన్ని ఇస్తోంది. పిల్లలు ఎదుగుతున్నప్పుడు తండ్రికి కలిగే ఆనందం వర్ణించలేనిది. నేను ఆ పుత్రోత్సాహాన్ని నూటికి నూరు శాతం అనుభవిస్తున్నాను. మేము ఎప్పుడూ కష్టాన్ని నమ్ముకున్నాం. ఆ కష్టానికి ప్రతిఫలంగా మీరు మమ్మల్ని గుండెల్లో పెట్టుకున్నారు. అంత గొప్ప స్థానం ఇచ్చిన ప్రేక్షకలోకానికి, అభిమానులకు, పెద్ది చిత్రాన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికీ మా కుటుంబం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్, నిర్మాత వెంకట సతీష్ కిలారు, పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు సానా, డైరెక్టర్ అనిల్ రావిపూడి , ఇషాన్ సక్సేనా , లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# జులై 3న వస్తున్న ‘ఆల్ఫా’



యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్లో రాబోతోన్న భారీ బడ్జెట్ చిత్రం ‘ఆల్ఫా’. ఇండియాలో ఇది వరకెన్నడూ రానట్టుగా అలియా భట్, శర్వారిలతో భారీ బడ్జెట్ యాక్షన్ మూవీని రూపొందించారు. ఆల్ఫా చిత్రం ఆటిట్యూడుకు ఒక వేడుకగా, ప్రతీకగా నిలిచే ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ మూవీ షూటింగ్, అందులోని క్షణాల్ని తాను ఎప్పటికీ మర్చిపోలేను అని అలియా భట్ అన్నారు. సినిమా గురించి అలియా భట్ మాట్లాడుతూ..‘‘ఆల్ఫా’ చిత్రానికి పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమాల్లో ఇది కూడా ఒకటిగా నిలుస్తుంది. షూటింగ్లోని ప్రతీ క్షణాన్ని నేను ఎంతో ప్రేమించాను, ఆస్వాధించాను.‘ఈ చిత్రంలోని కథ ఇద్దరు మహిళ కథానాయికల చుట్టే తిరుగుతుంది. అదే నాకు ఎక్కువగా నచ్చిన అంశం. ఇలాంటి గొప్ప స్క్రిప్ట్లు మనం అరుదుగా చూస్తుంటాం. ఈ ప్రయాణంలో భాగం అవ్వడం నాకెంతో సంతోషానిచ్చింది. ‘ఆల్ఫా’ అనేది ఆటిట్యూడ్కి, సెలబ్రేషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తుంది. ఇలాంటి ఓ అద్భుతమైన బృందంతో కలిసి పని చేయడం నాకు మరింత ప్రత్యేకంగా అనిపించింది.మా దర్శకుడు, నటీనటులు, యాక్షన్ టీమ్, తెర వెనుక సిబ్బంది ఇలా అందరం కలిసి ఎంతో కష్టపడి ఉత్సాహంతో పని చేశాం. మా ఉత్సాహం అంతా కూడా తెరపై ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నాను. ప్రతి ఉదయం సెట్కు వెళ్లడానికి మనస్ఫూర్తిగా ఎదురుచూసేదాన్ని, చిత్రీకరణలోని ప్రతి నిమిషాన్ని ఆస్వాదించాను’ అని అన్నారు.ఆదిత్య చోప్రా నిర్మాణంలో 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ దర్శకత్వం వహించిన 'ఆల్ఫా' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# రజనీకాంత్ -కమల్ హాసన్ చిత్రం ‘ధర్మన్’



రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్ లో వస్తున్న తాజా చిత్రం ధర్మన్ గా నిర్ణయించారు. ఈ చిత్రం టైటిల్ పోస్టర్ ను చెన్నైలో జరిగిన ఈవెంట్ లో అధికారికంగా ప్రకటించారు. ఇది రజనీకాంత్ కు 173వ సినిమా. సిమ్రాన్ , రాశి ఖన్నా నటిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్వత్ మారి ముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రానికి ‘ధర్మన్: ది డెడ్లీ డాక్టర్’ అనే పవర్ఫుల్ టైటిల్ను ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఇందులో రజనీకాంత్ మునుపెన్నడూ చూడని విధంగా ఒక పవర్ఫుల్ డాక్టర్ గెటప్‌లో దర్శనమిచ్చారు. చేతిలో సర్జికల్ బ్లేడ్స్ పట్టుకుని, కళ్లల్లో రౌద్రం కనిపిస్తుండగా ఆయన ఇచ్చిన మాస్ పోజ్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా ఆకాశానికి తీసుకెళ్లింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్ , ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రాక్స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. రజనీకాంత్ సరసన సిమ్రాన్ నటిస్తుండగా, మరో కీలక పాత్రలో రాశి ఖన్నా, అలాగే కామెడీ స్టార్ యోగి బాబు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# సెన్సార్ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు

## ‘దీవాన’ సినిమా నిర్మాతలు



దీవాన సినిమా ఇటీవల రిలీజై థియేటర్లలో నడుస్తోంది. అయినా సెన్సార్ పెట్టిన ఇబ్బందుల గురించి ఆ సినిమా నిర్మాతలు ఆవేదన చెందుతూనే ఉన్నారు. నిర్మాతలు వాసుదేవ్ నొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి మీడియాతో తమ బాధలను పంచుకున్నారు.మేము మూవీ ప్రమోషన్స్, మార్కెటింగ్ లో బిజీగా ఉన్నాం. అదే టైమ్ లో సెన్సార్ నుంచి ఇలా ఇబ్బందులు ఎదురయ్యాయి. మేము రివిజన్ కు వెళ్లే టైమ్ కూడా దొరకలేదు. ఒక విజువల్ కట్ తో పాటు కొన్ని ఆడియో కట్స్ ఇచ్చారు. అవి ఇచ్చే ముందే, ఇవి మీరు తీసేస్తే ఏ సర్టిఫికెట్ ఇస్తామని అన్నారు. అంటే ముందే వాళ్లు ఏ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఫిక్స్ అయ్యారు. మొదట్లో ఆ ట్విస్ట్ గురించి చెబుతారని కొంత భయం ఉండేది. కొన్ని సినిమాలు కథలోని ట్విస్ట్ మీదే ఆధారపడి ఉంటాయి. అయితే మా మూవీ ఇంటర్వెల్ ట్విస్ట్ తర్వాత మరింత బలమైన కథా కథనాలతో ముందుకు సాగుతుంది. హర్షిత్ మూవీ ప్రమోషన్స్ లో బాగా ఇన్వాల్వ్ అయ్యాడు. ఇవాళ తన ఫ్యాన్స్ తో ఒక షో బుక్ చేసుకుని వెళ్తున్నాడు. వచ్చే రెండు మూడు రోజులు కాలేజ్ విజిట్స్, థియేటర్స్ విజిట్ చేయబోతున్నాడు.ఈ సినిమాకు మేము డబ్బులు పెట్టడం దగ్గరే ఆగిపోలేదు. హీరో వేసుకునే షర్ట్, అతని హెయిర్ మా ఇన్వాల్వ్ మెంట్ ఉంది. గతంలో మల్టిపుల్ ప్రాజెక్ట్స్‌కు వర్క్ చేసిన మేము, ఈ ఒక్క మూవీ మీదే వర్క్ చేశాం. దీవాన మూవీ మాకు క్రియేటివ్ గా మంచి సంతృప్తిని మిగిల్చింది. వచ్చే వారంలో కూడా నమ్ముతున్నాం. ఏదేమైనా మేము ఒక మంచి సినిమా చేశామని సంతోషంగా ఉన్నాం. ఆ గ్యాప్ వల్లే సకాలంలో చేరడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి సెన్సార్ దగ్గర ఒక రిప్రజెంటేషన్ ఉండాలనేది నా ఉద్దేశం. అప్పుడు వారి ద్వారా మనం త్వరగా ఏదైనా తెలుసుకోవడానికి వీలుంటుంది. ఇందులో చిన్నా పెద్దా సినిమాలు అనే తేడా లేదు. మన రిప్రజెంటేషన్ ఉంటే అన్ని సినిమాలకు ఉపయోగకరంగా ఉంటుంది.

# రీపోస్ట్‌మార్టానికి వీలుందో లేదో చెప్పండి



ప్రజాపక్షం/హైదరాబాద్: హైకోర్టు ఆదేశాలతో రీ–పోస్టుమార్టం అంశం పరిశీలనలోకి వచ్చింది. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గొర్రెకుంట గ్రామానికి చెందిన ల్యాదెల్ల రాజు మృతి కేసులో రీ–పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉందో లేదో తెలియజేయాలని పోలీసు అధికారులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది ద్వారా పోలీసుల నుంచి స్పష్టమైన సూచనలు తీసుకురావాలని పేర్కొంది. అలాగే దర్యాప్తు తీరుపై పిటిషనర్ చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. తన భర్త ల్యాదెల్ల రాజు మృతి కేసులో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరపలేదని ఆరోపిస్తూ ఆయన భార్య ల్యాదెల్ల ప్రియాంక హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషఒ పై జస్టిస్ టి. మాధవీదేవి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, మృతదేహానికి సంబంధించిన ఫొటోల్లో స్పష్టమైన గాయాల ఆనవాళ్లు కనిపిస్తున్నప్పటికీ పోస్టుమార్టం నివేదికలో వాటి ప్రస్తావన లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు ఫోరెన్సిక్ నివేదికలో గుండెపోటే మరణానికి కారణమని పేర్కొన్నారని తెలిపారు. మరణానికి గల వాస్తవ కారణాలు వెలుగులోకి రావాలంటే రీ–పోస్టుమార్టం అవసరమని, అందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, రీ–పోస్టుమార్టం నిర్వహణ సాధ్యాసాధ్యాలపై పోలీసు అధికారుల నుంచి వివరాలు సేకరించాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు. అలాగే కేసు వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

# ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాల అభివృద్ధికి తెలంగాణ కసరత్తు



**ఒక్కో గమ్యస్థానానికి రూ.500 కోట్ల వరకు నిధుల ప్రతిపాదన**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ వేగవంతం చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో గ్లోబల్ స్టాండర్డ్ టూరిస్ట్ డెస్టినేషన్స్ అభివృద్ధిపై రాష్ట్ర స్థాయి సంప్రదింపుల వర్క్‌షాప్ బుధవారం హైదరాబాద్లోని ది ప్లాజా హోటల్లో నిర్వహించారు. ఒక్కో పర్యాటక గమ్యస్థాన అభివృద్ధికి గరిష్టంగా రూ.500 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందించే ప్రతిపాదన ఈ సమావేశంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి, వారసత్వ శాఖ అధికారులు, పట్టణాభివృద్ధి సంస్థల ప్రతినిధులు, వికారాబాద్ జిల్లా కలెక్టర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల అదనపు కలెక్టర్లు, పరిశ్రమలు, హాస్పిటాలిటీ, విమానయాన, వెల్నెస్, ఆధ్యాత్మిక పర్యాటక రంగాలకు చెందిన నిపుణులు, ప్రైవేట్ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్ 202526లో ప్రకటించిన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాలతో భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధికి ఛాలెంజ్ ఆధారిత విధానాన్ని కేంద్రం అమలు చేయనుంది. ఇందులో పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు , సమర్థవంతమైన గమ్యస్థాన నిర్వహణ, స్థిరమైన పర్యాటక విధానాలు, పోటీ సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించారు. పర్యాటక ప్రాంతాల్లో మెరుగైన రవాణా అనుసంధానం, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రత, అందుబాటు, బ్రాండింగ్, స్థిరమైన నిర్వహణతో సందర్శకులకు అంతర్జాతీయ ప్రమాణాల అనుభూతి కల్పించాల్సిన అవసరాన్ని పాల్గొన్నవారు నొక్కిచెప్పారు. అధిక సామర్థ్యం కలిగిన పర్యాటక ప్రాంతాలను గుర్తించి, గమ్యస్థాన కేంద్రిత అభివృద్ధి నమూనాలను అమలు చేయాలని సూచించారు. ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో పర్యాటక హబ్లను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రొఫెషనల్ స్థాయిలో ప్రణాళిక, పాలన, మార్కెటింగ్, కార్యకలాపాలు, దీర్ఘకాలిక నిర్వహణ కోసం డెస్టినేషన్ మేనేజ్మెంట్ ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది.

# యువకుడి మృతిపై సిబిఐ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : 2022లో సూర్యాపేట జిల్లాకు చెందిన నిఖిల్ అనుమానాస్పద మృతిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని హైకోర్టు ఆదేశించింది. హత్య, బెదిరింపులు, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నేరం జరిగి ఉండవచ్చన్న కోణాలను పరిగణనలోకి తీసుకుని ఎస్ఐఆర్ నమోదు చేయాలని, కాల్‌డేటా, డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ తదితర సాక్ష్యాలను మళ్లీ పరిశీలించాలని సూచించింది. మెడికల్ నివేదికను నిపుణులతో పునఃపరిశీలన చేయించడంతో పాటు పోలీసు, సీఐడీ దర్యాప్తు రికార్డులన్నింటినీ సీబీఐకి అందజేయాలని ఆదేశించింది. ఆరు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి అవసరమైన నివేదికలను కుటుంబ సభ్యులకు అందించాలని పేర్కొంది. కుమారుడు అదృశ్యమైన కొద్ది రోజులకే గాయాలతో మృతదేహం లభించినప్పటికీ నిష్పాక్షిక దర్యాప్తు జరగలేదని ఆరోపిస్తూ నిఖిల్ తండ్రి దారావత్ భాస్కర్ దాఖలు చేసిన పిటిషఒR పై జస్టిస్ ఎఒR . తుకారాంజీ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాదులు నిఖిల్‌ది ఆత్మహత్య కాదని, ప్రేమ వ్యవహారానికి సంబంధించిన బెదిరింపులు, దాడులే మరణానికి కారణమై ఉండవచ్చని వాదించారు. సీసీటీవీ ఫుటేజీ, కాల్‌డేటా, లొకేషఒ వివరాలను సమగ్రంగా పరిశీలించకుండా, పోస్టుమార్టం నివేదిక రాకముందే ఆత్మహత్యగా నిర్ధారించారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు దర్యాప్తు నిష్పాక్షికంగానే జరిగిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి, పంచనామా వివరాల్లో శరీరంపై పలు గాయాలు నమోదయ్యాయని, మరణ కారణంపై స్పష్టత కోసం ఫోరెన్సిక్ పరీక్షలు అవసరమని పేర్కొన్నారు.

ఫోరెన్సిక్ నిర్ధారణలు వెలువడకముందే దర్యాప్తు ఆత్మహత్య కోణంలో సాగినట్లు రికార్డులు సూచిస్తున్నాయని, కీలక ఎలక్ట్రానిక్ సాక్ష్యాల భద్రత, వైద్య నివేదికల విషయంలో లోపాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఎస్టీ యువకుడితో సంబంధాన్ని యువతి కుటుంబం వ్యతిరేకించిన కోణంలో కూడా సమగ్ర దర్యాప్తు జరగలేదని పేర్కొంటూ, వాస్తవాలను వెలికితీసేందుకు స్వతంత్ర దర్యాప్తు అవసరమని తేల్చి కేసును సీబీఐకి బదిలీ చేశారు.

# సంక్షేమ పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల సంక్షేమ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు. ఆనాటి ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ ఇందిరాగాంధి హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికి చెక్కు చెదరలేదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాల్లోనే కుంగిపోయిందని విమర్శించారు. కెసిఆర్ చేసిన అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తుందని, కెసిఆర్ చేసిన అప్పులకు ఇప్పటివరకు రూ.76వేల కోట్లు అప్పు చెల్లించామని అన్నారు. పక్షనేతలైన తండ్రి కొడుకు అల్లుడు కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారు. ప్రజలు నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చాం. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు ఆరోగ్య భీమా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు నిరుపేదలకు రూ.22వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు రైతు రుణమాఫి రైతు భరోసా క్రింద వేల కోట్ల రూపాయలు మహిళల ఉచిత బస్సుకు రూ.13వేల కోట్లు చెల్లించామని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సర్ ప్రోగ్రాం ప్రమాదకరమైందని బూత్ లెవెల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కు ఎంతో విలువైంది. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలని కోరారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రైతులకు పార్టీ కార్యకర్తకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా స్వరూపరాణి, డాక్టర్ కాపా చంద్రకళ, పలువురు మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణే

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగాన్ని సవరించి, రిజర్వేషన్లను రద్దు చేయాలన్నది బిజెపి లక్ష్యమని కాంగ్రెస్ ఆనాడు చేసిన ప్రచారాన్ని సమర్థిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష ర్యాంక్‌లకు చెందిన వారి ఫిరాయింపుల పరంపర గురించి అడగగా జైరామ్ రమేష్ ఇలా అన్నారు. ‘భారత రాజకీయాల స్వయం ప్రకటిత చాణుక్యుడు ఏప్రిల్ 17న లోక్‌సభలో ఎదుర్కొన్న అవమానమే దీనికి ఏకైక కారణం.డీలిమిటేషన్ బిల్లులను ఆమోదింపజేస్తానని ఆయన ప్రధానమంత్రికి వాగ్దానం చేశాడు. లోక్‌సభలో ఆయన 298 మంది సభ్యుల ఓట్లకు మించి కూడగట్టలేకపోయారు. తాను తెగించి మోసపూరితంగా ముందుకు దూసుకువెళ్లగలనని అమిత్‌షా అనుకున్నాడు. కానీ అతడి ఎత్తుగడ బట్టబయలైంది’ అని రమేష్ అన్నారు. ‘ఇప్పుడు హోం మంత్రి అమిత్‌షా ‘థోడ్–ఫోడ్ కి రాజ్‌నీతి’తో బిజీగా ఉన్నాడు. అతడు టిఎంసిని చీల్చాడు. శివసేనను చీల్చుతున్నాడు. లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం అమిత్‌షా చేస్తున్న అన్వేషణను మీరు చూస్తున్నారు. వారు ‘400 పార్లమెంట్ స్థానాలను అడుగుతున్నారు. తద్వారా వారు రిజర్వేషన్లను సవరించడానికి రాజ్యాంగాన్ని సవరించవచ్చు’ అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ అన్నారు. రాజ్యాంగాన్ని సవరించడానికి మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించే ప్రయత్నంలో ఆయన పార్టీలను అన్నింటినీ ఎందుకు చీలుస్తున్నారో మీరే చూస్తున్నారని రమేష్ గుర్తుచేశారు. వారి అసలు లక్ష్యం (ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు) రిజర్వేషన్లు తొలగించడమే కానీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం కాదని జైరామ్ రమేష్ స్పష్ట ం చేశారు. బిల్లులో భాగంగా ప్రతీ రాష్ట్రానికీ 50శాతం లోక్‌సభ సీట్ల పెంపు ఫార్ములాను చేర్చితే ప్రతిపక్షం అంగీకరిస్తుందా అన్న ప్రశ్నకు వారు డీలిమిటేషన్ ఎలా చేస్తున్నారనేదే అసలు సమస్య అని జైరామ్ రమేష్ సమాధానమిచ్చారు. కాంగ్రెస్ వ్యతిరేకత కేవలం 50 శాతం పెంపు గురించే కాదని, 800మంది ఎంపీలు ఏమిచేస్తారనే దానిగురించి కూడా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలియజేశారు.

# క్షమించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా టిపిసిసి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ చాలా తీవ్రమైన అంశమని, ‘సర్’పై మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ‘సర్’ అవగాహన సదస్సులపై జిల్లాల వారీగా తన దగ్గర నివేదిక ఉందని, కాంగ్రెస్ పార్టీ తరుపున ‘సర్’పై అవగాహన సదస్సులు మరిన్ని జరగాలని, సర్‌పై ఇంఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎస్ఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ బెంగాల్ లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పనిచేయాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన ప్రధాన హక్కు అని, ప్రజల ఓటు హక్కును మనం కాపాడాలన్నారు. నిరక్షరాస్యులు, పేదలు, గ్రామీణ ప్రజలకు సర్‌పై అవగాహన లేకపోవచ్చని, గ్రామాలలో ఎన్నికల సమయంలో ఎలాగైతే ఏర్పాటు చేస్తామో అలాగే ఇప్పుడు సర్ కార్యక్రమాలు కూడా ప్రతి ఒక్క అర్హులకు వచ్చేలా చూడాలన్నారు. గ్రామాల్లో టెంట్లు వేసుకుని మన నాయకులు, బిఎల్ఎ 2002 ఓటర్ లిస్ట్, 2025 లిస్ట్ పెట్టుకుని మ్యాపింగ్ చేయాలన్నారు. ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఒక్కరికి వారి హక్కు కాపాడాడే కృషి కాంగ్రెస్ శ్రేణులు చేయాలన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com